thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 337 కరీంనగర్ గురువారం, 12 ఫిబ్రవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### ఈపీఎస్ కనీస పెన్షన్ రూ.3,000కు పెంపు

న్యూఢిల్లీ : పెన్షన్‌దార్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పనుందా? కనీస పెన్షన్‌ను పెంచే అవకాశాలు ఉన్నట్టు సూచనలు అందుతున్నాయి. ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం (ఈపీఎస్) కింద రానున్న నెలల్లో కనీస పెన్షన్‌ను రూ. 1,000 నుంచి రూ. 3,000కు పెంచే అవకాశం ఉన్నట్టు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ప్రస్తుతం ఉద్యోగి జీతంలో 12 శాతాన్ని యజమానులు భవిష్య నిధికి చెల్లిస్తున్నారు. ఇందులో 8.33 శాతం ఉద్యోగుల పెన్షన్ స్కీం (ఈపీఎస)కు జమ అవుతుంది. మిగిలిన 3.67 శాతం ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ)లో చేరుతుంది. దీని ఆధారంగా ప్రస్తుతం రూ. 1,000 కనీస పెన్షన్‌గా చెల్లిస్తుండగా, దాన్ని నెలకు రూ. 3,000కు పెంచే అవకాశం ఉందని ఆ అధికారి తెలిపారు.

# ముగిసిన మున్సిపల్ పోలింగ్..


# ఫలితాలపై ఉత్కంఠ!



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అధికారికంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగింది. గడువు ముగిసే సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే వెసులుబాటు కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో ఓటర్లు ఉత్సాహంగా తమ హక్కును వినియోగించుకున్నారు. కొన్ని చోట్ల చిన్నపాటి ఉద్రిక్తతలు మినహా ఓటింగ్ ప్రక్రియ దాదాపు ప్రశాంతంగానే సాగింది. ఈ ఎన్నికల్లో గెలుపు గుర్రం ఎక్కేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు సర్వశక్తులు ఒడ్డాయి. ప్రచార పర్వంలో నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ వాతావరణాన్ని వేడెక్కించారు. అభ్యర్థుల భవిష్యత్తు ఇప్పుడు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమై ఉంది. మొత్తం 116 మున్సిపాలిటీల్లోని 2582 వార్డుల్లో 12 చోట్ల అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 2569 వార్డుల్లో పోలింగ్ నిర్వహించారు. కార్పొరేషన్ల పరిధిలోని 414 వార్డుల్లో కూడా 2 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 412 చోట్ల ఓటర్లు తమ తీర్పును ఇచ్చారు. కరీంనగర్ పట్టణంలోని 58వ డివిజన్‌లో పరిస్థితులు ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారాయి.

బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య తలెత్తిన ఘర్షణను అదుపు చేయడానికి పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ ఘటనలో పలువురు బీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. కొందరి చేతులు కూడా విరిగినట్లు సమాచారం అందుతోంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యక్తిగత ఫోటోగ్రాఫర్ కూడా ఈ తోపులాటలో గాయపడ్డారు. దొంగ ఓట్లపై ఫిర్యాదు చేసిన తమపైనే పోలీసులు దాడి చేశారని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరసనగా వారు జిల్లా పరిషత్ ముందు రోడ్డుపై బైఠాయించడంతో అక్కడ భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. అదే కరీంనగర్ లోని 34వ డివిజన్‌లో దొంగ ఓట్ల కలకలం రేగింది. హుస్సేనీపుర ప్రాంతంలోని ఒక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో అక్రమంగా ఓట్లు వేస్తున్న ఇద్దరు యువకులను స్థానికులు పట్టుకున్నారు. ఒక స్వతంత్ర అభ్యర్థి తరపున వీరు దొంగ ఓట్లు వేస్తున్నట్లు గుర్తించి పోలీసులకు అప్పగించారు. వీరి వద్ద ఉన్న నకిలీ ఆధార్ కార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమాల నేపథ్యంలో ఆ బూత్‌లో రీపోలింగ్ నిర్వహించాలని ఎంఐఎం అభ్యర్థి డిమాండ్ చేస్తున్నారు. ఈ కుట్ర వెనుక కొందరు స్థానిక నాయకుల హస్తం ఉందని ఆరోపణలు వస్తున్నాయి.

ఇక అందరి దృష్టి ఓట్ల లెక్కింపుపైనే ఉంది. ఈ నెల 13వ తేదీ ఉదయం 8 గంటలకు 136 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అదే రోజు మధ్యాహ్నం కల్లా అభ్యర్థుల గెలుపోటములపై ఒక స్పష్టత రానుంది. గెలిచిన అభ్యర్థులు ఈ నెల 16న జరిగే మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో పాల్గొంటారు. ఫలితాల అనంతరం గొడవలు జరగకుండా రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.




## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే హవా.. పీపుల్స్ పల్స్ అంచనా

హైదరాబాద్ : తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్ ముగిసింది. ఈనెల 13న ఓట్ల లెక్కింపు జరగనుంది. అధికార కాంగ్రెస్ పార్టీ దాదాపు 70 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకోనున్నట్లు 'పీపుల్స్ పల్స్' ఎగ్జిట్ పోల్ సర్వే తెలిపింది. మంచిర్యాల, రామగుండం, నల్గొండ, మహబూబ్‌నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జోరు కొనసాగుతుందని పేర్కొంది. కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను భాజపా కైవసం చేసుకునే అవకాశాలున్నాయని, ఈ రెండు కార్పొరేషన్లలో భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించనుందని అంచనా వేసింది. రాష్ట్రంలోని 68–76 మున్సిపాలిటీలను హస్తం పార్టీ, 29–36 మున్సిపాలిటీలను బీఆర్ఎస్, 3–5 మున్సిపాలిటీలను భాజపా, 0–1 ఎంఐఎం గెలుచుకునే అవకాశం ఉందని తెలిపింది. 8–14 మున్సిపాలిటీల్లో 'నువ్వా నేనా?' అన్నట్టు పోటీ ఉందని పేర్కొంది. మొత్తం 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌కు 36 శాతం, బీఆర్ఎస్‌కు 29.7 శాతం, భాజపాకు 19.3 శాతం, ఎంఐఎంకు 2 శాతం ఓట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని వివరించింది. కాంగ్రెస్ పార్టీ 1210–1290 వార్డుల్లో, బీఆర్ఎస్ 860–930, భాజపా 250–270, ఎంఐఎం 35–44, సీపీఐ 12–17, సీపీఎం 10–14, ఇతరులు 90–110 వార్డులు గెలుచుకునే అవకాశముందని పీపుల్స్ పల్స్ సర్వే తెలిపింది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ కానుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ కూడా గెలిచే అవకాశాలు లేవు.

**కార్పొరేషన్ల వారీగా అంచనాలు..**

**రామగుండం: కాంగ్రెస్ 30-34, బీఆర్ఎస్ 16-20, భాజపా 3-6, ఇతరులు 4-7 డివిజన్లు**

**మంచిర్యాల: కాంగ్రెస్ 39-43, బీఆర్ఎస్ 8-12, భాజపా 6-9, ఇతరులు 1-2**

**కొత్తగూడెం: కాంగ్రెస్ 28-34, బీఆర్ఎస్ 7-9, సీపీఐ 14-16, ఇతరులు 2-4**

**మహబూబ్‌నగర్: కాంగ్రెస్ 26-30, బీఆర్ఎస్ 18-22, భాజపా 6-8, ఎంఐఎం 2-4, ఇతరులు 0-1**

**నల్గొండ: కాంగ్రెస్ 21-26, బీఆర్ఎస్ 8-12, భాజపా 6-10, ఎంఐఎం 2-4, ఇతరులు 1-2**

**నిజామాబాద్: కాంగ్రెస్ 10-16, బీఆర్ఎస్ 2-4, భాజపా 26-31, ఎంఐఎం 8-12, ఇతరులు 1-2**

**కరీంనగర్: కాంగ్రెస్ 14-16, బీఆర్ఎస్ 10-12, భాజపా 24-29, ఎంఐఎం 6-9, ఇతరులు 1-3**




# రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం..

# మూడు కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ..

హైదరాబాద్ : తెలంగాణలోని రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూడుగా విభజించింది. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌గా విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా.. ఈ మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను యథాతథంగా కొనసాగించగా.. సీఎంసీకి శ్రీజన, ఎంఎంసీకి వినయ్ కృష్ణారెడ్డిని కమిషనర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, గ్రేటర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లకు స్పెషల్ ఆఫీసర్ గా స్పెషల్ సెక్రటరీ జయేష్ రంజన్ ఐఏఎస్ కొనసాగనున్నారు. ప్రస్తుత GHMC హెడ్ ఆఫీస్ లోనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ కొనసాగనుంది. తార్నాక హుడా కార్యాలయంలో గ్రేటర్ మల్కాజిగిరి కార్పొరేషన్ ఆఫీస్, మాదాపూర్ నాక్ బిల్డింగ్ లో గ్రేటర్ సైబరాబాద్ కార్పొరేషన్ ఆఫీస్ ఉండనుంది. 150 వార్డు లతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్..74 వార్డులతో గ్రేటర్ మల్కాజిగిరి కార్పొరేషన్, 76 వార్డులతో గ్రేటర్ సైబరాబాద్ కార్పొరేషన్ ఉండనుంది.

**కార్పొరేషన్ జోన్లు.. ప్రాంతాలు ఇలా..**

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్–** ఖైరతాబాద్, చార్మినార్ జోన్లతోపాటు సికింద్రాబాద్, ఎల్బీనగర్ జోన్లలోని కొన్ని ఏరియాలు, బండ్లగూడజాగీర్, శంషాబాద్, జల్‌పల్లి, బడంగ్‌పేట్, తుక్కుగూడ, ఆదిభట్ల, తుర్కయాంజాల్, మీర్‌పేట్, పెద్దఅంబర్‌పేట అన్నీ ఒక కార్పొరేషన్‌లో ఉంటాయి. ఖైరతాబాద్, సికింద్రాబాద్, గోల్కొండ, చార్మినార్, శంషాబాద్, రాజేంద్రనగర్ జోన్లుతో +ఎవీజ ఉంటుంది.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్–** కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్లతోపాటు నార్సింగి, మణికొండ, తెల్లాపూర్, అమీన్‌పూర్, బొల్లారం, నిజాంపేట్, దుండిగల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, మేడ్చల్ ఇందులో ఉంటాయి. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్లు కలిపి ఇప్పుడు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్–జవీజ ఏర్పాటైంది.

**మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్...** ఎల్బీనగర్, సికింద్రాబాద్‌లో కొన్ని జోన్లతోపాటు బోడుప్పల్, ఫీర్జాదిగూడ, పోచారం, ఘట్‌కేసర్, నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, తూముకుంటతో మరో కార్పొరేషన్ ఏర్పాటైంది. మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్లుగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్–వీవీజ అయ్యింది.

## లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం.. మార్చి 9వ తేదీన చర్చ..



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అవిశ్వాస తీర్మానంపై మార్చి 9వ తేదీన చర్చ జరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. స్పీకర్‌ను తొలగించే తీర్మానంపై చర్చ బడ్జెట్ సమావేశాల రెండో భాగం మొదటి రోజు అయిన మార్చి 9న జరిగే అవకాశముందని లోక్‌సభ వర్గాలు తెలిపాయి. కాగా, విపక్షాల నోటీసు నేపథ్యంలో తనపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన చర్చ పూర్తయ్యేంత వరకూ సభకు దూరంగా ఉండాలని స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో రాహుల్ గాంధీకి స్పీకర్ ఓం బిర్లా అవకాశం ఇవ్వలేదని, నిలదీసిన 8 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్న స్పీకర్‌ను తొలగించాలని అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సెక్రటరీకి మంగళవారం కాంగ్రెస్ నోటీసులు అందజేసింది.

దీంతో తనపై వచ్చిన అవిశ్వాస తీర్మాన నోటీసును కొట్టివేసే వరకు సభా కార్యకలాపాలకు హాజరు కాకూడదని ఓం బిర్లా నిర్ణయించుకున్నారు. నోటీసును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సభా ప్రధాన కార్యదర్శిని కూడా ఆయన ఆదేశించారని లోక్‌సభ వర్గాలు తెలిపాయి. కాగా, విపక్షానికి చెందిన మహిళా ఎంపీలు దాడికి ప్రయత్నిస్తారనే సమాచారంతో ప్రధాని ప్రసంగం లేదని సభాపతి స్థానం నుంచి ఓం బిర్లా ప్రకటించడం, మహిళా ఎంపీలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన బీజేపీ ఎంపీపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ క్రమంలో 118 మంది సభ్యుల సంతకాలతో మంగళవారం ఉదయం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశాయి.

## కేంద్రం కీలక నిర్ణయం.. ఇకపై జనగణమన కంటే ముందు వందేమాతరం పాడాల్సిందే!

కేంద్ర ప్రభుత్వం జాతీయ గేయం వందేమాతరం ఆలాపనకు సంబంధించి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. జాతీయ గీతం (జనగణమన) తరహాలోనే వందేమాతరానికి కూడా ప్రోటోకాల్ ఉండాలని స్పష్టం చేస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. బుధవారం (ఫిబ్రవరి 11, 2026) ఉదయం నుంచే ఈ నిబంధనలు అమలులోకి వచ్చాయి. ఇప్పటివరకు అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే పాడేవారు. అయితే, కొత్త మార్గదర్శకాల ప్రకారం.. 1937లో తొలగించబడిన నాలుగు చరణాలను తిరిగి కలిపి, మొత్తం ఆరు చరణాలను పాడాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ పూర్తి గేయం ఆలాపనకు సుమారు 3 నిమిషాల 10 సెకన్ల సమయం పడుతుంది. **కొత్త నిబంధనలు ఇవే:** ముందుగా వందేమాతరం: ఏదైనా ప్రభుత్వ కార్యక్రమం లేదా పాఠశాల ప్రార్థనలో జాతీయ గీతం (జనగణమన) కంటే ముందే వందేమాతరం గేయాన్ని ప్లే చేయాలి లేదా ఆలపించాలి. నిలబడటం తప్పనిసరి: వందేమాతరం పాడుతున్నప్పుడు సభికులందరూ గౌరవసూచకంగా నిలబడటం తప్పనిసరి. అయితే, సినిమా హాళ్లలో డాక్యుమెంటరీలు లేదా సినిమాల్లో భాగంగా ఈ గేయం వస్తే నిలబడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

అధికారిక కార్యక్రమాలు: పద్మ అవార్డుల ప్రదానోత్సవం, రాష్ట్రపతి లేదా గవర్నర్లు హాజరయ్యే కార్యక్రమాలు, వారి రాక, వెళ్లిపోయే సమయంలో ఈ గేయాన్ని ప్రదర్శించాలి. పాఠశాలల్లో అమలు: దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఉదయం ప్రార్థనలో జాతీయ గీతానికి ముందు వందేమాతరం పాడాలని హోం శాఖ సూచించింది. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా (1875–2025) ప్రభుత్వం ఈ మార్పులు చేపట్టింది. గతంలో ఈ గేయంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య తీవ్రస్థాయిలో రాజకీయ వివాదం నెలకొంది. 1937లో కొన్ని చరణాలను తొలగించడం ద్వారా అప్పట్లో కాంగ్రెస్ దేశ సంస్కృతిని విస్మరించిందని బీజేపీ విమర్శించగా, దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం, ఎవరైనా జాతీయ గేయానికి ఉద్దేశపూర్వకంగా అంతరాయం కలిగించినా లేదా గౌరవించకపోయినా 'జాతీయ గౌరవ అవమాన నిరోధక చట్టం' కింద గరిష్టంగా మూడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది.






హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ని రాష్ట్ర ప్రభుత్వం మూడుగా విభజించింది. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)గా విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమించింది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను యథాతథంగా కొనసాగించింది. సీఎంసీకి శ్రీజన, ఎంఎంసీకి వినయ్ కృష్ణారెడ్డిని కమిషనర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 150 డివిజన్లు డీలిమిటేషన్‌తో 243 అయ్యాయి. విలీన మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల పరిధిలో 57 డివిజన్లు ఏర్పాటయ్యాయి. మొత్తం 300 డివిజన్లకు విస్తరించిన జీహెచ్ఎంసీని రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం, అధికార వికేంద్రీకరణ లక్ష్యాలతో మూడు కార్పొరేషన్లుగా విభజించింది. జీహెచ్ఎంసీ చట్టం-1955, సెక్షన్-3(1) ప్రకారం జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీని ఏర్పాటు చేసింది.




హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 5 గంటల లోపు క్యూలో నిలుచున్న వారికి మాత్రమే ఓటు వేసే అవకాశం ఇచ్చారు అధికారులు. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు పోలింగ్ పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 13న ఓట్ల లెక్కింపు ఉంటుందని, 16న కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని అధికారులు తెలిపారు. తుది ఓటింగ్ శాతం మరికొసేపట్లో వెల్లడి కానుంది. ఎన్నికల బరిలో ఉన్నవారి అదృష్టం ఈనెల 13న తేలబోతుంది.

## నిజామాబాద్‌లో ఎంపీ ధర్మపురి అర్వింద్ హల్‌చల్




నిజామాబాద్, ఫిబ్రవరి 11: నిజామాబాద్‌లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ హల్‌చల్ చేశారు. హరిచరణ్ మార్వాడీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో పోలీసులు, ఎన్నికల సిబ్బందిపై అర్వింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థిని పోలీసులు బయటకు పంపేశారని, ఎన్నికల సిబ్బంది తమకు సహకరించడం లేదని ఎంపీకి కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎంపీ.. పోలీసులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 'తన్నులు తింటారు.. సంగతి చూస్తాను' అని పోలీసులను ఉద్దేశించి హెచ్చరించారు. ఈ విషయంపై జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం పంపిన ఎంపీ అర్వింద్.. బీజేపీ అభ్యర్థిని బయటకు పంపిన అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు: కేటీఆర్

తెలంగాణ వ్యాప్తంగా ఇవాళ మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల వేళ అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ క్రమంలో గులాబీ పార్టీ శ్రేణులను ఉద్దేశిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆసక్తికర ట్వీట్ చేశారు. రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ కేటీఆర్ ఫైర్ అయ్యారు. 'మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని అరాచకాలు చేసినా వీరోచితంగా పోరాడిన గులాబీ సైనికులందరికీ పేరుపేరునా హృదయపూర్వక అభినందనలు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకూ పురపాలక సమరంలో మీరు కనబరిచిన పోరాట స్ఫూర్తి బీఆర్ఎస్‌కు కొండంత బలాన్నిచ్చింది. పార్టీలో ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. రెండేళ్ల పాలనలో ఘోరమైన పరిపాలనా వైఫల్యాలను మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్.. ఓటమి భయంతోనే ఈ ఎన్నికల్లో ఇంతటి దౌర్జన్య కాండకు దిగారు. కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో మొదలైన పరాభవం, పట్టణాల్లోనూ తప్పదనే ఆందోళనతోనే అడుగడుగునా రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు' అని కేటీఆర్(ఖు=) అన్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి అక్రమంగా లూటీ చేసిన వేలకోట్ల ప్రజాధనంతో ప్రజాతీర్పునే మార్చాలన్న ఈ కుట్రలను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. పోలీసు శాఖను అడ్డంపెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులపై సాగించిన వేధింపుల పర్వానికి, దాడులకు రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రజలకిచ్చిన హామీలను, మొత్తంగా పరిపాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన పాపం రేవంత్ రెడ్డిని ప్రతినిత్యం వెంటాడుతూనే ఉంటుంది' అంటూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.




**హైదరాబాద్ :తెలంగాణ వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఏడు నగరపాలక సంస్థల్లోని 412 డివిజన్లు, 116 పురపాలక సంఘాల్లోని 2,569 వార్డుల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఓటు వేశారు.**




## కేసీఆర్‌పై చర్యలు తీసుకోరా.. సీఎం రేవంత్‌కు బండి సంజయ్ సూటిప్రశ్న

కరీంనగర్, ఫిబ్రవరి 11: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోసారి విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేస్తున్నారో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ రెడ్డివి ఊకదంపుడు ప్రసంగాలు మాత్రమే అని ఎద్దేవా చేశారు.

కేసీఆర్‌కు రేవంత్ భయపడుతున్నారా? కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకోరా? అని మంత్రి ప్రశ్నించారు. అంతేకాకుండా.. రేవంత్ రెడ్డికి రాజకీయాల మీద ఉన్న శ్రద్ధ.. రైతులపై లేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. యూరియా పక్కదారి పడుతున్నా ఏమీపట్టడం లేదా అని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ నేతలు బ్లాక్‌లో యూరియా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కేంద్రాన్ని విమర్శించడం తప్ప.. రాష్ట్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతు ద్రోహి అంటూ వ్యాఖ్యానించారు. టీవీల ముందు తప్ప.. రైతుల పట్ల బాధ్యత లేదా అని, యూరియా మీద కనీసం సమీక్ష చేయరా అని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ హయాంలో రైతులు గోసపడారని మంత్రి అన్నారు. కాగా.. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా జ్యోతినగర్ ఎస్ఆర్ హైస్కూల్లో కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి బండి సంజయ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.




## తెలంగాణలో ఐఏఎస్‌ల బదిలీలు.. కీలక శాఖల్లో కొత్త నియామకాలు..

హైదరాబాద్, ఫిబ్రవరి 11: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసు కుంది. బుధవారం విడుదలైన అధికారిక ఉత్తర్వుల ప్రకారం.. పలు ప్రధాన శాఖల్లో ఉన్నతాధికారుల మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ బదిలీలు రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులకు దారి తీసే అవకాశం ఉంది.

**బదిలీ అయిన అధికారులు వీరే..** తెలంగాణ ప్రభుత్వం బుధవారం పలువురు ఐఏఎస్ అధికారులని బదిలీ చేసింది. సింగరేణి సీఎండీగా డా.జ్యోతి బుద్ధప్రకాశ్‌ని నియమించింది. ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్ నియమితులయ్యారు. గిరిజన సంక్షేమ ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్ కొనసాగనున్నారు. TGRAC డీజీగా సందీప్‌కుమార్ సుల్తానియాని నియమించింది. పంచాయతీరాజ్ కమిషనర్‌గా దివ్య దేవరాజన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా కాత్యాయని దేవిని నియమించింది. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జీవీగా కాత్యాయనికి అదనపు బాధ్యతలు కేటాయించింది. HMWSSB జాయింట్ ఎండీగా మయాంక్ మిట్టల్, ఇండస్ట్రీస్ ఓ కామర్స్ స్పెషల్ సీఎస్‌గా రఘురాంశర్మకు బాధ్యతలు అప్పగించింది. అలాగే, మంత్రి శ్రీధర్‌బాబు ఓఎస్డీగా అదనపు బాధ్యతల్లో రఘురాంశర్మ కొనసాగనున్నారు.




## సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లకు కొత్త కమిషనర్ల నియామకం..

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) ను మూడు విభాగాలుగా విభజించింది. వీటిలో జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లు ఉన్నాయి. ఈ మార్పులో భాగంగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ఈ మూడు కార్పొరేషన్లకు కొత్త కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ కొనసాగనున్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా సృజన నియమితులయ్యారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డి నియమితులయ్యారు. స్పెషల్ ఆఫీసర్‌గా జయేష్ రంజన్.. జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లకు స్పెషలాఫీసర్‌గా జయేష్ రంజన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మూడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగి.. కొత్త పాలక మండలి వచ్చే వరకూ ప్రత్యేకాధికారిగా జయేష్ రంజన్ కొనసాగనున్నారు.

## భాగ్యనగరంలో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు..



హైదరాబాద్, ఫిబ్రవరి 11: హైదరాబాద్ నగరంలో భారీగా గంజాయి రవాణా విక్రయానికి పాల్పడుతున్న నెట్‌వర్క్‌ను పోలీసులు గుట్టురట్టు చేశారు. వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, ఎస్ఆర్ నగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో 70 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన మనీల్ దలబెహరా, ఇస్మాయిల్ రైతా అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.

**ఒడిశాలో గంజాయి సాగు..** పోలీసుల వివరాల ప్రకారం.. మనీల్ దలబెహరా అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఒడిశాలో గంజాయి సాగు చేశాడు. ఆయన పండించిన గంజాయిని హైదరాబాద్‌లో విక్రయించాలని ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో మేడ్చల్‌లో నివసిస్తున్న ఒడిశాకు చెందిన ఇస్మాయిల్ సహకారంతో నగరంలో మనీల్ దలబెహరా సరఫరా చేశాడు. ఇస్మాయిల్ ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తూ.. గంజాయి విక్రయం నిర్వహిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందని అన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి 70 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.




## ఆన్‌లైన్ లోన్ పేరుతో మోసం... ఐదుగురి అరెస్ట్

హైదరాబాద్ : ఆన్‌లైన్ లోన్స్ పేరుతో అమాయకులను బురిడీ కొట్టిస్తున్న ఐదుగురు నిందితులను హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు.. కీలక ఆపరేషన్ నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన నిందితులను వరంగల్ జిల్లాకు చెందిన బోచు అరుణ్, గద్దం భరత్, సామల తిరుపతి, వెల్లుగొండ తరుణ్, చుక్కా శ్యామ్‌లుగా గుర్తించారు పోలీసులు. వీరంతా మధ్యలోనే చదువులు ఆపేసి కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవారని సమాచారం. అయితే.. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో వారు ఈ తరహా మోసాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చే ఓ లోన్ ప్రకటన చూసి దాన్ని ఓపెన్ చేశారు. మరుసటి రోజు నిందితుల్లో ఒకరైన కిలా పవన్ కుమార్.. తనను ముద్రా లోన్ సర్వీసెస్ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. 3 లక్షల రూపాయల లోన్ మంజూరైందని నమ్మబలికాడు. ప్రాసెసింగ్ ఫీజేమీ లేదని చెబుతూనే ఆధార్, పాన్ వివరాలు సేకరించాడు. ఆ తర్వాత ఇన్సూరెన్స్, టీడీఎస్, ఇతర ఛార్జీల పేరిట ఆమె నుంచి మొత్తం రూ.1,08,274 వసూలు చేశాడు. లోన్ వర్గని బాధితురాలు చెప్పగా.. క్యాన్సిలేషన్ ఫీజు పేరుతో మరి కొంత డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. నిందితులు ముఠాగా ఏర్పడి.. ముద్రా లోన్, ఇతర ఆన్‌లైన్ లోన్ల పేరుతో సోషల్ మీడియాలో ప్రకటనలు ఇచ్చేవారని పోలీసులు తెలిపారు. వడ్డీ లేకుండా, ముందస్తు చెల్లింపులేవీ అవసరం లేదని నమ్మించి.. జనాలను ఆకర్షించే వారని దర్యాప్తులో బయటపడింది. ఆసక్తి చూపిన వారి వ్యక్తిగత డేటా సేకరించి, రాష్ట్రాల వారీగా టార్గెట్ చేశారని పోలీసులు వెల్లడించారు. వీరు కోల్‌కతా, ఢిల్లీలో ఉంటూ బాధితులకు ఫోన్ కాల్స్ చేసేవారని.. ప్రాసెసింగ్ ఫీజు, టీడీఎస్, ఇన్‌కమ్ ట్యాక్స్ ఛార్జీల పేరిట నిందితులు వసూళ్లకు పాల్పడ్డారని పోలీసులు గుర్తించారు. కోల్‌కతాలో వారికి వసతి కల్పించిన కృష్ణ అలియాస్ కిట్టు అనే వ్యక్తి ఈ మోసాలకు పాల్పడే విధానంపై శిక్షణ ఇచ్చేవాడు. ఇలా రోజూ 180 నుంచి 200 ఫోన్ కాల్స్ చేస్తూ బాధితులను దోచుకున్నారు నిందితులు. వసూలైన మొత్తంలో కృష్ణ నుంచి 30 శాతం కమిషన్ తీసుకునేవారని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇలాంటి మోసాల బారినపడకుండా జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు హెచ్చరిస్తున్నారు పోలీసులు.

# ధర్మ సంస్థాపనకై శ్రమించిన తాపసి దయానంద సరస్వతి


## - ఫిబ్రవరి 12... దయానంద సరస్వతి జయంతి



నవీన భారతదేశ సంస్కర్తలలో అగ్రగణ్యుడు దయానంద. స్వరాజ్ నినాదాన్ని తొలిసారి నినదించి భారతీయుల మనసులలో చొప్పించిన దేశభక్తులు దయానంద సరస్వతి జయంతి. స్వామి దయానంద సరస్వతి (ఫిబ్రవరి 12, 1824 – అక్టోబర్ 30, 1883) ఆర్య సమాజ్ స్థాపకుడు, అజ్ఞానాంధకారం, దారిద్ర్యం, అన్యాయాన్ని ఎదురించి పోరాడిన ముని. హిందు ధర్మ సంస్థాపనకు నడుం బిగించిన ఋషి. 1857 ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించి, ఎందరో స్వాతంత్ర్య సమర యోధులకు ప్రేరణ అయిన దేశ భక్తులు. భారతదేశం భారతీయులకే అనే "స్వరాజ్" నినాదాన్ని మొదటి సారిగా ప్రవచించినది ఆయనే. వేదాలను అంత చక్కగా అధ్యయనం చేసిన వారు భారత దేశంలో మరొకరు లేరు అని ఈయన గురించి స్వయంగా అరవిందుల వారే అన్నారు. దయానంద సరస్వతి ఫిబ్రవరి 12, 1824లో గుజరాత్ లోని టంకారా అనే గ్రామంలో ఒక వర్తక కుటుంబంలో జన్మించారు. ఆయన అసలు పేరు మూలశంకర్. ఆయన తండ్రి ఒక మహా శివ భక్తుడు, పద్నాలుగేళ్ల ప్రాయంలో ఒక శివరాత్రి నాడు శివలింగంపై విసర్జిస్తున్న మూషికాలను చూసి, ధర్మం పేరిట జరిగే మోసాలు మూఢనమ్మకాలు గ్రహించి 1846లో భగవంతుడిని వెతకడానికి ఇల్లు వదిలి వెళ్లారు. ఈ ప్రయాణంలో ఎందరో యోగులు మునుల సాంగత్యంలో గడిపి దయానంద అనే నామం పొందారు. భగవంతుని తపనలో భ్రమిస్తూ మథురలోని స్వామి విరజానంద సరస్వతి వద్దకు చేరుకున్నారు. అక్కడే వేదోపనిషత్తులను ఔపోసనం పట్టి గురువు ఆజ్ఞ మేరకు దేశమంతట ప్రబోధించుటకు బయలు దేరారు. ప్రయాణ మార్గమున దేశ స్థితిగతులు, దీనమైన శోచనీయమైన హిందు సమాజమును అవగాహన చేసుకున్నారు. భారతావని బ్రిటిష్ పాలనలో ఉంది. ఒకప్పుడు విశ్వమానవ సామ్రాజ్యానికి, ధర్మ సంస్కృతులకు కేంద్రమైన భారతదేశం ఆ సమయంలో అపారమైన దరిద్రంలో స్వయం వినాశనానికి పరుగులి దుతుండడం చూసి శోకించాడు. హిందు సమాజం ఎటువైపు నుండి చూసినా కుల, మత వర్గ విభేదాలతో ఖండములుగు చున్నది. అంధ విశ్వాసం, అంటరానితనం, సతి, బాల్య వివాహాలు ధర్మం పేరుతో జరుగుతున్న అవాంఛ నీయమైన ఆచారాలు చూసి చలించి పోయారు. భారత దేశాన్ని, హిందు సమాజాన్ని జాగృత పరచాలని సంకల్పించి ఎన్నో పురోగామి సంస్కరణలు చేపట్టారు. అందులో భాగంగా సతి, బాల్య వివాహాలు, అంటరానితనం, వరకట్న దురాచారాన్ని బహిష్కరించారు. స్త్రీ విద్య పరిచయం చేసారు. ఆ ప్రయాణంలో ఎందరో యోగులు మునుల సాంగత్యంలో గడిపి దయానంద అన్న నామం పొందారు. భగవంతుని తపనలో భ్రమిస్తూ మథుర లోని స్వామి విరజానంద సరస్వతి కడకు చేరుకున్నారు, అక్కడే వేదోపనిషత్తులను ఔపోసనం పట్టి గురువు ఆజ్ఞ మేరకు దేశమంతట ప్రభోధించుటకు బయలు దేరారు. ప్రయాణ మార్గమున దేశ స్థితిగతులు, దీనమైన శోచనీయమైన హిందు సమాజమును అవగాహన చేసుకున్నారు. భారతావని బ్రిటిష్ పాలనలో ఉంది, ఒకప్పుడు విశ్వ మానవ సామ్రాజ్యానికి, ధర్మ సంస్కృతులకు కేంద్రమైన దేశం ఇప్పుడు, అపారమైన దరిద్రంలో స్వయం వినాశనానికి పరుగులు దుతుండడం చూసి శోకించాడు. హిందు సమాజం ఎటువైపు నుండి చూసినా కుల, మత వర్గ విభేదాలతో ఖండములుగుచున్నది. అంధ విశ్వాసం, అంటరానితనం, సతి, బాల్య వివాహాలు ధర్మం పేరుతో జరుగుతున్న అవాంఛనీయమైన ఆచారాలు చూసిచలించి పోయి వాటిని ఛేదించుటకని 'పాఖండ ఖండిని ' అన్న పతాకాన్ని ఆవిష్కరించారు. ధర్మ సంస్థాపనకు శాశ్వత సంస్థగా, దేశ సంఘ సంస్కరణకు పునాదిగా, 10 ఏప్రిల్ 1875 న ముంబాయి నగరంలో మొదటి ఆర్యసమాజము స్థాపించారు. మేడంకామా, గురుదత్ విద్యార్థి, వినాయక్ దామోదర్ సావర్కార్, లాలా హర్దయాళ్, మదన్లాల్ ధింగ్రా, రాంప్రసాద్ బిస్మిల్, మహాదేవ గోవిందరనడే, స్వామి శ్రద్ధానంద, మహాత్మా హంసరాజ్, లాలా లజపతిరాయ్ తదితరులు ఆయనచే ప్రభావిత లైనారు. ఈయన రచించిన సత్యార్థ ప్రకాష్ గ్రంథం సుప్రసిద్దమైనది. మత మార్పిడిలు చేసిన వారిని తిరిగి హిందూ మతంలోకి రప్పించడానికి శుద్ధిఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో దయానంద సరస్వతి పెక్కుమందికి కంట్లో నలుసు అయినారు. ఏడు సార్లు విష ప్రయోగాలు జరిగినను బస్తి, న్యోలి అనే యోగ ప్రక్రియ ద్వారా ప్రేగులను ప్రక్షాళనము చేసి వారి ప్రయత్నాలని విఫలము చేసినను, చివరిసారిగా అక్టోబర్ 30, 1883 దీపావళి సాయంత్రము జరిగిన విష ప్రయోగంతో క్షీణిస్తూ ఓంకార నాదంతో సమాధి అవస్థలో మోక్షాన్ని పొందారు. ఆయన తన వాదనలను, ఉద్యమాన్ని సమర్థిస్తూ అథర్వణ, యజుర్వేదం వంటివి భాష్యం చేసిన వేద భాష్యకారుడు. 30 అక్టోబరు, 1883న దయానంద సరస్వతి మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# జీవ పరిణామ సిద్ధాంత కర్త డార్విన్ - ఫిబ్రవరి 12...డార్విన్ జయంతి



డార్విన్ పేరును తలుచుకుంటే ఎవరికైనా వెనువెంటనే గుర్తుకు వచ్చేది పరిణామ సిద్ధాంతం. భూమిపై జీవజాలము ఏ విధంగా పరిణామక్రమం చెందినది అనే విషయముపై పరిశోధనలు చేసి, జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు అయన. ప్రకృతిలో జీవజాతులు వేటికవే ఏక కాలంలో రూపొందినట్లు ఎంతో కాలం నుండి నమ్ముతూ వస్తున్న ప్రజానీకానికి – అదంతా వాస్తవం కాదని ఒక మాతృక నుంచి సకల జీవరాశులు క్రమానుగతంగా పరిణామం చెందుతూ ఏర్పడతాయని, ఈ చర్య అనంతంగా కొనసాగుతూ ఉంటుందని మొట్ట మొదటి సారిగా వివరించినవాడు చార్లెస్ డార్విన్ మాత్రమే. వానరుని నుంచి నరవానరుడు, నరవానరుని నుంచి నరుడు పరిణామ పరంగా ఉద్భవించాడని తెలిపి సంచలనం రేపిన ప్రకృతి శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్. చార్లెస్ రాబర్ట్ డార్విన్ (ఫిబ్రవరి 12, 1809 – ఏప్రిల్ 19, 1882) ఇంగ్లాండుకు చెందిన ప్రకృతివాది. డార్విన్ 1809 ఫిబ్రవరి 12న ఇంగ్లండులోని ష్రూస్బరీలో జన్మించాడు. వైద్యుడైన తండ్రి అన్ని సదుపాయాలూ సమకూర్చినా చదువులో రాణించలేదు. ఆయనను మంద బుద్ధిగా ఉపాధ్యాయులు భావించేవారు. ఆయన చిన్ననాటి నుండి కీటకాలను, ఖనిజాలను సేకరిస్తూ రసాయనిక శాస్త్రంలో పరిశోధనలు చేస్తూ ఉండేవాడు. 16 యేండ్ల వయస్సులో వైద్య విద్యను చదవటం కోసం ఆయనను ఎడిన్ బర్గ్ విశ్వ విద్యాలయంలో చేర్పించారు. కాని మత్తు మందులు లేకుండా చేస్తున్న ఆపరేషన్లను చూచి, ఆ చిత్రహింసకు ఆయన కలత చెంది వైద్య విద్యపై మనసు పెట్టి చదవలేక పోయాడు. ఏదో ఒక డిగ్రీ సంపాదించాలనే తండ్రి కోరికపై కేంబ్రిడ్జిలో తత్త్వశాస్త్ర అధ్య అధ్యయనంలో చేరినా అక్కడా అదే పరిస్థితి. అక్కడి ప్రొఫెసర్ ఓసారి అతడికి 'బీగల్' అనే ఓ నౌక కెప్టెన్ కు పరిచయం చేశాడు. వివిధ దేశాల్లో, దీవుల్లో ఉండే జీవుల పరిశీలనకు అవకాశం ఉంటుందనే ఆలోచనతో డార్విన్ తన తండ్రి వద్దంటున్నా వినకుండా ఆ ఓడ ఎక్కేశాడు. ఆ నౌకాయానంలో డార్విన్ అనేక ప్రాంతాల్లో మొక్కలు, రాళ్లు, శిలాజాలు, కీటకాలు, జంతువులను పరిశీలించి చాలా నమూనాలను సేకరించి ఇంటికి పంపుతూ వచ్చాడు. ఆ పరిశీలనల ఆధారంగానే జీవజాతుల పరిణామ క్రమంపై పుస్తకం రాశాడు. 150 సంవత్సరాల క్రితం రాసిన ఈ గ్రంథం ఇప్పటికీ ప్రామాణికంగా నిలిచి ఉంది. జీవుల్ని ఏదో అతీత శక్తి ఏకకాలంలో సృష్టించ.లేదని, అవి వివిధ దశల్లో స్వాభావిక ఎంపిక ద్వారా పరిణామం చెందాయని డార్విన్ సిద్ధాంతం చెబుతుంది. ఇది ఇప్పటి మైక్రో బయాలజీ, జెనిటిక్స్, మాలిక్యులర్ బయాలజీలను సంఘటిత పరచడంలోనూ, డీఎన్ఏ పరీక్షల్లోనూ ప్రముఖ పాత్ర వహిస్తోంది. చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం భూమి మీది జీవుల పరిణామ క్రమాన్ని తెలియజేస్తుంది. ఆధునిక జీవ శాస్త్రంలో "డార్వినిజం" చాలా మార్పు తెచ్చింది. మూఢ నమ్మకాలను విభేదించడంలో కూడా డార్వినిజం కీలక పాత్ర పోషించింది. మనిషి ఒక రకమైన కోతి జాతి నుంచి పరిణామం చెందుకుంటూ వచ్చాడని, మనిషిని దేవుడు సృష్టించలేదన్న సిద్ధాంతాన్ని తెర మీదకు తెచ్చింది. ఇప్పుడు కూడా సృష్టివాదం పేరుతో డార్వినిజాన్ని వ్యతిరేకించే వాళ్ళు ఉన్నారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం మార్క్సిస్ట్ చారిత్రక భౌతికవాద రచనలకి కూడా ఊపిరి పోసింది. మలేషియా నుంచి రసెల్ వాలేస్ (1823– 1913) అనే వ్యక్తి పంపిన సిద్ధాంత వ్యాసం డార్విన్ వ్యాసం ఒకే విధంగా ఉన్నాయి. డార్విన్ 1844లో తన రచనను, వాలేస్ పంపిన వ్యాసాన్ని లియన్ సొసైటీ జర్నల్‌కు అందచేశాడు. 1858 జూలై 15న శాస్త్రవేత్తల సమావేశం జరిగింది. ఇరువురి వ్యాసాలు పరిశీలించారు. 1844లో డార్విన్ మొదలు పెట్టగా, వాలేస్ 1858లో రాశాడు. కనుక డార్విన్ ముందు రాసినట్టు నిర్ధారించారు. ప్రస్తుతం ప్రపంచంలో కనబడుతున్న రకరకాల ప్రాణులు మొదటి నుంచీ లేవనేది ఈ సిద్ధాంతం యొక్క ప్రధానమైన వాదన. కుక్కలూ, నక్కలూ, తోడేళ్ళూ ఒక జాతివనీ, పిల్లులూ, చిరత పులులూ, పెద్ద పులులూ, సింహాలూ మరొక జాతికి చెందినవనీ, గుర్రాలూ, గాడిదలూ, జీబ్రాలూ ఒకలాంటివే. గతంలో వీటికి తలొక "పూర్వీకుడూ" ఉండి ఉండాలి. ఇంకా వెనక్కెళితే ఈ "ఆదిమ" శునకానికీ, మార్జాలానికీ, అశ్వానికీ జన్మనిచ్చిన మరేదో మృగం ఉండి ఉంటుంది. ఇంకా ప్రాచీన యుగంలో ఈ క్షీరదాలకీ, తక్కిన చేపలూ, తాబేళ్ళూ, జలచరాలూ, పక్షులూ అన్నిటి ఆవిర్భావానికీ దారితీసిన ప్రాణి ఏదో ఉండే ఉంటుంది. వీటిలో కొన్ని శాకాహారులుగా, మరికొన్ని మాంసాహారులుగా రూపొందడానికి భౌతిక ప్రేరణలూ, పర్యావరణ పరిస్థితులే కారణాలు అయి ఉంటాయి. ఇన్నిరకాల ప్రాణులు "వాటంతట అవే" ఎలా ఉద్భవిస్తాయని వీరి వాదన సాగిపోతుంది. ఉదాహరణకు ఆఫ్రికాలో పుట్టుకొచ్చిన మానవ జాతి క్రమంగా ఉత్తర దిశగానూ, తక్కిన ప్రాంతాలకీ విస్తరించిందని శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు. ఉష్ణోగ్రత దృష్ట్యా తొలి మానవులు నల్లని రంగులో ఉండి ఉంటారని అనుకోవచ్చు. ఉత్తరాన ఎండపొడ తక్కువగా పడే ప్రాంతాలకు వెళ్ళినవారి చర్మం తెల్లగా మారక తప్పలేదు. పూర్తిగా నల్లరంగులో ఉన్న ఒక మానవ సమూహం తెల్లగా మారి పోవడానికి 20 వేల సంవత్సరాలు సరిపోతాయని అంచనా. తక్కిన జంతువుల సంగతి ఎలా ఉన్నా, ఒక్క మనిషి జాతినే తీసుకుంటే, చర్మం రంగూ, ముఖ కవళికలూ అన్నీ మెల్ల మెల్లగా మారడానికి జీవపరిణామ ప్రక్రియలే కారణమని రుజువు అవుతోంది. సరిగ్గా ఆ సమయంలోనే ఆల్ఫ్రెడ్ రస్సెల్ వాలెస్ అనే మరో శాస్త్రవేత్త కూడా డార్విన్ చెప్పిన సిద్ధాంతాన్నే వెలువరించాడు. డార్విన్ కు ఉత్తరం కూడా రాసాడు. 1858 లో వీరిద్దరూ సంయుక్తంగా ఒక పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. కూడా! 1859 లో ప్రపంచ ప్రసిద్ధి పొందిన "ది ఆరిజన్ ఆఫ్ స్పీసిస్ ఆఫ్ నేచురల్ సెలక్షన్" పుస్తకాన్ని చార్లెస్ డార్విన్ వెలువరించాడు. ఈ పుస్తకం విడుదలైన రోజునె అన్ని ప్రతులూ అమ్ముడు పోయి సరికొత్త రికార్డును సృష్టించింది. పరిణామ సిద్ధాంతం జీవజాతుల మధ్య సంఘర్షణ ఉంటుంది. సజాతి సంఘర్షణ, విజాతి సంఘర్షణ, ప్రకృతిలో సంఘర్షణ. ఈ సంఘర్షణలో నెగ్గినవే ప్రకృతి ఎన్నిక చేసిన సార్థకమ జీవులు. ఇవే మనుగడను సాగిస్తాయి. ఈ జీవులలోని వైవిద్యాలే తరాలు మారుతూ పోగా కొత్త జాతుల ఉత్పన్నానికి మూలాధారాలు అవుతాయి. ఇది సంక్షిప్తంగా డార్విన్ పరిణామ వాదం. అయితే సృష్టి సిద్ధాంత వాదులు ఈయన వాదనను సమర్థించరు. అయితే బైబిల్ లో చెప్పినట్లు ఏడు రోజుల లోనే సమస్త సృష్టి, సకల జీవ జలాలు రూపొందించ బడినాయని చెబితే మాత్రం నమ్మడం కష్టం. చార్లెస్ డార్విన్ స్వంత దేశమైన బ్రిటన్ లో డార్వినిజం ఎన్నో ప్రశంశలు అందుకుంది. డార్వినిజం ప్రపంచంలో ఎంతో మంది భౌతిక శాస్త్రవేత్తలని, జీవ శాస్త్రవేత్తలని ప్రభావితం చేసి అధునిక భౌతిక శాస్త్ర విజ్ఞానాన్ని ఎన్నో మలుపులు తిప్పింది. అయితే కొన్ని క్రైస్తవ, ఇస్లామిక్ దేశాలలో డార్వినిజం చాలా వివాదాస్పద మయ్యింది. సృష్టి వాదాన్ని వ్యతిరేకించడం దైవ ద్రోహం అని మతవాదుల వాదన. కొన్ని ఇస్లామిక్ దేశాలలో ఈ సిద్ధాంతాన్ని నిషేదించారు. ఈ సిద్ధాంతం తప్పని, జీవ పరిణామక్రమం జరగలేదని వాదించే వారు కూడా ఉన్నారు. ఈయన 74 యేండ్ల వయస్సులో మృతి చెందాడు. సర్ ఐజాక్ న్యూటన్ సమాధి దగ్గరే ఆయన కూడా సమాధి చేయ బడింది. డార్విన్ లేకపోయినా ఆయన ప్రతిపాదించిన జీవ పరిణామ సిద్ధాంతం ఎప్పటికీ నిలిచే ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# అమెరికాలో 'లేఆఫ్' ప్రకంపనలు

## 2009 మాంద్యం తర్వాత ఈ స్థాయి కోతలు ఇప్పుడే!



అమెరికా ఆర్థిక వ్యవస్థలో నిశ్శబ్దంగా మొదలైన సంక్షోభం ఇప్పుడు ఉగ్రరూపం దాలుస్తోంది. 2026 ప్రారంభంలోనే వెలువడిన గణాంకాలు కార్పొరేట్ అమెరికాను వణికిస్తున్నాయి. జనవరి నెలలో నమోదైన ఉద్యోగ కోతలు 2009 నాటి మహా ఆర్థిక మాంద్యం తర్వాత అత్యధిక స్థాయికి చేరుకోవడం గమనార్హం. ఇది కేవలం తాత్కాలిక సర్దుబాటు మాత్రమేనా లేక పెను ముప్పుకు సంకేతమా అన్న చర్చ మొదలైంది. టెక్ రంగం నుంచి మొదలైన సునామీ గడిచిన కొన్నేళ్లుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తిగా ఉన్న టెక్నాలజీ రంగం ఇప్పుడు కుదేలవుతోంది. కరోనా సమయంలో అపరిమితంగా నియామకాలు చేపట్టిన దిగ్గజ సంస్థలు ఇప్పుడు 'రీస్ట్రక్చరింగ్' పేరుతో వేల సంఖ్యలో ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. డిజిటల్ ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం తగ్గడం టెక్ కంపెనీలకు శాపంగా మారింది. వినియోగదారుల కొనుగోలు శక్తి తగ్గడం సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల అమ్మకాలపై ప్రభావం చూపుతోంది. కేవలం టెక్ మాత్రమే కాకుండా.. ఫైనాన్స్, తయారీ, రిటైల్, మీడియా రంగాల్లో కూడా భారీగా కోతలు విధిస్తున్నారు.

**కారణాలు ఇవే..** ఈ భారీ ఉద్యోగ తొలగింపుల వెనుక ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి. నిత్యావసరాలు, సేవల ధరలు పెరగడంతో కంపెనీల నిర్వహణ వ్యయం భారంగా మారింది. పెట్టుబడిదారుల నుంచి వచ్చే నిధుల ప్రవాహం తగ్గడం, అప్పులపై వడ్డీ భారం పెరగడంతో కంపెనీలు వ్యయ నియంత్రణకు మొగ్గు చూపుతున్నాయి. అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు, మార్కెట్ ఒడిదుడుకులు భవిష్యత్తుపై నమ్మకాన్ని తగ్గిస్తున్నాయి. ఫెడరల్ రిజర్వ్‌కు కొత్త సవాల్ ఈ గణాంకాలు అమెరికా కేంద్ర బ్యాంక్ కు ఇప్పుడు సవాల్‌గా మారాయి. ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకు ఇప్పటివరకు వడ్డీ రేట్లను పెంచుతూ వచ్చిన 'ఫెడ్', ఇప్పుడు పెరుగుతున్న నిరుద్యోగ భయం వల్ల తన విధానాలను సమీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ ఉద్యోగ భద్రత క్షీణిస్తే, ప్రజలు ఖర్చు చేయడం తగ్గిస్తారు, తద్వారా ఆర్థిక వ్యవస్థ 'మందగమనం' లోకి జారిపోయే ప్రమాదం ఉంది. స్టార్టప్‌ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. లాభాల బాట పట్టని పక్షంలో నిధులు ఇవ్వబోమని ఇన్వెస్టర్లు తెగేసి చెబుతుండటంతో మనుగడ కోసం ఉద్యోగులను తగ్గించుకోవడం వారికి అనివార్యంగా మారింది. ఉద్యోగుల పరిస్థితి ఏమిటి? ప్రస్తుతం హెల్త్‌కేర్, ఎనర్జీ వంటి రంగాల్లో కొన్ని అవకాశాలు ఉన్నప్పటికీ టెక్ , మేనేజ్మెంట్ రంగాల్లో ఉన్నవారికి కష్టకాలం నడుస్తోంది. ఒకసారి ఉద్యోగం కోల్పోతే తిరిగి అదే స్థాయి వేతనంతో మరో ఉద్యోగం సంపాదించడానికి గతంలో కంటే ఎక్కువ సమయం పడుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2009 నాటి చేదు జ్ఞాపకాలను గుర్తు చేస్తూ 2026 ప్రారంభం కావడం శుభసూచకం కాదు. అయితే ఇది కేవలం ఒక నెల గణాంకం మాత్రమే కాబట్టి రాబోయే త్రైమాసికంలో పరిస్థితులు మెరుగుపడతాయని కొందరు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థపై మోగుతున్న ఈ 'హెచ్చరిక గంటలు' ప్రపంచ మార్కెట్లపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

# లావుగా ఉన్నారా? ఇన్‌ఫెక్షన్ సోకితే మరణం ముప్పు 70% అధికం!

ప్రస్తుత ఆధునిక కాలంలో అధిక బరువు అనేది కేవలం శరీర ఆకృతికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు.. అది ఒక నిశ్శబ్ద హంతకని తాజా పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఈ సమస్య ఇప్పుడు మరో భయానక కోణాన్ని ఆవిష్కరించింది. లావుగా ఉన్న వ్యక్తుల్లో ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ (అంటువ్యాధులు) సోకితే.. వారు ఆసుపత్రిలో చేరడమే కాకుండా.. మరణించే ప్రమాదం సాధారణ వ్యక్తుల కంటే 70 శాతం ఎక్కువగా ఉందని ఒక అంతర్జాతీయ అధ్యయనం తేల్చి చెప్పింది.భారత్ తో పెట్టుకుంటే అట్లుంటదీ లాన్సెట్ అధ్యయనంలో షాకింగ్ నిజాలు ప్రపంచ ప్రఖ్యాత వైద్య జర్నల్ 'ది లాన్సెట్' ప్రచురించిన ఈ అధ్యయనం ఆరోగ్య రంగంలో కలకలం రేపుతోంది. పరిశోధకులు దాదాపు 5.40 లక్షల మందిని సుమారు 13 నుంచి 14 ఏళ్ల పాటు నిశితంగా పరిశీలించి ఈ నిర్ధారణకు వచ్చారు. బాడీ మాస్ ఇండెక్స్ ఎక్కువగా ఉన్నవారిలో ఇన్‌ఫెక్షన్లు సోకినప్పుడు బాడీ త్వరగా స్పందించలేకపోతోంది. ముఖ్యంగా కొవిడ్–19, ఫ్లూ, నిమోనియా వంటి శ్వాసకోశ వ్యాధులు సోకినప్పుడు ఒబెసిటీ ఉన్నవారిలో పరిస్థితి వేగంగా విషమిస్తోంది. అధిక బరువు ఉన్నవారికి ఇచ్చే మందులు లేదా చికిత్సలు ప్రభావం చూపడానికి సమయం పడుతోందని.. ఇది మరణ ముప్పును పెంచుతోందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. వైద్యులు ఏమంటున్నారంటే? అధిక బరువు ఎందుకు ప్రమాదకరం? లావుగా ఉన్నవారిలో ఇన్‌ఫెక్షన్లు ఎందుకు ప్రాణాంతకంగా మారుతున్నాయనే అంశంపై నిపుణులు కీలక కారణాలను విశ్లేషించారు. అధిక కొవ్వు



శరీరంలోని రోగనిరోధక కణాల పనితీరును మందగింపజేస్తుంది. ఒబెసిటీ వల్ల శరీరంలో ఎప్పుడూ ఒక రకమైన అంతర్గత వాపు ఉంటుంది. ఇది కొత్తగా వచ్చే వైరస్‌లతో పోరాడే శక్తిని తగ్గిస్తుంది. లావుగా ఉన్నవారిలో సహజంగానే డయాబెటిస్, హైబీపీ, గుండె జబ్బులు ఉంటాయి. ఇవి ఇన్‌ఫెక్షన్ తీవ్రతను రెట్టింపు చేస్తాయి. అధిక బరువు వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గి, ఆక్సిజన్ సరఫరాలో ఆటంకాలు ఏర్పడతాయి. ూశ్రీంశీ =ఝఎ – ఒత్తిడే కదా అని లైట్ తీసుకుంటున్నారా.. తస్మాత్ జాగ్రత్త! – ముంచుకొస్తున్న ముప్పు.. పరిష్కారం ఏంటి? జీవనశైలి మార్పులు, జంక్ ఫుడ్ సంస్కృతి, శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఒబెసిటీ కేసులు ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. నిపుణులు చెబుతున్న దాని ప్రకారం.. దీన్ని అరికట్టకపోతే భవిష్యత్తులో చిన్నపాటి సీజనల్ వ్యాధులు కూడా పెను ప్రమాదాలుగా మారే అవకాశం ఉంది. "ఒబెసిటీని కేవలం అందానికి సంబంధించిన విషయంగా చూడటం ఆపాలి. ఇది మీ ప్రాణాలను బలితీసుకునే జబ్బు. ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం ద్వారా బరువును అదుపులో ఉంచుకోవడమే దీనికి ఏకైక మార్గం అని వైద్య నిపుణుల హెచ్చరిక ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూక్తి ఇప్పుడు మరింత ఆవశ్యకమైంది. కేవలం వైరస్‌ల నుండి రక్షణ పొందడమే కాదు.. ఆ వైరస్‌లు సోకినా తట్టుకోగలిగేలా మన శరీరాన్ని దృఢంగా ఉంచుకోవాలి. ఈ రోజే బరువు నియంత్రణపై దృష్టి సారించి, రేపటి ప్రమాదాన్ని అరికడదాం.

# కాంగ్రెస్ - బీజేపీ మధ్యలో తమన్నా.. మళ్లీ మొదలైంది!

కర్ణాటక ప్రభుత్వానికి చెందిన అత్యంత ప్రతిష్టాత్మక "మైసూర్ శాండల్ సోప్" బ్రాండ్ అంబాసిడర్ గా మిల్కీ బ్యూటీ తమన్నా భాటియాతో గత ఏడాది మే నెలలోనే సుమారు రూ.6.2 కోట్లకు ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ విషయంలో అప్పట్లో తీవ్ర దుమారమే రేపిందని చెప్పొచ్చు. కర్ణాటకలో హీరోయిన్స్ లేరా.. ముంబైలో జన్మించిన తమన్నా భాటియానే కావాలా అంటూ ప్రతిపక్షాలతో పాటు పలు సంఘాల నుంచి విమర్శలు వచ్చాయి. ఈ సమయంలో.. వివాదం మళ్లీ మొదలైంది. అవును... కర్ణాటక ప్రభుత్వానికి చెందిన "మైసూర్ శాండల్ సోప్" బ్రాండ్ అంబాసిడర్ గా తమన్నాతో గత ఏడాది మే లో చేసుకున్న ఒప్పందం నేటి నుంచి అమల్లోకి రావడంతో వివాదం మళ్లీ మొదలైంది. ఈ సందర్భంగా స్పందించిన ఆ రాష్ట్ర భారీ, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి




ఎంబీ పాటిల్... 2030 నాటికి వార్షిక టర్నోవర్ ను రూ.5,000 కోట్లకు పెంచాలనే మైసూర్ శాండల్ సోప్, కర్ణాటకా సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ (కే.ఎస్.డీ.ఎల్) లక్ష్యాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా... ఒక శతాబ్దానికి పైగా విస్తరించిన వారసత్వం ఇప్పుడు స్పష్టమైన దార్శనికతతో భవిష్యత్తులోకి ధైర్యంగా అడుగుపెడుతోందని.. గొప్ప దార్శనికుడు మహారాజా నల్వాడి కృష్ణరాజ వడియార్ దూరదృష్టితో స్థాపించబడిన కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ కొత్త దశలోకి ప్రవేశిస్తోందని.. ఈ క్రమంలో 2030 నాటికి రూ.5,000 కోట్లు లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఈ పోస్టులో బ్రాండ్ అంబాసిడర్ గా తమన్నా ఉన్న ఫోటో ఉంది!

**మొదలుపెట్టిన బీజేపీ!:** దీంతో.. ఆ రాష్ట్ర బీజేపీ ఎంపీ సుధాకర్ స్పందించారు. ఈ సందర్భంగా.. 'మన కన్నడ భూమి నుంచి చాలా మంది స్టార్స్ ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కర్ణాటకలోని ప్రఖ్యాత అంతర్జాతీయ బ్రాండ్ మైసూర్ శాండల్ సబ్బుకు బ్రాండ్ అంబాసిడర్ గా వేరే రాష్ట్రం, వేరే భాషకు చెందిన సినీ నటిని నియమించింది.. ఆమెకు కోట్లాది రూపాయలు చెల్లించింది.. ఇది కాంగ్రెస్ పార్టీ కన్నడ వ్యతిరేక మనస్తత్వానికి మరో నిదర్శనం' అని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ఈ సందర్భంగా రమ్య, రష్మిక మందన, రుక్మిణి వసంత్, పూజా హెగ్డే, శ్రీనిధి శెట్టి వంటి కన్నడ స్టార్స్ ని ఉదహరిస్తూ.. వీరికీ చిత్ర పరిశ్రమలలో డిమాండ్ ఉందని.. వారికంటే ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వడం కన్నడ ప్రతిభకు అవమానం మాత్రమే కాదు.. మైసూర్ శాండల్ సబ్బు గర్వానికీ తీవ్ర అవమానమనీ అన్నారు. దీంతో... కాంగ్రెస్ – బీజేపీ మధ్య తమన్న ఫైట్ మళ్లీ మొదలైందనే కామెంట్లు వినిపిస్తున్నాయి!

# చురకలు

## సంపాదకీయం

# 136 లో 80 సంతకాలంటే... సీఎం మారుతున్నారా..!

కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పీఠం మార్పుపై చాలా కాలంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ విషయంలో ఫుల్ కాన్ఫిడెంట్ గా ఐదేళ్లు తానే ముఖ్యమంత్రి అన్నట్లుగా సిద్ధరామయ్య చెబుతుండగా.. ఈ విషయంలో డీకే శివకుమార్ మాత్రం వీలైనంత మౌనంగానే కనిపిస్తున్నారు.. అదే సమయంలో కాస్త ముభావంగానూ ఉన్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఓ ఆసక్తికర పరిణామం తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా.. డీకే శివకుమార్ ను సీఎం చేయాలనే మరో కీలక అభ్యర్థన హస్తినకు వెళ్లిందని అంటున్నారు. అవును... 224 సీట్లున్న కర్ణాటక అసెంబ్లీకి 2023లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సొంతంగా 136 స్థానాల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లోనే సీఎం పీఠం విషయంలో సిద్ధరామయ్యతో పాటు డీకే శివకుమార్ పేరు కూడా బలంగా వినిపించింది. అయితే.. ఫైనల్ గా సిద్ధరామయ్యవైపే అధిష్ఠానం మొగ్గు చూపింది! మరోవైపు... సిద్ధరామయ్య రెండున్నరేళ్లు సీఎంగా ఉంటే.. ఆ తర్వాత రెండున్నరేళ్లు డీకే శివకుమార్ ఆ పదవిని చేపడతారనే చర్చా బలంగా జరిగింది. అయితే అది జరగలేదు! ఈ నేపథ్యంలో తాజాగా మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇందులో భాగంగా... సీఎం పదవి విషయంలో డీకే శివకుమార్ కు ఒక ఛాన్స్ ఇవ్వాలని సుమారు 80 - 90 మంది ఎమ్మెల్యేలు హైకమాండ్ ను అభ్యర్థించారని.. ఇప్పుడు నిర్ణయం అధిష్ఠానం చేతుల్లోనే ఉందని చెప్పిన ఎమ్మెల్యే ఇక్బాల్... తమది క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, దానికి తగ్గట్లుగానే తాము ప్రవర్తించాలని.. డీకేకు ఒక అవకాశం ఇవ్వాలనేది తమ అందరి కోరిక అని చెప్పుకొచ్చారు. ఈ సమయంలో.. ఈ మేరకు ఆ 80 మంది సంతకాలు చేశారనే ప్రచారమూ జరుగుతుంది! సరిగ్గా ఈ సమయంలో డీకే శివకుమార్ ఢిల్లీకి వెళ్ళారు.. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పెద్దలతో సమావేశం కానున్నారని అంటున్నారు కానీ.. ఆ పెద్దలు ఎవరనే విషయం మాత్రం చెప్పడం లేదు. ఈ సందర్భంగా స్పందించిన శివకుమార్... తాను డిప్యూటీ సీఎం పదవితో పాటు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ ఉన్నందువల్ల ఈ సమావేశాలు సర్వసాధారణమే అని.. అయినా మీరెందుకు ఈ పర్యటనపై ఇంత ఆసక్తి చుపిస్తున్నారంటూ మీడియాను ఎదురు ప్రశ్నించారు. ఏది ఏమైనా... ఎమ్మెల్యే ఇక్బాల్ సంచలన వ్యాఖ్యల వేళ.. పైగా ఆ మేరకు 80 నుంచి 90 మంది ఎమ్మెల్యేలు డీకే శివకుమార్ కు సీఎం పదవి ఇవ్వాలని సంతకాలు కూడా చేసి, అధిష్ఠానానికి పంపారనే ప్రచారం జరుగుతున్న తరుణంలో.. డీకే శివకుమార్ హస్తిన పర్యటనపై ఆసక్తి నెలకొంది. ఏదైనా కీలక పరిణామాలకు ఛాన్స్ ఉందా అనే చర్చా మొదలైంది! కాగా 224 సీట్లున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 136, బీజేపీ 66, జేడీ(ఎస్) 18, ఇతరులు నాలుగు స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే!

# కొనసాగుతున్న విశాఖ ఉక్కు ఉద్యమం - ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐదేళ్లుగా ఆందోళనలు



విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమించి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు సిద్దమైన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ వైఖరికి, ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా మరో ఉద్యమానికి తెర లేచి ఐదేళ్లు అయింది. విశాఖ పట్టణంలో ఉక్కు పరిశ్రమ కోసం జరిగిన ఉద్యమం.... ఈ ఉద్యమాన్ని తెన్నేటి విశ్వనాథం నాయకుడై ముందుండి నడిపించారు. తాటికొండ ఎమ్మెల్యే టి. అమృత రావు, ప్రత్తి శేషయ్య లాంటి నాయకులు ఈ ఉద్యమంలో పాల్గొ న్నారు. ఈ ఉద్యమంలో భాగంగా 32 మంది ప్రాణాలర్పించారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అంటూ తెన్నేటి విశ్వనాధం నడిపిన ఉద్యమ ఫలితంగా, నాటి దేశ ప్రధాని ఇందిరా గాంధీ 1970 ఏప్రిల్ 10 విశాఖ పట్నంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్ప నున్నట్లు పార్లమెంటు లో ప్రకటించింది. కర్మాగారం కోసం కురుపాం జమీందారులు 6000 ఎకరాలను 1970లో దానం చేసారు. 1970 జూన్ లో ఏర్పాటు చేసిన స్థల పరిశీలన కమిటీతో కర్మాగారపు ప్రణాళికలు మొదల య్యాయి. 1971 జనవరి 20న ఇందిరా గాంధీ చేత కర్మాగారం యొక్క శంకు స్థాపన కార్యక్రమం జరిగింది. 26 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ కర్మాగారం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి 10వేల కోట్ల రూపాయలతో 20 ఎకరాల భూమి నిచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరించింది. 1977 లో నిర్మాణం మొదలైంది. 1979లో రష్యాతో ఒప్పందం కుదుర్చు కున్నారు. రూ.3897.28 కోట్ల అంచనా తో 3.4 మిలియన్ టన్నుల సామర్థ్యం గల కర్మాగార నిర్మాణం ప్రారంభించారు. కానీ నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు ఎదురు కావడం, ప్రభుత్వాలు మారడం వలన ఇది పూర్తవ డానికి 20 ఏళ్లు పట్టింది. పూర్వ సంయుక్త రష్యా సహకారంతో నివేదికలో అనేక మార్పులు చేర్పులు జరిగాయి. నాటి సీఎం బ్రహ్మానంద రెడ్డి కృషికి 1980లో ఇందిరా గాంధీ చొరవ తోడై, ఫలితంగా 80 నుండి 1983 వరకు విశాఖ ఉక్కు కర్మాగారం వేగం పుంజుకుంది. రష్యాతో సాంకేతిక ఒప్పందం చేశారు. 1980 నవంబరులో దస్తూర్ ఉ కో సమగ్ర నివేదిక సమర్పించింది. కోక్ ఒవెన్, సెగ కొలిమి, సింటర్ ప్లాంట్ల రూప కల్పనకై పూర్వపు రష్యా దేశంతో 1981 ఫిబ్రవరిలో ఒప్పందం కుదిరింది. 1982 జనవరిలో సెగ కొలిమి నిర్మాణానికి, ఉద్యోగస్తుల పట్టణానికి శంకు స్థాపన జరిగింది. 1982 ఫిబ్రవరిలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ ఏర్పడింది. 1982 ఏప్రిల్ నెలలో వైజాగ్ స్టీల్, భారతీయ ఉక్కు సంస్థ నుండి విడివడి RINL గా గుర్తింపు పొందినది. వైజాగ్ స్టీల్ గా ప్రసిద్దమైన విశాఖ ఉక్కు కర్మాగారం భారతదేశం లోని అత్యాధునిక మైన ప్రభుత్వరంగ ఉక్కు తయారీ దారు. ఇది, విశాఖ పట్టణం నగరానికి దాదాపు 26 కిలోమీటర్ల దూరంలో, జర్మనీ, సోవియ ట్ రష్యాల సాంకేతిక సహకారంతో నిర్మించ బడింది. 1987 డిసెంబరు నాటికి కర్మాగారం నిర్మాణం పూర్తయ్యింది. 1990 సెప్టెంబరులో ఉత్పత్తి ప్రారంభ మైంది. అప్పటికి నిర్మాణ వ్యయం రూ.9 వేల కోట్లకు చేరుకుంది. 1992 ఆగస్టు 8న అప్పటి ప్రధాని పి.వి. నరసింహా రావు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని జాతికి అంకితం చేశారు. మొదట్లో ఉక్కు ఉత్పత్తిలో దేశంలోనే మొదటగా నిలిచింది. 1994లో మొదటి సారిగా రూ.50 కోట్ల నికర లాభాలను ఆర్జించింది. కానీ కర్మాగారం నిర్మాణం కోసం నిధులు లేక పోవడంతో ఇతర సంస్థలపై ఆధార పడటంతో 1998-2000 సంవత్సరంలో ఖాయిలా పరిశ్రమగా మిగిలింది. ఈ సందర్భంగా ఉక్కు కార్మిక సంఘాలు అనేక ఉద్యమాలు చేపట్టడంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఉక్కు వడ్డీలను ఈక్విటీగా మార్చడం జరిగింది. ఆ తర్వాత ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామిగా ఉంటూ ప్రపంచ శ్రేణి ఉక్కు కర్మాగారంగా నిలబడింది. కర్మాగారం యొక్క ఉత్పత్తులు మన్నిక కలిగినవిగా దేశ విదేశాలలో పేరుగన్నవి. సంస్థ రాబడిలో 80% జపాన్, జర్మనీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, దుబాయ్, సింగపూర్, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా దేశాలకు చేయ బడుతున్న ఎగుమతుల ద్వారానే వస్తున్నది. 33వేల ఎకరాలలో విస్తరించి ఉన్న వైజాగ్ స్టీల్, భారత దేశంలో తీర ప్రాంతంలో ఉన్న ఏకైక ఉక్కు కర్మాగారం. 3.6 ఎం. టి గా ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని 6.3ఎం. టి కి పెంచే రూ. 8,692 కోట్ల విస్తరణ ప్రాజెక్టును నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ 2009 మే 29న ప్రారంభించారు. మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రి పాలనలో దాని ఉత్పత్తి సామర్థ్యం పెంచారు. 2010 నవంబరు 10న నవరత్న హోదా పొందినది. కర్మాగారం విస్తరించి ఉన్న ప్రాంతం, భారత దేశం, ఆసియా మైనర్ లలోనే అతి పెద్దది. సంవత్సరానికి 21 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్నప్పటికీ, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ముడి పదార్థాల కొరత, కొవిద్ 19 మహమ్మారి, మార్కెట్ తిరోగ మన కారణాల వల్ల 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంకు తగ్గింది. విశాఖ స్టీల్ ప్లాంట్ కు స్వంత ఇనుప ఖనిజం గనులు లేక పోవడం వల్ల ఏటా విశాఖ స్టీల్ సుమారు మూడు వేల కోట్లు ఇనుప ఖనిజం కోసం అదనంగా ఖర్చు చేస్తున్నది. టాటా స్టీల్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, జిందాల్ స్టీల్, ఇతర ప్లాంట్లకు... స్వీయ ముడి సరుకు సమకూర్పు లేకుండా, నేషనల్ మినరల్ కార్పొరేషన్ నిర్వహణ లో బైలాదిలా గనులు, ఆస్ట్రియా నుండి ముడి బొగ్గు సరఫరాపై విశాఖ ప్లాంట్ ఆధార పడి ఉండడం వల్ల సమస్యలు ఎదురవు తున్నాయి. ఇలా మరో రెండేళ్ల పాటు నష్టాలు రావడం తథ్యమనే భావనతో, కేంద్రం ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీమాంధ్ర, తెలంగాణకు చెందిన నేతలు పోరాటాలు, కొందరి ప్రాణ త్యాగంతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు సంస్థ నేడు ప్రైవేటు పరం కావడాన్ని ప్రజలు జీర్ణించు కోలేక పోతున్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయి. "విశాఖ ఉక్కు ఆంధ్ర ప్రదేశ్ ప్రజల హక్కు" అనే నినాదం రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తోంది. వైజాగ్ స్టీల్ ను ప్రైవేటీకరణ చేయవద్దంటూ అధికార వైఎస్ఆర్సీపీ తో పాటు టీడీపీ, వామపక్షాలు గళమెత్తాయి. సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు), ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి), ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్టియుసి) లతో కూడిన ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జెఏసి) పేరిట ఉద్యోగులు ప్రైవేటీకరణ చర్యకు వ్యతిరేకంగా ఆందోళనను ఉధృతం చేసే కార్యాచరణ చేపట్టారు. విశాఖ స్టీలు కర్మాగారాన్ని అమ్మాలనే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను మూడేళ్ల కాలంగా ఎదిరిస్తూనే ఉన్నారు.. నిరసన గళాలు ప్రకటిస్తూనే ఉన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవం పేరిట అన్ని ప్రాంతాలలో అఖిల పక్ష సమావేశాలు, కోటి సంతకాల సేకరణ ఉద్యమాల లాంటివి నానాటికీ ఉధృతం అవుతున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారం పైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం పురుదు పోసుకుని, ఫిబ్రవరి 12వ తేదీ నాటికి ఐదేళ్లు పూర్తి అయింది. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం వాపసు తీసుకో వాలని, తీసుకునే వరకూ దీర్ఘకాలిక పోరాటం కొనసాగు తుందని ఆందోళన కారులు స్పష్టం చేస్తూ, ధృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# విశాఖ ఉక్కు కర్మాగారం సాధించిన పోరాట యోధుడు అమృత రావు

## - విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం ఐదేళ్లు దాటిన సందర్భంగా...


తమనంపల్లి అమృతరావు. ఈ పేరు చాలా మందికి తెలియదు. 59 ఏళ్ళక్రితం విశాఖలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది. ఒక పోరాట యోధుని మొండి పట్టు, మొక్కవోని దీక్షతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి విశాఖలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు సఫలం కాగా, నేడు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు, పోరాడి తెచ్చుకున్న ఫ్యాక్టరీ ప్రైవేటు పరం కాబోతోంది. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ పై కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా 2021 ఫిబ్రవరి 12న ప్రారంభమైన ఉద్యమ కార్యాచరణ ఐదేళ్ళ పాటు కొన సాగుతున్న నేపథ్యంలో... నాడు విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం దీక్షా దక్షులై విజయం సాధించి గొప్ప పోరాట యోధుని గుర్తుకు చేసుకోవా ల్సిన తరుణం, సందర్భం. విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు 59ఏళ్లు దాటినా తెలుగు ప్రజల హృదయాలలో ప్రతిధ్వనిస్తున్న నినాదమది. మరచి పోలేని జ్ఞాపకాలను ఇప్పటికీ గుర్తించే అలాంటి నినాదాన్ని అమృత తుల్యం చేసి, శాశ్వతం చేసిన మహనీయుడు తమనంపల్లి అమృతరావు. అలా ఉక్కు పరిశ్రమను ఏర్పాటు, తద్వారా ఆధునిక విశాఖ నిర్మాణంలో ఆయన పాత్ర అపూర్వం, అనిర్వచనీయం. అమోఘం. 1920 అక్టోబరు 21 తేదీన గుంటూరు జిల్లా మేడి కొండూరు మండలం విశదల గ్రామంలో ఆరుళప్ప అన్నమ్మ దంపతులకు అమృత రావు జన్మించారు. చిన్న తనం నుండి రాజకీయాల మీద ఆసక్తి ఎక్కువ ఉండేది. కర్నూలు జిల్లా డోన్లో విద్యాభ్యాసం చేసిన అమృతరావు చిన్న వయస్సు లోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారు. నేతాజీ స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో కొంతకాలం పనిచేశారు. నైజాం ప్రాంతంలో జరిగిన రజాకార్ల ఉద్యమంలో పాల్గొన్న అమృత రావు నిజాం రైల్వే శానిటరీ ఉద్యోగ సంస్థ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. భాషా ప్రాతి పదికన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రకాశం పంతులు నివాస గృహం ఎదుట నిరాహార దీక్ష చేశారు. పొట్టి శ్రీరాములు చేస్తున్న దీక్ష నేపథ్యంలో పలువురు రాష్ట్ర నాయకుల సూచన మేరకు నిరాహార దీక్షను విరమించారు. విశాఖలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని కేంద్రం అప్పట్లో ప్రకటన చేసినా కూడా అది ఆచరణకు నోచుకోలేదు. దాంతో, రాష్ట్ర, కేంద్ర పాలకుల ఉదాశీనత ఓ వైపు, మరో వైపు ఉక్కు పరి శ్రమ వేరే రాష్ట్రాలకు తరలి పోతుందన్న ఆందోళన నేపథ్యంలో చెప్పిన మాటకు కట్టుబడి విశాఖలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయా ల్సిందేనని ఎలుగెత్తి అరచి ఒకే ఒక గొంతు అమృతరావుదే. అంతవరకూ విశాఖకు ఉక్కు పరిశ్రమ కావాలని కోరిన వారే తప్ప దాని, ఆచరణాత్మక కార్యక్రమాలు చేపట్టింది లేదు. పతాకస్థాయికి చేర్చి భారీ ఉద్యమాన్ని నిర్మించిన ఘనత మాత్రం అమృతరావుదే నని చెప్పాలి. ఆ 1966 సంవత్సరం అక్టోబర్ నెల 14వ తేదీన ఓ మహటరీద్యమానికి శ్రీకారం చుట్టిన రోజు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 56 రోజులు అకుంఠిత దీక్ష చేపట్టి, అమరణ దీక్షలోనే అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు బాటను నడచి, చరిత్ర గర్వించిన మరో గొప్ప ఉద్యమానికి ఆవిష్కరణ జరిగిన రోజు. అదే "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" నినాదంతో అమృతరావు చేపట్టిన పోరు. అమృతరావు విశాఖ కలెక్టరేట్ వద్ద ఆమరణ దీక్ష చేపట్టగా.. "విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు"నినాదంతో ఆంధ్ర దేశాన్ని కుదిపేసింది. ఆ ఉద్యమంలో 32 మంది ప్రాణాలను కోల్పోయారు. విద్యార్థులు బందులు నిర్వహించారు. ఈ దీక్ష రాష్ట్రం లోని నిరుద్యోగ యువత, విద్యార్థులను కదిలించింది. వామపక్షాలను ఉద్యమం వైపు అడుగులు వేయించింది. అన్ని రాజకీయ పక్షాలతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో తెన్నేటి విశ్వనాథం, యం.వి.భద్రం, రావిశాస్త్రి, చౌదరి సత్య నారాయణ తదితరులు ప్రసంగించారు. అమృతరావు దీక్షకు మద్దతుగా జనసంఘ్ పార్టీ నాయకులు, ప్రజాపార్టీ నాయకులు దీక్ష చేశారు. రోజులు గుడుస్తున్నా. ఆరోగ్యం క్షీణిస్తున్నా కూడా అమృతరావు వెనక్కు తగ్గలేదు. మొక్కవోని దీక్షతో ఉక్కు కల్పమే చూపించారు. అమృతరావు దీక్ష విరమింపజేయాలని నాటి పీసీసీ అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వావిలాల గోపాలకృష్ణయ్య, అప్పడు దొర, భాట్టం శ్రీరామ్మూర్తి కొందరు కాంగ్రెస్ నాయకులు కేంద్రాన్ని కోరారు. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి పాటు, ఎంపీలు, మంత్రులు అంతా కూడా ఆయనను దీక్ష నుంచి విరమించు కోమని కోరారు. అదేం కుదరదు కచ్చితమైన ప్రకటన రావాల్సిందే, లేదా నా చావును అంతా చూడాల్సిం దేనని భీష్మించుకు కూర్చున్నారు. కాసు బ్రహ్మానందరెడ్డి ఆఘ మేఘాల మీద ఢిల్లీకి వెళ్లి అక్కడి పెద్దలను కలసి విశాఖ ఉక్కు ఉద్యమాన్ని గురించి వివరించారు. అప్పటికే కొత్తగా ప్రధాన మంత్రి అయిన శ్రీమతి ఇందిరాగాంధీ దృష్టిలో విశాఖ ఉక్కు ఉద్యమం పడింది. అమృతరావు మొండితనాన్ని గురించి ఆమె తెలుసు కున్నారు. విశాఖలోనే ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని లిఖిత పూర్వకంగా ఇచ్చారు. కాసు బ్రహ్మానందరెడ్డి విశాఖకు నేరుగా వచ్చి, కలెక్టరేట్ వద్ద దీక్షలో ఉన్న అమ్మృతరావుకు కేంద్రం ప్రకటనను వినిపించి, నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఆ విధంగా విశాఖలో 1971లో ఉక్కు కర్మాగారం ఏర్పడింది. ఆయన సతీమణి చిరంజీవి కూడా గుంటూరులో విశాఖ ఉక్కు కోసం పది రోజులు ఆమరణ దీక్ష చేయడం గమనార్హం. అమృతరావు తమ జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేయ దలచి గాంధీజీ మిషన్ అనే సంస్థను స్థాపించారు. 1956లో ఢిల్లీలో జరిగిన



జాతీయ స్థాయి మధ్య నిషేధ కార్యకర్తల మండలికి సభ్యులయ్యారు. గుంటూరు పట్టణం లో పొట్టి శ్రీరాములు నగర్ ఏర్పాటుకు కృషి చేసి వందలాది నిరు పేదలకు వసతి సౌకర్యం కలిగించారు 1971లో జై ఆంధ్ర ఉద్యమంలో ఆది ఆంధ్ర సేవను స్థాపించారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులతో వారి అభ్యున్నతికి కృషి చేశారు. అమృతరావు హైదరాబాద్ జంట నగరాలలో సెట్విన్ బస్సుల ఏర్పాటుకు కృషి చేశారు. జాతీయ ప్రొహిబిషన్ కౌన్సిల్ సభ్యుడిగా వ్యవహ రించారు. మన పుణ్య భూమి వారపత్రికకు సంపాదకులుగా వ్యవహరిం చిన అమృతరావు 1989 ఏప్రిల్ 27న కన్నుమూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# తెలుగు సాహిత్యానికి ఎం. ఎల్. నరసింహారావు విశేష కృషి - ఫిబ్రవరి 12...మాదిరాజు లక్ష్మీ నరసింహారావు వర్ధంతి



మాదిరాజు లక్ష్మీ నరసింహా రావు భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలకమైన పాత్ర పోషించి, తెలుగు సాహిత్యానికి విశిష్టమైన కృషి చేసిన మహనీయుడు. స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం, ఆయన రచనల గాథలు, సాహిత్య సేవలు తెలుగుభాషా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయి. మాదిరాజు లక్ష్మీ నరసింహారావు నవంబర్ 7, 1928న ఖమ్మం జిల్లా, కామేపల్లి మండలం, పండితాపురం గ్రామంలో జన్మించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం సాగుతున్న సమయంలో ఆయన బాల్యం గడిచింది. చిన్ననాటి నుంచి ఆయన అన్యాయాన్ని తట్టుకోలేని నైజం, సమాజాన్ని మారుస్తామని పట్టుదల ఆయన వ్యక్తిత్వానికి చిరునామాగా మారాయి. నిజాం నిరంకుశ పాలనలో జరుగుతున్న అన్యాయాలను చూశారు. దానికి వ్యతిరేకంగా ఉద్యమాల్లో పాల్గొన్నారు. మహాత్మా గాంధీ సిద్ధాంతాలు ఆయనపై గాఢమైన ప్రభావం చూపాయి. అవి ఆయన వ్యక్తిగత జీవితానికే కాకుండా రచనా కృషికీ మార్గదర్శకంగా నిలిచాయి. మాదిరాజు లక్ష్మీ నరసింహారావు తెలుగు భాషకు సేవ చేయాలని సంకల్పించి, తెలుగు అకాడమీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. తరువాత ఆయన హైదరాబాద్‌లోని కోఠి శ్రీకృష్ణ దేవరాయాంధ్రభాషా నిలయంలో 50 ఏళ్లకు పైగా కార్యదర్శిగా సేవలందించారు. ఆయన గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ వ్యవస్థాపకులుగా, గాంధీ పీస్ ఫౌండేషన్ కార్యదర్శిగా కూడా పనిచేశారు. నిజాం పాలనలో జరుగుతున్న అన్యాయాలపై నిలదీశారు. ప్రజలను చైతన్యవంతులను చేస్తూ, స్వాతంత్ర్య పోరాటానికి ప్రోత్సాహాన్ని అందించారు. భౌతిక పోరాటానికి బదులుగా సాహిత్యాన్ని ఆయుధంగా మార్చుకున్నారు. గాంధీజీ పద్ధతులను అనుసరించి, ప్రజలలో స్వాతంత్ర్య దాహాన్ని పెంచడంలో తన రచనల ద్వారా పాత్ర వహించారు. మాదిరాజు లక్ష్మీ నరసింహారావు సాహిత్య రంగంలో ప్రఖ్యాతి పొందారు. ఆయన దాదాపు 38 గ్రంథాలను రచించారు, వీటిలో రాజకీయ, చారిత్రక, సమాజ పరమైన అంశాలు ప్రతిబింబించాయి. ఆయన రచనల ముఖ్య లక్ష్యం చరిత్రను సజీవంగా ఉంచడమే కాదు, సమాజానికి మార్గదర్శనం చేయడం. ఆయన ముఖ్యమైన రచనలు...స్వాతంత్ర్య సమర సేనానులు తెలంగాణ చరిత్ర: ఉద్యమాలు - పోరాటాలు, హైదరాబాదు స్వాతంత్ర్య ఉద్యమం - తెలంగాణ, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు, స్వామి రామానంద తీర్థ, వందేమాతరం, మహాత్మా గాంధీ సంక్షిప్త జీవిత చరిత్ర, ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు, తెలంగాణ వైతాళికులు. ఈ రచనలు తెలుగు ప్రజలకు చరిత్ర, రాజకీయ చైతన్యం, ఉద్యమాలు, మహనీయుల జీవితగాథలను పరిచయం చేశాయి. మాదిరాజు లక్ష్మీ నరసింహారావు స్వచ్ఛంద సంస్థల ద్వారా సామాజిక సేవలను అందించారు. గాంధీ పీస్ ఫౌండేషన్ ద్వారా సమాజంలోని నిరక్షరాస్యత, అన్యాయంపై అవగాహన కల్పించారు. తన జీవితకాలంలో అనేక పురస్కారాలను అందుకున్నారు...తెలుగు విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం నుండి అయ్యంకి వెంకటరమణయ్య పురస్కారం, భోపాల్‌లోని అఖిల భారతీయ భాషా సమ్మేళనం నుండి సాహిత్యశ్రీ బిరుదు, శ్రీరామనవమి ప్రతిభా పురస్కారం. మాదిరాజు లక్ష్మీ నరసింహారావు కేవలం రచయితగానే కాకుండా, ఒక ఉద్యమ కారుడిగా, గాంధీజీ సిద్ధాంతాల అనుసరనీయుడిగా, తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేసిన సాహితీవేత్తగా నిలిచారు. స్వాతంత్ర్య పోరాటం, తెలుగు భాష అభివృద్ధి, సమాజ సేవల ద్వారా ఆయన పేరు శాశ్వతంగా నిలుస్తుంది. ఆయన జీవితగాథ ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తుంది. ఆత్మసమర్పణ, సాహిత్య సేవ, ప్రజల అభ్యున్నతే ఆయన జీవితసారాంశం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

చురకలు



# అర్ధరాత్రి ఇసుక తోడేళ్లు

అయిజ : ఇసుకాసురులు రాజాపూర్, బాలానగర్ మండలాల్లో రెచ్చిపోతున్నారు. అధికారుల అలసత్వంతో ఈ పరిస్థితి నెలకొంది. అధికార పార్టీ నాయకులు, అధికారుల అండదండలతో అక్రమార్కులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా తయారైంది. రాత్రివేళ పొక్లెయిన్లతో ఇసుక తోడి టిప్పర్లు, ట్రాకర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నాయి.

ఎక్కడెక్కడంటే..: బాలానగర్ మండలం మాచారం, జీడిగుట్టతండా, సూరారం, నందారం, మోతిగణపూర్, కుంటలోపుతండా, రాజాపూర్ మండలం రాజాపూర్, కుచ్చర్‌కల్, ముదిరెడ్డిపల్లి, చెన్నావెల్లి, తిరుమలాపూర్, కల్లెపల్లి, కుత్నేపల్లి, రాయపల్లి గ్రామాల శివారులో వాగుల నుంచి ఇసుక తరలిపోతోంది. రాత్రి ప్లొకెయిన్‌తో తోడి పరిసరాల ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. తెల్లవారుజామున అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రతి ఆదివారం అధికారులు సెలవులో



ఉండటంతో ఇష్టారాజ్యంగా తోడేస్తున్నారు.

**తనిఖీలు నామమాత్రం :** ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తూ నామమాత్రపు తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆయా గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. స్థానికులు ఫిర్యాదు చేస్తే మొక్కుబడిగా ఒక వాహనానికి జరిమానా విధించి వదిలేస్తున్నారు. ఇప్పటికే రెవెన్యూ, పోలీసు శాఖల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు ఫిల్టర్ ఇసుక దందా మరింత ఎక్కువైంది. చర్యలు తప్పవు : ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డినివివరణ కోరగా.. అక్రమ ఇసుక రవాణా తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు. డంపులు సీజ్ చేస్తామని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అక్రమ ఇసుక తరలింపు చేస్తున్నవారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై లెనిన్ హెచ్చరించారు.

# కలగానే భూగర్భ డ్రైనేజీ

అయిజ : జిల్లాలోని మున్సిపాలిటీల్లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం కలగానే మిగిలింది. అలంపూర్ మినహా గద్వాల, అయిజ, వడ్డేపల్లి పట్టణాల్లో ఇంతవరకూ ఏర్పాటు చేయలేదు. వడ్డేపల్లి, అయిజలో గ్రామ పంచాయతీలున్నప్పటి నుంచే భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అయితే నాయకులు దీని గురించి పట్టించుకోలేదు. పట్టణాలుగా అవతరించినప్పటికీ కల నెరవేరలేదు. నీటి సౌకర్యం ఎంత ముఖ్యమో, వినియోగించిన నీరు బయటికి పంపే వసతి కూడా అంతే ముఖ్యం. పురాల్లో మురుగు నీటి నిర్వహణ దయనీయంగా ఉంది. ప్రధాన మురుగు కాలువల నిర్వహణ సక్రమంగా లేదు. అంతర్గత కాలనీల నుంచి వచ్చి ప్రధాన కాలువలో విలీనం అవుతున్నా మురుగు ముందుకెళ్లే పరిస్థితి లేదు. నిర్వహణ సరిగా లేక కాలువలు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

పురపాలిక పరిధిలోని నలువైపులా భూగర్భ మురుగు కాలువ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పుర సమావేశంలోనూ తీర్మానించారు.



అంతటితో సరి. భూగర్భ డ్రైనేజీ నిర్వహణకు నీరు అవసరం పడుతుందని భావించారు. గద్వాల పట్టణానికి నలువైపులా నీటి సౌకర్యం ఉంది. పాత బస్టాండు నుంచి కొత్త బస్టాండు, కృష్ణవేణి చౌరస్తా, అగ్రహారం రహదారి, రాజీవ్‌మార్గ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ మురుగు కాలువ పూడుకుంది. దుర్వాసనతో పాటు దోమలు, వరాహాలు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి.

కొత్త బస్టాండు, పాత బస్టాండు, పెట్రోల్‌బంక్ చౌరస్తా వరకు ఏర్పాటు చేసిన ప్రధాన మురుగుకాలువ వ్యర్థాలతో పూడుకుంది. మాంసం, చేపలు, కోళ్ల దుకాణాల్లోని వ్యర్థాలు కాలువలో పడేస్తున్నారు. అంతర్గత కాలనీల నుంచి చేరుకున్న మురుగు ముందుకెళ్లడం లేదు. 2019లోనే భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు దాని ఊసేలేదు.

పురపాలిక పరిధిలోని శాంతినగర్ పట్టణంలో భూగర్భ మురుగు కాలువ అత్యవసరం. దీన్ని ఏర్పాటు చేయకపోగా ప్రధాన మురుగుకాలువ వెడల్పు తగ్గించారు. వడ్డేపల్లి రహదారి, కన్యకాపరమేశ్వరి ఆలయం కాలనీ, రామాపురం రహదారి కాలనీ వాసులు మురుగుతో అవస్థలు పడుతున్నారు.

## ఎండలు ముదరక ముందే..గొంతెండే..!

డిండి : గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందిస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు గొప్పగా చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మారుమూల పల్లెలకు ఇంకా అరకొరగానే సరఫరా జరుగుతోంది. పైపులైను లీకేజీలు, విద్యుత్తు కోతల పేరుతో వారానికి ఒకటి రెండు రోజులు మాత్రమే నీళ్లొస్తున్నాయి. దీంతో తాగునీటి శుద్ధీకరణ ప్లాంటుల వద్దకే ప్రజలు పరుగులు తీస్తున్నారు.

దాహార్తిలో పల్లెలు..: డిండి మండలంలో జనాభా 42,380. మొత్తం 94 మిషన్ భగీరథ ట్యాంకులకు 12,500పైగా కుళాయి కలెక్షన్లు ఉన్నాయి. గోనబోయినపల్లి, డిండి, ప్రతాప్‌నగర్, బొగ్గులదొన, నిజాంనగర్, చెర్కుపల్లి, దేవత్‌పల్లితండా, కొత్తతండా, వీరబోయినపల్లి, రహమంతాపూర్, జాల్‌తండా, ఎర్రారం గ్రామాల ప్రజలకు సరిపడా భగీరథ నీరు రాక ఆందోళన చెందుతున్నారు. మండలంలో కొన్ని గ్రామాలకు రోజు విడిచి రోజు వస్తుండగా.. మరికొన్ని ఊళ్లకు భగీరథ నీరు సరఫరా కావడం లేదు. సరిహద్దు పల్లెలు ఎత్తులో ఉండడంతో ట్యాంకులకు నీరు చేరడం లేదని అధికారులు చెబుతున్నారు. పాలకులకు, అధికారులకు పలుమార్లు సమస్యను విన్నవించినా పరిష్కారం కావడం లేదు. దీంతో పాత బోర్లు, ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. తలాపునే కృష్ణా నది పారుతున్న తాగునీటి తిప్పలు తప్పడం లేదని వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పంపు సమస్యతో ఆయా గ్రామాలకు నీటి సరఫరా కాకపోవడం వాస్తవమే. సమస్యను పరిష్కరించి ఇంటింటికి నీరందించేలా చర్యలు తీసుకుంటాం.

సాయి వివేక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, డిండి

# జలంతోనే జనం పదిలం



మధిర :ప్రజల కనీస అవసరమైన నీటితోనే ఇతర అవసరాలూ ముడిపడి ఉంటాయి. పట్టణాల్లో అతి ప్రాధాన్య అంశం తాగునీరే. దైనందిన అవసరాలతోపాటు తాగేందుకు ఇబ్బంది లేకుండా రక్షిత మంచినీటి సరఫరా చేయాల్సిన బాధ్యత ఆయా పురపాలిక యంత్రాంగాలదే. ఉభయ జిల్లాల్లో దశాబ్దాల చరిత్ర ఉన్న పట్టణాలతో పాటు కొత్తగా ఆవిర్భవించిన మున్సిపాలిటీల్లోనూ పూర్తి స్థాయిలో అవసరాలు తీరటం లేదు. చాలాచోట్ల రోజు విడిచి రోజే నీరందిస్తున్నారు. పైపులైన్ లీకేజీలు, నీటి వనరుల కొరత, అసంపూర్తి నిర్మాణం లాంటి కారణాలతో కొన్ని కాలనీవాసులు ఇబ్బందిపడుతున్నారు. కొలువుదీరే నూతన పాలకవర్గాలు నిత్యం నీరందేలా చూడాలని అన్ని పురాల ప్రజలు కోరుతున్నారు. పురపాలకంలో తాగునీటి సరఫరాకు ఢోకా లేకున్నా లీకులు అడ్డంకిగా మారాయి. భగీరథ పైపులైన్లతోపాటు స్థానిక పైపులైన్ల లీకేజీలతో రోజూ ఏదో ఒక ప్రాంతంలో సమస్య ఎదురవుతూనే ఉంటోంది. ప్రధానంగా స్టేషన్ రోడ్డు సమీపంలోని ఆర్‌వోబీ ఖానా ఎదురుగా అప్రోచ్ రహదారిపై నిత్యం రెండు గంటలపాటు తాగునీరు వృథా అవుతోంది. పట్టణ పరిధిలో 7 శివారు కాలనీలు, నాలుగు విలీన గ్రామాలున్నాయి.

'పురపాలకంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఎక్కడా లేదు. లీకులప్పుడు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాం. ఆర్‌వోబీ ఖానా వద్ద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం.'

కృష్ణారెడ్డి, తాగునీటి విభాగం బాధ్యులు.

మొత్తం వార్డులు: 22
జనాభా: 32వేల పైచిలుకు
సరఫరా తీరు: ప్రతి రోజు
నిత్యం కావాల్సిన నీరు: 50 లక్షల లీటర్లు
సరఫరా చేస్తున్నది: 45 లక్షల లీటర్లు
ఇబ్బంది ఉన్న ప్రాంతాలు: ఇల్లందులపాడు, దిడుగుపాడు, అంబారుపేట
లీకేజీ సమస్య: బంజారా కాలనీ, వైరారోడ్డు, దిడుగుపాడు, సిద్ధారెడ్డి బజారు, సుందరయ్యనగర్.

పట్టణానికి ఆనుకొని వైరా జలాశయం ఉంది. మూడు నియోజకవర్గాల్లోని 470 గ్రామాలకు నిత్యం 10కోట్ల లీటర్ల నీటినందిస్తున్నారు. కానీ చెంతనే ఉన్న వైరాలో మాత్రం ఆదినుంచీ రోజువారీగా నీరు అందటం లేదు.

వైరా పట్టణంతోపాటు గండగలపాడు, బ్రాహ్మణపల్లి, సోమవరం, విలీన గ్రామాలు లాలాపురం, పల్లిపాడు, దుద్దెపుడి, శాంతినగర్ మున్సిపాలిటీలో భాగం.

కొన్నిచోట్ల మూడు రోజులకోసారి, ఇంకొన్నిచోట్ల నాలుగు రోజులకు అందిస్తున్నారు. పట్టణంలోనూ కొరత ఉంది.

మూడు దశాబ్దాల క్రితం వేసిన అంతర్గత పైపులైన్లనే వినియోగిస్తున్నారు. భగీరథ పైపులైన్లు కేవలం ట్యాంకుల వద్దకు మాత్రమే పూర్తి స్థాయిలో ఉండగా ఇతరచోట్ల పాత లైన్లు ఎక్కువ ఉన్నాయి.

పట్టణ విస్తీర్ణం పెరిగినా పంపిణీ వ్యవస్థ మెరుగుపడలేదు. దీంతో శివారు గ్రామాలు, వైరా ఇందిరమ్మ కాలనీ, సుందరయ్యనగర్, లీలా సుందరయ్యనగర్‌లో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

రోజుకు మూడుసార్లు ట్యాంకులు నింపుతున్నా లీకులు అవసరాలకు గండికొడుతున్నాయి.

మొత్తం వార్డులు: 20
జనాభా: 36,500 సరఫరా తీరు: రోజు విడిచి రోజు
నిత్యం కావాల్సిన నీరు: 45 లక్షల నీరు (రోజుకు)
సరఫరా చేస్తున్నది: 30 లక్షల నీరు (రోజుకు)

ఏడాది క్రితమే మున్సిపాలిటీగా రూపుదాల్చిన ఏదులాపురంలో ఇంటింటికీ భగీరథ పైపులైన్ నిర్మాణం పూర్తికాలేదు. కాలనీలు వేగంగా విస్తరిస్తుండటమే ఇందుకు కారణం. ప్రధాన రహదారుల, వీధుల వెంట లీకులతో నీరు వృథాగా పోతోంది.

రాజీవ్ గృహకల్ప కాలనీలో మున్నేరు పక్కన ఏర్పాటు చేసిన ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా తాగేందుకు పనికి రావట్లేదు. భగీరథ పైపులు కాలనీ మొత్తానికి చేరలేదు. కూడళ్ల వద్ద ట్యాపులు ఏర్పాటు చేశారు. తరచూ పైపులైన్లు దెబ్బతింటున్నాయి.

కొత్త కాలనీలైన సింహాద్రినగర్ కాలనీ, శ్రీరాంనగర్, సాయిబృందావన కాలనీ, ఆటోనగర్, వెంపటి నగర్‌లో పైపులైన్లు పూర్తి స్థాయిలో ఏర్పాటుకాలేదు. శివారు గృహాలు బావి నీటిపై ఆధారపడాల్సి వస్తోంది. రాజీవ్ గృహకల్ప, వెంకటగిరి, ఇందిరమ్మ కాలనీ, గుదిమళ్ల, తెల్దారుపల్లి తదితర ప్రాంతాల్లో గతేడాది తలెత్తిన నీటి సమస్య పునరావృతం కాకుండా చూడాలి.

మొత్తం వార్డులు: 32
జనాభా: 58,647
సరఫరా తీరు: రోజు విడిచి రోజు
నిత్యం కావాల్సిన నీరు: 10 ఎంఎల్‌డీ
సరఫరా చేస్తున్నది: 6.5 ఎంఎల్‌డీ (భగీరథ), 1.5 ఎంఎల్‌డీ (స్థానిక బోర్లు)

సత్తుపల్లిలో పైప్‌లైన్ లీకేజీలే ప్రధాన సమస్య. ప్రధాన పైపులతోపాటు అంతర్గత పైపులైన్లు పలు సందర్భాల్లో పగిలిపోతున్నాయి. పాత పైపులు ఉన్న ప్రాంతాల్లో చెట్ల వేర్లు వాటిల్లోకి చొచ్చుకపోయి నీరు పారకుండా చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో రెండు రోజుల తర్వాత మరమ్మతులు చేస్తుండటంతో తిప్పలు తప్పటం లేదు.

విద్యానగర్‌రోడ్డు, బాలాజీ టాకీసు రోడ్డు, శ్రీనివాస టాకీస్ రోడ్డు, సిద్ధారం రోడ్డు, తుమ్మూరు రామారావు వీధి, వాణివిద్యాలయం రోడ్డు ప్రాంతాల్లో పాత సిమెంటు పైపులు తరచూ పగిలిపోతున్నాయి. కొత్త వాటి ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్టు ఏఈ సురేశ్ తెలిపారు.


ఎప్పటికప్పుడు ఎయిర్ వాల్స్‌ను పరిశీలించుకుంటూ పాత పైపుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తే సమస్యలు తొలగుతాయి.

మొత్తం వార్డులు: 23
జనాభా: 45,000
సరఫరా తీరు: నిత్యం
నిత్యం కావాల్సిన నీరు: 6 ఎంఎల్‌డీ
సరఫరా చేస్తున్నది: 4.5 (భగీరథ), 1.5 ఎంఎల్‌డీ స్థానిక బోర్లు

కొత్తగా ఏర్పాటైన కల్లూరు పురపాలకంలో 1600 గృహాలున్నాయి. మిషన్ భగీరథ నీరు చాలకపోవటంతో స్థానిక బోర్ల ద్వారా ట్యాంకుల్లోకి నీరు ఎక్కిస్తూ సరఫరా చేస్తున్నారు. ప్రతి వీధిలో మెరక ప్రాంతాలకు సరిగా అందటం లేదు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్, విద్యానగర్, శివారు లోకారంలో సమస్య ఉంది. మోటార్లతో నీటిని అందిస్తున్నామని పురపాలక మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు తెలిపారు.

మొత్తం వార్డులు: 20
జనాభా: 26వేలు
సరఫరా తీరు: నిత్యం సరఫరా
నిత్యం కావాల్సిన నీరు: 2.6 ఎంఎల్‌డీ
సరఫరా చేస్తున్నది: 2.36 ఎంఎల్‌డీ

# గిరగిర గింగిరాలు..



ఖమ్మం : అంగన్‌వాడీ కేంద్రాల పనితీరులో పారదర్శకత పెంచేందుకు రిజిస్టర్ల నమోదు ప్రక్రియలో సాంకేతికతను జోడించారు. లబ్ధిదారులకు అందుతున్న సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రభుత్వం గతంలో స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేసింది. కేంద్రంలో సిబ్బంది, పిల్లల హాజరు నుంచి పౌష్టికాహారం పంపిణీ వరకు ప్రతి అంశాన్ని డిజిటలైజ్ చేయడమే దీని ప్రధాన ఉద్దేశం. అయిదేళ్ల క్రితం పంపిణీ చేసిన స్మార్ట్‌ఫోన్లు మొరాయిస్తుండటంతో క్షేత్ర స్థాయిలో వివరాల నమోదు ఓ ప్రహసనంగా తయారైంది.

**ఇవీ యాప్‌లు**

ప్రభుత్వం అంగన్‌వాడీ సేవల్లో రెండు యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫోన్‌లో విధిగా రికార్డు చేయాలి. పోషణ్ ట్రాకర్ యాప్‌లో గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లల ఎదుగుదల, టీకాలు, అనుబంధ పోషకాహారం పంపిణీ వివరాలు నమోదు చేయాలి. న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్(ఎన్‌హెచ్‌టీఎస్) యాప్‌లో హాజరు, గుడ్లు, పాలు, బాలమృతం పంపిణీ వంటి వివరాలను అప్‌లోడ్ చేయాలి.

**జిల్లాలో ఇలా..**

అంగన్‌వాడీ కేంద్రాలు: 1,840
బాలింతలు: 6,177
గర్భిణులు: 6,215
చిన్నారులు: 30,016
టీహెచ్‌ఆర్ పొందుతున్న పిల్లలు (7 నెలలు నుంచి 3 ఏళ్లు): 33,208

1. ర్యామ్ తక్కువగా ఉండటం, పాత ఫోన్లు కావటంతో భారీ అప్‌డేట్‌లను తట్టుకోలేకపోతున్నాయి. యాప్ తెరవగానే ఫోన్ హ్యాంగ్ అయి, సేవలు నిలిచిపోతున్నాయి.
2. ఇంటర్నెట్ బఫరింగ్ సమస్యతో డేటా, ఫొటోలు, ఫేస్ రికగ్నైజేషన్ చేయాలంటే విసుగు వస్తోందని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. సకాలంలో డేటా నమోదు కాకుంటే అధికారులు వివరణ అడుగుతుండటంతో ఒత్తిడికి గురవుతున్నారు.
3. రాత్రి వేళల్లో కూడా సొంత ఫోన్లు, డేటా వినియోగించి విధులు నిర్వహిస్తున్నారు.

'ఫోన్ల సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారులకు విషయాన్ని నివేదించాం. ప్రభుత్వం కొత్తగా అధునాతన ట్యాబ్‌లు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. త్వరలోనే అందుబాటులోకి వస్తాయి.'

వేల్పుల విజేత, డీడబ్ల్యూవో

# కాసులకు కక్కుర్తి.. రైతులను కష్టాల్లోకి నెట్టి

చందంపేట : ప్రభుత్వాలు..పాలకులు.. అధికారులు మారడం తప్ప రైతుల గోస తీరడం లేదు. దీంతో ఆరు గ్రామాలు, ఎనిమిది వేల ఎకరాల సాగు భూమి నిషేధిత జాబితాలో నుంచి తొలగించే వారే కరవయ్యారు. ఎనిమిదేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేవారే లేరని రైతులు వాపోతున్నారు.

2017-18లో అప్పటి అధికారులు భూములకు అక్రమ పట్టాలివ్వడంతో నలుగురు తహసీల్దార్లు, ఆరుగురు వీఆర్వోలు సస్పెండ్‌కు గురికావడంతో పాటు పలువురు జైలు శిక్షనూ అనుభవించారు. చందంపేట మండల పరిధిలోని అచ్చంపేటపట్టి గ్రామంలో సర్వే నెం.50లో 850 ఎకరాలు, బొల్లారం గ్రామ సర్వే నెం.50లో 300 ఎకరాలతోపాటు కంబాలపల్లి, పొగిళ్ల, రేకుగలద్ద, చిత్రియాల గ్రామాల్లో ఎనిమిది వేల ఎకరాలు ఎనిమిదేళ్లయినా నిషేధిత జాబితాలోనే ఉండిపోయాయి.

**అసలేం జరిగిందంటే..:** ఆయా గ్రామస్థులకు చెందిన పట్టా భూములు అటవీ, ప్రభుత్వ భూముల చెంత ఉండటంతో అప్పటి అధికారులు కాసులకు కక్కుర్తిపడి.. సమీపంలోని అటవీ, ప్రభుత్వ, గుట్టలను సైతం అక్రమ పట్టాలు చేశారు. ఇలా అప్పట్లో దాదాపు 12 వేల ఎకరాలు అక్రమ పట్టాలు బట్టబయలయ్యాయి. దీంతో పలువురు అధికారులు



అక్రమ పట్టాలను తొలగించే క్రమంలో దాదాపు 4వేల ఎకరాలకుపైగా తొలగించగా.. మిగతా 8 వేల ఎకరాలు నేటికి నిషేధిత జాబితాలో ఉండిపోయాయి.

**కొనలేక.. అమ్ముకోలేక:** నాగార్జునసాగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురైన గ్రామాల్లో ఆ ఆరు గ్రామాలున్నాయి. అప్పట్లో ముంపువాసులకు ఒక్కో కుటుంబానికి ఐదెకరాల చొప్పున డీఫాం పట్టాలను జారీచేశారు. ఈ భూమి సైతం నిషేధిత జాబితాలో ఉండటంతో విక్రయించడం, కొనుగోలు చేసే పరిస్థితి కన్పించడం లేదు. ఎనిమిదేళ్లుగా రైతులు రైతుబంధు, భరోసా, బీమా, పంట రుణాలు పొందలేకపోతున్నారు.

**సర్వే చేస్తున్నాం..: శ్రీధర్‌బాబు, తహసీల్దార్**కలెక్టర్ ఆదేశాల మేరకు ఎనిమిది వేల ఎకరాల భూమిని సర్వే చేసేందుకు ఆరుగురు సర్వేయర్లను మండలానికి ఎంపిక చేశారు. ఇప్పటికే బొల్లారం, అచ్చంపేటపట్టి గ్రామాల్లోని ఈ భూములను దాదాపు పరిష్కరించాం. కంబాలపల్లి, పొగిళ్ల గ్రామాల్లో సర్వే చేపడుతున్నాం.

## ప్రతిభకు కొలమానం.. బహుమతి ప్రదానం

నల్గొండ : పాఠశాలల విద్యార్థులకు ఉమ్మడి నల్గొండ జిల్లాస్థాయి ప్రతిభా పాటవ పోటీలు శుక్రవారం నల్గొండలో జరిగాయి. స్థానిక కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన.. వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం, జనరల్ నాలెడ్జ్ పోటీల్లో నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ, కోదాడ, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి పట్టణాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్గొండ డీఈవో బొలారం భిక్షపతి హాజరై మాట్లాడారు. పత్రికలు చదవడంతో జ్ఞానం పెరుగుతుందన్నారు. తాను గ్రూప్-1 సాధించడంలో దినపత్రికలు, గ్రంథాలయాలు ఎంతో దోహదపడ్డాయన్నారు. రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రంథాలయంలో ఎక్కువ సమయం వినియోగించుకోవడంతోనే ఉద్యోగం సాధించినట్లు వివరించారు. విద్యార్థులు, యువతరం సెల్‌ఫోన్ ఎక్కువ వినియోగించడం వల్ల లాభం లేదని, పత్రికలు, పుస్తకాలు చదవాలని సూచించారు. దినపత్రికలు చదవడంతో ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న విషయాలు, సైన్స్ పరిజ్ఞానం, భూగోళ పరిస్థితులు తెలుస్తాయన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో ఏటా విద్యార్థులకు ప్రతిభా, క్రీడా పోటీలు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తుందని వివరించారు. పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు 'ఈనాడు' చేస్తున్న ప్రోత్సాహాన్ని అభినందించారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ముఖ్యమని, ఓడినవారు నిరాశపడకుండా మరోసారి ప్రయత్నించాలని సూచించారు.సూర్యాపేట యూనిట్ ఇన్‌ఛార్జి వేణుకుమార్ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మొదట పాఠశాల స్థాయిలో, తర్వాత రీజినల్, ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించినట్లు వివరించారు.

అనంతరం విజేతలకు డీఈవో బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఇంగ్లిష్ అండ్ సైకాలజీ స్టేట్ రిసోర్సు గ్రూప్ సభ్యుడు, డైట్ ఫాకల్టీ డా.టి.భానుప్రకాష్‌గౌడ్(వ్యాసరచన), నేషనల్ రిసోర్సు గ్రూప్ ఇన్‌ఫర్‌మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ సభ్యుడు, ఇంగ్లిష్ స్టేట్ రిసోర్సు గ్రూప్ సభ్యుడు కె.నరేందర్‌రెడ్డి(ఉపన్యాసం), ప్రభుత్వ ఉన్నత పాఠశాల డైట్ ఉపాధ్యాయుడు గాదరి సహదేవ (చిత్రలేఖనం)లు వ్యవహరించారు.

ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి విజేతలు వీరే..

వ్యాసరచన పోటీల్లో.. ప్రథమ- వి.సాయిసింధు(ఎస్‌పీఆర్ హైస్కూల్ మిర్యాలగూడ), ద్వితీయ-సఫియాకౌసర్( కృష్ణవేణి టాలెంట్ స్కూల్, దేవరకొండ), ఎం.హర్షిణిరెడ్డి(శివాణి హైస్కూల్, మిర్యాలగూడ).

ఉపన్యాస పోటీల్లో .. ప్రథమ-జి.వర్షిత(శివాణి హైస్కూల్ మిర్యాలగూడ), ద్వితీయ- జె.రాధిక(ఎస్ఎస్ హైస్కూల్, నల్గొండ), తృతీయ-సిహెచ్.అభినవనందన్(సృజన హైస్కూల్ సూర్యాపేట).

చిత్రలేఖనంలో.. ప్రథమ-ఎన్.సాత్విక(శివాణి హైస్కూల్ మిర్యాలగూడ), ద్వితీయ-టి.సాహితీ శ్రీవైష్ణవి(జయ హైస్కూల్ సూర్యాపేట), తృతీయ-జి.వెంకటేశ్(విద్యాభారతి హైస్కూల్ సూర్యాపేట).

జనరల్ నాలెడ్జ్ పరీక్షలో.. ప్రథమ-ఎం.సాత్విక్(ఎస్ఎస్ స్కూల్ ఆఫ్ లెర్నింగ్, నల్గొండ), ద్వితీయ-ఎన్.మోక్షశ్రీ(ప్రేరణ హైస్కూల్ నల్గొండ), తృతీయ-షేక్ అఫ్నాన్ (తేజ విద్యాలయ కోదాడ) గెలుపొందారు.

సంతోషంగా ఉంది: వి.సాయిసింధు

ఒక్కో దశలో బహుమతి సాధిస్తూ ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయిలో వ్యాసరచనలో ప్రథమ బహుమతి పొందినందుకు సంతోషంగా ఉంది. పోటీ చాలా ఎక్కువగా ఉంది. ఇలాంటి పోటీలతో మాలో ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుంది. కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం: జి.వర్షిత

ఈ పోటీలతో చాలా విషయాలు తెలుసుకోగలుగుతున్నాం. ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. వివిధ దశల్లో నిర్వహించిన పోటీల్లో గెలుస్తూ ఇక్కడి వరకు రావడం సులువు కాదు. ఉపన్యాసంలో ప్రథమ బహుమతి సాధించినందుకు సంతోషంగా ఉంది.

సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదం: ఎన్.సాత్విక

చిత్రలేఖనం పోటీలో గత మూడేళ్లుగా పాల్గొంటున్నా. ఈనాడు ప్రతిభా పోటీల్లో చిత్రలేఖనం విభాగంలో ప్రథమ బహుమతి సాధించినందుకు సంతోషంగా ఉంది. విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు' చేస్తున్న కృషికి అభినందనలు.ప్రతిభను పెంపొందించుకునే అవకాశం: సాత్విక్పోటీ పరీక్షలతో మన ప్రతిభను అంచనా వేసుకునే అవకాశముంది. జనరల్ నాలెడ్జ్ పరీక్షలో ప్రథమ బహుమతి సాధించినందుకు ఆనందంగా ఉంది.

చురకలు



# పెరిగిన కేంద్రాలు.. హడావుడి పనులు

ఆసిఫాబాద్ : పుర ఎన్నికలకు మరో రెండు రోజులే మిగిలి ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని ఎప్పటి నుంచో జిల్లా అధికారులు సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్తు, దివ్యాంగుల కోసం ర్యాంపుల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. కానీ కొన్నికేంద్రాల్లో మూత్రశాలలు లేవు. కొన్నిచోట్ల ర్యాంపుల నిర్మాణాలు ఇప్పుడిప్పుడే చేపడుతున్నారు. హడావుడి పనులతో నాణ్యతలోపించే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు గతంతో పోలిస్తే ఈసారి కొత్త కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల ఓటర్ల పోలింగ్ కేంద్రాలు మారాయి. కానీ ఈ విషయం చాలా మందికి తెలియడం లేదు. రెండు మున్సిపాలిటీల్లో 'న్యూస్‌టుడే బృందం' ఆదివారం పలు కేంద్రాలను పరిశీలించింది.

రెండు పురపాలికల్లో 50 వార్డులకు ఎన్నికలు నిర్వహించేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆసిఫాబాద్‌లోని 28 పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల్లో, కాగజ్‌నగర్‌లో మాత్రం సంఖ్య అధికంగా ఉండడంతో ప్రభుత్వ, ప్రైవేటుతో పాటు ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఒక్కో బూత్‌లో 850 వరకు ఓటర్లను కేటాయించేవారు. ఈసారి 750



వరకు ఉండేలా చూశారు.

**కొన్నిచోట్ల మార్పు ఇలా..**

ఆసిఫాబాద్‌లోని బ్రాహ్మణ్‌వాడ ఓటర్లు ఇదివరకు జడ్పీ బాలుర పాఠశాల పీఎస్‌లో వేసేవారు. తాజాగా పక్కనే ఉన్న మజీద్‌వాడ ఎంపీపీఎస్(బనార్‌వాడ)లో అదనంగా రెండు కేంద్రాలు కేటాయించారు. 11వ వార్డు పరిధిలోకి వచ్చే సందీప్‌నగర్‌లో 721 మంది ఓటర్లు ఉన్నారు. ఇదివరకు వీరికి జడ్పీ బాలుర పాఠశాలలో కేంద్రం ఉండేది. తాజాగా సుమారు అర కి.మీ. దూరంలోని జన్కాపూర్ జడ్పీ బాలుర పాఠశాలలోని పీఎస్‌లకు మార్చారు.

జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం ఇది. ఇక్కడ తాగునీరు, మూత్రశాలలు లేవు. ఈ కాలనీ 8వ వార్డు పరిధిలోకి వస్తుంది. సుమారు 550 మంది ఓటర్లు ఉన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో జడ్పీ బాలికల పాఠశాలలోని కేంద్రంలో ఓటేశారు. ఇది కాగజ్‌నగర్‌లోని కౌసర్‌నగర్ స్మైల్ కిడ్స్ ప్రైవేటు పాఠశాలకు వెళ్లే దారి. ఈసారి కొత్తగా ఇక్కడ రెండు బూత్‌లు ఏర్పాటు చేశారు. 1,179 మంది ఓటర్లు ఉన్నారు. కేంద్రానికి వెళ్లే రోడ్డు చిత్తడిగా మారింది. తాత్కాలిక మరమ్మతులు చేయించాలి.

# రైలు బండి సమస్యలు

కమలాపూర్ : కమలాపూర్ మండలంలోని ఉప్పల్ రైల్వేస్టేషన్ అసౌకర్యాలకు నిలయంగా మారింది. ఆదాయం ఘనంగా ఉన్నా ప్రయాణికులకు వసతులు మాత్రం కల్పించడం లేదు. నిత్యం 700–1,000 మంది ప్రయాణికులు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్, హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి, నడికూడ, కమలాపూర్, పరకాల, మొగుళ్లపల్లి, చిట్యాల, టేకుమట్ల, గణపురం, భూపాలపల్లి, రేగొండ, శాయంపేట, గోరికొత్తపల్లి, కాటారం, మహదేవపూర్ మండలాల్లోని గ్రామాల నుంచి ఈ రైల్వేస్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలకు సాగిస్తుంటారు.

టికెట్ల ద్వారా నిత్యం రూ. 25–30 వేలకుపైగా ఆదాయం సమకూరుతుండగా, రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం పక్కనున్న బొగ్గు డంపింగ్ యార్డు ద్వారా బొగ్గు రవాణాకు నెలకు సీజన్‌ను అనుసరించి రూ. 3–3.5 కోట్ల ఆదాయం రైల్వే శాఖకు వస్తోంది. నిత్యం ఎగువ, దిగువకు కలిపి ఉప్పల్ స్టేషన్‌లో 12 రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఉంది. రెండో నంబరు ప్లాట్‌ఫాంపై ప్రయాణికులకు కూర్చునేందుకు కనీసం షెడ్లు లేవు. తాగునీటి కోసం బిగించిన నల్లాలు పని చేయడం లేదు. మహిళలు మూత్ర విసర్జనకు వెళ్లాలంటే నరకం చూస్తున్నారు. దివ్యాంగులకు ఏర్పాటు చేసిన శౌచాలయానికి తాళం వేశారు. 1వ నంబరు ప్లాట్‌ఫాంపై సిమెంటు గచ్చు దెబ్బతింది. ఒకటి, రెండో నంబరు ప్లాట్ఫాంలపై రాత్రివేళ విద్యుద్దీపాలు వెలగక అంధకారం



నెలకొంటోంది.

**నెరవేరని చిరకాల వాంఛ**

ఉప్పల్ రైల్వేస్టేషన్‌లో కరీంనగర్–తిరుపతి వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును నిలపాలని ఈ ప్రాంతవాసులు చాలా ఏళ్లుగా కోరుతున్నారు. దూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం ఇక్కడ రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్‌ను ప్రారంభించాలని, స్టేషన్‌ను ఉన్నతీకరించి కనీస వసతులతో పాటు మెరుగైన సేవలందించేలా దివ్యాంగులకు లిఫ్ట్ (ఎస్కలేటర్) ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, ఉప్పల్ గ్రామస్థులు గతంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఉప్పల్ ఆర్వోబీ పరిశీలనకు వచ్చినప్పుడు స్టేషన్‌ను ఉన్నతీకరిస్తామని, రిజర్వేషన్, తిరుపతి ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని బండి సంజయ్ హామీ ఇచ్చారు. నేటికీ 'బండి' హామీలు కార్యరూపం దాల్చలేదు. రైల్వేస్టేషన్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. జనతా ఎక్స్‌ప్రెస్‌ను సైతం నిలపాలని డిమాండు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు.

# మెట్రో.. హరిత ఇంధన బాటలో..



హైదరాబాద్: మెట్రోరైలు ప్రయాణ సౌకర్యాన్ని పెంచడమే కాదు.. కాలుష్యాన్ని తగ్గించే హరిత ఇంధనం వాడకంలో ప్రమాణాలను మెరుగుపరచుకుంటోంది. బొగ్గు ద్వారా విద్యుత్తు ఉత్పత్తయ్యే పవర్ గ్రిడ్‌పై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించుకుంటోంది. ఫిబ్రవరి నాటికి మెట్రోరైలు విద్యుత్తు అవసరాల్లో 16 శాతం స్వయంగా ఉత్పత్తి చేసుకునే సౌర విద్యుత్తు ద్వారానే సమకూర్చుకుంటోంది.

**ఖాళీ స్థలంలో సౌర పలకలు**

మెట్రోరైలు స్టేషన్ల పైకప్పులు, మియాపూర్, ఉప్పల్ డిపోల్లోని ఖాళీ స్థలంలో సౌర విద్యుత్తు పలకలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 12.41 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తోంది. స్టేషన్లలోనూ తక్కువ విద్యుత్తు వినియోగించుకునేలా చేపట్టిన డిజైన్‌తో 57 స్టేషన్లను ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) నుంచి అత్యున్నత ప్లాటినం రేటింగ్ పొందాయి. దేశంలోనే అన్ని స్టేషన్లకు ఈ రేటింగ్ ఉన్న మొదటి మెట్రో నెట్‌వర్క్ హైదరాబాద్ మెట్రోనే కావడం విశేషం. రైలు బ్రేక్ వేసిన ప్రతిసారీ ఉత్పత్తి అయ్యే ఘర్షణ శక్తిని వృథా చేయకుండా తిరిగి విద్యుత్తుగా మార్చే సాంకేతికత ఇక్కడి మెట్రో రైళ్లలో ఉంది. ఈ విధానంలో మెట్రో విద్యుత్తు వినియోగంలో సుమారు 30 నుంచి 35 శాతం వరకు తిరిగి ఉత్పత్తి చేయగలుగుతోంది.

**ఇతర నగరాల్లో ఇలా..**

దిల్లీ మెట్రో రైలు కార్పొరేషన్‌లో 50 మెగావాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది. ఇతర మెట్రోలకు ఆదర్శంగా నిలుస్తోంది.

కొచ్చి మెట్రో తన మొత్తం విద్యుత్తు అవసరాల్లో సగానికి పైగా సౌర విద్యుత్తు ద్వారానే తీర్చుకుంటూ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. మెట్రో ట్రాక్‌ల వెంట సౌర పలకలను ఏర్పాటు చేసింది.

# హరిత బడి.. కావాలి మన ఒరవడి



హైదరాబాద్: ఉష్ణోగ్రతలు పెరిగిపోయి జల, వాయు కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థ సమస్యలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో భావి తరాలకు పర్యావరణహిత పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న 'గ్రీన్ స్కూల్స్ ప్రోగ్రామ్ సత్ఫలితానిస్తోంది. దేశవ్యాప్తంగా ఇటీవల 433 పాఠశాలలు 'గ్రీనెస్ట్' గుర్తింపు పొందగా..ఈ పద్ధతులను నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు అమలు చేస్తూ 'గ్రీన్‌సిటీ'లో భాగం కావొచ్చు.

**ఏమిటీ ప్రోగ్రామ్?:** దిల్లీలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ 2005నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. దీన్లో భాగంగా తమ పాఠశాలలోని నీరు, విద్యుత్, వ్యర్థాలు, గాలి, భూమి, ఆహార వినియోగాన్ని విద్యార్థులే ఆడిట్‌చేస్తారు. పాఠశాల పర్యావరణాన్ని మెరుగుపరచడమే ఈ కార్యక్రమ లక్ష్యం. తాజాగా ప్రకటించిన ఫలితాల్లో పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, దిల్లీ వంటి ప్రాంతాల పాఠశాలలు ప్రథమస్థానంలో నిలిచాయి. 2017–18 ఏడాదికి నగరంలోని భారతీయ విద్యాభవన్‌కు, 2018–19లో బేగంపేట్‌లోని కేంద్రీయ విద్యాలయకు గ్రీన్ రేటింగ్ లభించగా ఏడేళ్లుగా ఆస్థాయి ఫలితాలు రావడం లేదు.

ఏం చేయాలి?: నీటిసంరక్షణ, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ లీకేజీలు అరికట్టాలి.

ఎల్ఈడీ విద్యుద్దీపాలు, సోలార్ ప్యానెళ్లు తదితరాలతో విద్యుత్ పొదుపు చేయాలి.

వ్యర్థాలను వేరు చేయడం, కంపోస్టింగ్, ప్లాస్టిక్ రహిత ప్రాంగణంగా మార్చడం.

పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటాలి.

ప్రయోజనం ఏంటి..?: గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్ ద్వారా పాఠశాల ఖర్చులు తగ్గుతాయి. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నుంచి సర్టిఫికెట్ గుర్తింపుతో పాటు అవార్డులు లభిస్తాయి.

ఎలా పాల్గొనాలి..?: ఆసక్తి ఉన్న పాఠశాలలు https://www.greenschoolsprogramme.org/ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ ఉచితమే.

అమలు చేయొచ్చు ఇలా..


విద్యార్థుల ఆడిట్ బృందాలు..

ఆరోతరగతి నుంచే విద్యార్థులను బృందాలుగా విభజించి, సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్‌మాన్యువల్ ప్రకారం పాఠశాల వనరులను పరిశీలించాలి. ఈ ప్రత్యక్ష అనుభవాల ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ స్పృహపెరిగే అవకాశం ఉంది.

నిపుణులు ఏమంటున్నారు..?

నగరంలో పాఠశాలలు హరిత విధానాలు అవలంభించడం ద్వారా విద్యార్థులతో పాటు సమాజానికి ప్రయోజనం. ఇప్పటికే కొన్ని పాఠశాలలు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ముందున్నాయి. ఈ పాఠశాలలతోపాటు మిగిలినవి ఈ గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలి.

# మందుల తయారీలో హానికర అవశేషాలు !




హైదరాబాద్: మందుల తయారీలో హానికర అవశేషాలను గుర్తించేందుకు విద్యార్థులు, నిపుణులకు ప్రీ–క్లినికల్ టాక్సికాలజీ కోర్సు ద్వారా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం శిక్షణ ఇస్తోంది. దీన్ని ద్వారా విద్యార్థులు, నిపుణులు ఫార్మా కంపెనీలు తయారు చేస్తున్న మాత్రలు, మందులు మార్కెట్‌లోకి వెళ్లకముందే వాటిలో హానికర అవశేషాలను గుర్తించి తొలగించనున్నారు. స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ విభాగం, ఆస్పైర్ బయోనెస్ట్, ఆసియా బయోటెక్ సంఘాల సమాఖ్య ప్రతినిధులు శిక్షణకు సంబంధించిన అంశాలను రూపొందించారు. ఐదు రోజులపాటు ఫార్మా సైన్సెస్ విద్యార్థులకు, ఫార్మారంగ నిపుణులకు తరగతులు నిర్వహిస్తారు. ప్రాణాధార మందుల తయారీలో రసాయనాలు, ఇతర మందుల వినియోగం కారణంగా సూక్ష్మస్థాయిలో ఉన్న హానికర అవశేషాలను గుర్తించగలిగే సామర్థ్యం వీరికి కలుగనుంది.

**నిపుణుల అవసరం..**

బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్ రంగాల్లో నిపుణులైన టాక్సికాలజిస్టుల అవసరం రోజురోజుకూ పెరుగుతోంది. జ్వరం, జలుబు, దగ్గు వంటి సాధారణ జబ్బులకు మనం వేసుకునే మాత్రలు, ద్రవరూప మందుల మార్కెట్‌లోకి రావాలంటే ముందుగా జంతువులపై ప్రయోగాలు నిర్వహించాలి. అవి విజయవంతం అయ్యాక మానవులపై ప్రయోగించాలి. అనంతరం ఫార్మా కంపెనీలు తయారు చేసిన మందులు, మాత్రలు మార్కెట్‌లోకి వెళ్లకముందే గుర్తించడం ప్రీ–టాక్సికాలజీ శిక్షణలో కీలకమైన అంశం. హానికర అవశేషాలను తొలగించడం, సూక్ష్మతిసూక్ష్మంగా ఉన్న వాటి ప్రభావాన్ని లెక్కగట్టడం ప్రీ–టాక్సికాలజీ కోర్సు ప్రత్యేకత. సూక్ష్మ అవశేషాలను తొలగించడం ద్వారా మాత్రలు, మందులను వినియోగించే వారిపై దుష్ప్రభావాలు ఉండబోవని ఆసియా బయోటెక్ సంఘాల సమాఖ్య ప్రతినిధి ప్రొఫెసర్ పల్లు రెడ్డన్న తెలిపారు. అప్పటికే మధుమేహం, మూత్రపిండాల జబ్బులున్నవారు ఈ మందులు వినియోగిస్తారన్న ముందస్తు అంచనాతో మాత్రలు, మందులపై ఆయా కంపెనీలు, సంస్థలు 'పరగడపున వేసుకోకూడదు', 'వైద్యుల సలహాలతోనే వీటిని వినియోగించండి' అన్న హెచ్చరికలను ముద్రిస్తారని వివరించారు.

**జంతువులపై ప్రయోగాల వల్లే..**

సాధారణ జబ్బులు, ప్రాణాంతక వ్యాధుల నియంత్రణకు, నిర్మూలనకు ఫార్మా కంపెనీలు మందులు తయారు చేస్తున్నాయి. వీటి అభివృద్ధి, పరిశోధనకు రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఈ ఔషధాలు విదేశాలకు ఎగుమతి చేయాలంటే మార్కెట్‌లో ప్రవేశపెట్టకముందే జంతువులపై ప్రయోగాలు చేసి ఉండాలి. ఆ సమయంలో మోతాదును వినియోగించడం, వాటిపై అది పనిచేసిందా? లేదా? అని పరిశోధకులు, శాస్త్రవేత్తలు పరిశీలిస్తారు. అవి పనిచేశాయని తెలుసుకున్నాక వాటి తయారీకి అనుమతులు తీసుకుని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు.

# రక్తశుద్ధికి తప్పని తిప్పలు

ఎంజీఎం : కేఎంసీలో రెండు డయాలసిస్ కేంద్రాలున్నాయి. ఒకటి ప్రభుత్వం నిర్వహించేది. ఎంజీఎంలో అడ్మిట్ అయిన వారికి ఉచితంగా చేస్తారు. రెండోది ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తోంది. క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకునే వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా డయాలసిస్ చేస్తారు. ఎంజీఎం ఆసుపత్రిలో వివిధ అనారోగ్య సమస్యలతో అడ్మిట్ అయి.. చికిత్స పొందుతున్న వారికి డయాలసిస్ చేయాల్సి వస్తే కేఎంసీలోని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలోని రెండో అంతస్తులోకి వెళ్లాల్సిందే. ఎంజీఎం నుంచి కేఎంసీకి అంబులెన్సులో తీసుకెళ్లి తీసుకువస్తున్నారు. అనారోగ్యంతో ఉన్నవారు ప్రయాణించాల్సి రావడంతో ఎంతో ప్రయాసకు గురవుతున్నారు. ఎంత మంది బాధితులుంటే అంత మందిని ఒకేసారి అంబులెన్స్‌లో తీసుకెళ్లడం ఇబ్బంది అవుతోంది. దీనివల్ల బాధితులతో పాటు వారి సహాయకులు అవస్థలు పడుతున్నారు. ఎంజీఎంలోనే రక్తశుద్ధి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేఎంసీలో 10 డయాలసిస్ పరికరాలకు 9 పనిచేస్తున్నాయి. నలుగురు టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. క్రిమి సంహారక మందు తాగినవారు, ఎస్‌వోబీ, కిడ్నీ దెబ్బతిన్నప్పుడు, ఇతర అనారోగ్య సమస్యలతో



బాధపడుతూ.. ఎంజీఎంలో అడ్మిట్ అవుతారు. వైద్య పరీక్షల్లో కిడ్నీ సమస్య ఉన్నట్లు తేలితే డయాలసిస్‌కు పంపిస్తారు. ఇలా రోజుకు 7–8 మంది చొప్పున కొత్త రోగులకు డయాలసిస్ చేస్తున్నారు. రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆరోగ్యశ్రీలో నాలుగుసార్లు డయాలసిస్ చేస్తున్నారు. అప్పటికి కిడ్నీ పనితీరు మెరుగుపడకపోతే క్రమం తప్పకుండా వారానికి ఒకట్రెండు సార్లు వారి శరీర పరిస్థితిని బట్టి డయాలసిస్ చేసుకోవాలని వైద్యులు సూచిస్తారు. ఎంజీఎం నుంచి డిశ్చార్జి అయ్యాక కూడా డయాలసిస్ చేయాల్సి వస్తే ఆరోగ్యశ్రీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని తమ గ్రామానికి దగ్గర్లో ఉన్న సెంటర్‌లో ఉచితంగా చేసుకోవచ్చు.

**కేఎంసీలో డీసీ డయాలసిస్ సెంటర్**

కాకతీయ వైద్య కళాశాల(కేఎంసీ)లోని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలోని ఐదో అంతస్తులోని దీప్తిచంద్ డయాలసిస్ సెంటర్‌లో (డీసీడీసీ) ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేస్తారు. సగటున రోజుకు 50 మందికి డయాలసిస్ చేస్తున్నారు. ఈ కేంద్రంలో 14 పరికరాలుండగా, 18 మంది టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. వైద్యులు సూచించిన విధంగా వారానికి ఎన్నిసార్లు డయాలసిస్ చేసుకోమంటే అన్నిసార్లు చేస్తారు. ముందుగా ఆరోగ్యశ్రీలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే వారికి కేటాయించిన సమయం ప్రకారం వెళ్తే డయాలసిస్ చేస్తారు. ఒక్కో డయాలసిస్‌కు 4– 5 గంటల సమయం పడుతుంది.

# అన్నింటికీ ఆధారం.. అంతులేని నిర్లక్ష్యం

ఎంజీఎం : ఎంజీఎం ఆసుపత్రిలోని రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అన్నింటా సాంకేతిక(డిజిటలైజేషన్) అందుబాటులోకి వచ్చినా.. ఆసుపత్రిలోని మెడికల్ రికార్డ్ డిపార్ట్‌మెంట్(ఎం ఆర్‌డీ) ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు అందించిన వైద్యసేవల చరిత్ర(హిస్టరీ) ఉండే కేస్ షీట్లను ఈ విభాగం వారే భద్రపరుస్తారు. అన్ని వార్డుల నుంచి రోగులు డిశ్చార్జి అయ్యాక కేస్ షీట్లను ఈ విభాగానికి పంపిస్తారు. రికార్డులన్నీ కంప్యూటరైజ్డ్ చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ఇప్పటికీ మాన్యువల్ పద్ధతిలో నిర్వహించడంపై ప్రజలు పెదవి



విరుస్తున్నారు. మెడికో లీగల్ కేసు (ఎంఎల్‌సీ), నాన్ ఎంఎల్‌సీ కేసులను వేర్వేరుగా భద్రపరుస్తారు. ఎంఎల్‌సీ కేసులకు సంబంధించి రికార్డులకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఆయా రోగులకు సంబంధించి ఏమైనా.. పోలీసు కేసు నమోదై, కోర్టు వరకు వెళితే అప్పుడు ఈ రికార్డులు అవసరం అవుతాయి. ఉదాహరణకు ఒక రోడ్డు ప్రమాదం జరిగితే నమోదైన కేసులో వైద్యులు సాక్ష్యం చెప్పాల్సి వస్తే బాధితుడికి ఏ అవయవం దెబ్బతిన్నది, ఆపరేషన్ చేసింది.. లేనిది, ఎలాంటి చికిత్స అందించారనే విషయాలపై కోర్టుకు వివరిస్తారు. వైద్యం అందించాక చాలా రోజులకు సాక్ష్యం చెప్పాల్సి వస్తుంది. అప్పుడు ఈ రికార్డులను చూసే అందించిన చికిత్సను గుర్తుచేసుకుని కోర్టుకు వివరిస్తారు. బీమా క్లెయిమ్ చేసుకునేవారు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాక ఎంఆర్‌డీలో భద్రపరిచిన కేస్ షీట్ల ఆధారంగానే నివేదికలు ఇస్తారు.

**అక్షర దోషాలుంటే ఇబ్బందే..**

ఆసుపత్రిలో చేరి.. చికిత్స పొందుతూ మృతిచెందిన వివరాలను మహానగర పాలక సంస్థకు ఇస్తారు. అక్కడి నుంచి మరణ ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంటుంది. అక్షర దోషాలుంటే బీమా క్లైమ్ చేసుకునేవారు, మరికొన్ని సందర్భాల్లో ఇబ్బంది పడతారు. అలాంటివా రు మళ్లీ ఎంజీఎంలోని ఈ విభాగం చుట్టూ తిరగాల్సిందే. మరణించిన వారి ఆధార్, ఇతర గుర్తింపు కార్డులు తీసుకొని, న్యాయవాదితో అఫిడవిట్ ఇచ్చి, ఎంఆర్‌డీ సిబ్బంది సూచించిన పత్రాలు తీసుకెళ్లి దరఖాస్తు చేస్తే.. కేస్ షీట్‌లో అక్షర దోషాలు సరిచేసి, మహానగర పాలక సంస్థకు పంపిస్తారు. అక్కడి నుంచి మరణ ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంటుంది. ఇదో పెద్ద తతంగం.

**ఆధునికీకరిస్తే మేలు..**

అక్షర దోషాల వల్ల ఎంత ఇబ్బంది కలుగుతుందో కంప్యూటర్ ఆపరేటర్లు ఇప్పట్లో తెలిసేలా లేదు. రోగులు అడ్మిట్ అయిన సందర్భంలో కేస్ షీట్‌లో వివరాలు పేర్కొనే సమయంలో అక్షర దోషాలు ఎక్కువగా ఉంటున్నాయి. రోగుల సహాయకులు హడావుడిలో పెద్దగా పట్టించుకోరు. ఆ రికార్డే ఎంఆర్‌డీకి చేరుతుంది. డిశ్చార్జి అయ్యాక అక్షర దోషం సరిచేయించుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ఎంఆర్‌డీ విభాగంలో ఒక్క కేసు షీట్ గుర్తించి, సరిచేయడానికి కొన్ని రోజుల సమయం పడుతోంది. డిజిటలైజేషన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తే ఒక్క క్లిక్‌తో రికార్డులు దర్శనమిస్తాయి. ఆధార్‌కు అనుసంధానం చేస్తే ఆధార్‌లో ఉన్న వివరాలే ఇక్కడ రికార్డుల్లో నమోదయ్యే అవకాశం ఉంది.

చురకలు



# స్థాయి పెంచినా.. వసతులు అంతంతే!

ధర్మపురి : ధర్మపురి పట్టణంలోని 30 పడకల ఆసుపత్రిని 50 బెడ్లకు ఉన్నతీకరించినా సమస్యలు అదే స్థాయిలో ఉన్నాయి. రోగులకు తాగునీరు, సరైన భోజన వసతులు కరవయ్యాయి. రోగుల తాకిడి విపరీతంగా పెరిగినా అసౌకర్యాలతోనే నెట్టుకొస్తున్నారు. ప్రతిరోజు ధర్మపురి క్లస్టర్? దవాఖానాకు ధర్మపురి, బుగ్గారం, బీర్?పూర్, వెల్గటూర్, పొరుగున ఉన్న మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట ప్రాంతం నుంచి 150 మంది రోగులు వైద్య పరీక్షలు, చికిత్సలు, ప్రసూతి సేవలకు వస్తుంటారు. వైద్య సిబ్బంది, పరికరాల కొరతతో అత్యవసరమైతే జగిత్యాల ఆస్పత్రికి పంపిస్తున్నారు.

**ఐసీయూ వార్డు ప్రారంభమెప్పుడు?**

ఆసుపత్రి స్థాయిని గతంలోనే అప్‌గ్రేడ్ చేయగా.. వైద్యులు, సిబ్బందిని కేటాయించటం లేదు. దీంతో పలువురు రోగులు అత్యవసర చికిత్సలకు జగిత్యాల, కరీంనగర్? వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే అన్ని రకాల వైద్య పరికరాలు సరఫరా చేసి, ఐసీయూ నిపుణులు, టెక్నీషియన్లు, సిబ్బందిని నియమించాలి. రెండో అంతస్తులో గదులు నిర్మించగా.. పరికరాలు, వైద్య



సిబ్బంది కొరతతో మొక్కుబడి సేవలకే పరిమితమవుతోంది. పది బెడ్లతో ఐసీయూ కేంద్రం ఏర్పాటు చేయగా.. వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని నియమించకపోవటంతో ప్రారంభానికి నోచటం లేదు.

**అసౌకర్యాలు ఇవీ..**

విద్యుత్తు సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. జనరేటర్ ఏర్పాటు చేస్తే ఇబ్బంది ఉండదు.

తాగునీటి వసతికి ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలి.

స్కానింగ్ యంత్రాలు, రోగ నిర్ధారణ పరికరాలు, ఎక్స్‌రే ప్లాంట్ తదితరాలు లేవు. ఆసుపత్రిలో మందులు కూడా అరకొరగానే లభిస్తున్నాయి.

నాలుగు ల్యాబ్‌లు అవసరం కాగా ఒక్కటే అందుబాటులో ఉంది.

**ప్రతిపాదనలు పంపాం..**సిబ్బంది, పరికరాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఆస్పత్రిలో అన్ని రకాల సేవలందిస్తున్నాం. నిత్యం 150–200 ఓపీ నమోదవుతోంది. ప్రస్తుతం రెండో అంతస్తును కూడా పూర్తిగా అందుబాటులోకి తీసుకొస్తాం. ఉదయం నుంచి రాత్రి వరకు వైద్యులు ఉంటున్నారు.

డా.రవి, ఆసుపత్రి సూపరింటెండెంట్

# గుంత పూడింది.. వేదన తీరకుంది!

తాండూరు : చేవెళ్ల–మీర్జాగూడ మధ్య నవంబరు 3న ఆర్టీసీ బస్సు–టిప్పర్ ఢీకొనడంతో జరిగిన ఘోర దుర్ఘటనకు కారణమైన గుంత పూడ్చేయగలిగారు కానీ.. చనిపోయిన 19 మంది బాధిత కుటుంబ సభ్యుల వేదనను మాత్రం నేటికీ తీర్చలేకపోతున్నారు. ఘటన జరిగి నేటికి సరిగ్గా 54 రోజులవుతోంది. ఆ ప్రమాదం మా బతుకులను చిదిమేసింది. తెల్లారేసరికి నా అనుకునేవారందరూ దూరమయ్యారు.. ఈ దీన పరిస్థితి ఎవరికీ రాకూడదంటూ గుర్తొచ్చినప్పుడల్లా కన్నీరుమున్నీరవుతూ రోజులు గడుపుతున్నారు. అమ్మా నాన్నలను కోల్పోయి అనాథలైన పిల్లలు.. ముగ్గురు కూతుళ్లను కోల్పోయిన తల్లిదండ్రులు.. మూడు తరాలను దూరం చేసుకున్న కుటుంబాలు.. పిల్లలే ఆధారంగా జీవిస్తున్న కుటుంబం.. ఇలా ఎవరిని కదిలించినా శోకం వర్ణనాతీతం. ఈ ప్రమాదానికి టిప్పర్ యజమానిని ఇటీవల బాధ్యుడిగా చేసిన విషయం తెలిసిందే. వారి పరిస్థితి తెలుసుకునే ప్రయత్నం చేసింది..

**మానసికంగా కుంగిపోయిన సోదరుడు**

యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన అఖిలారెడ్డి మాదాపూర్‌లోని ఐఐఆర్ఎం కళాశాలలో ఎంబీఏ చదువుతోంది. కళాశాల టాపర్. రూ.24 లక్షల ప్యాకేజీతో ఉద్యోగావకాశం వచ్చిన సమయంలోనే చరవాణి కోసం ఇంటికి వచ్చి వెళుతుండగా.. బస్సు ప్రమాదంలో కన్నుమూసింది. కళాశాలలో అఖిలారెడ్డి పేరిట స్మృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ఫీజు మొత్తం తిరిగిచ్చేశారు. సోదరి మృతితో కలతచెందిన సోదరుడు సందీప్‌కుమార్‌రెడ్డి మానసికంగా ఇబ్బంది పడ్డారు. పైచదువులకు యూకే వెళ్లాల్సి ఉండగా వాయిదా వేసుకున్నారు. తాండూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో మానసిక వైద్య నిపుణురాలి వద్ద చికిత్స పొందారు.

**ఆర్థికసాయం అందజేత**

మృతి చెందిన 19 మంది కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున,



24 మంది క్షతగాత్రులకు రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వం అందజేసింది. బస్సు డ్రైవర్ దస్తగిరి ఇద్దరు భార్యలకు, తల్లికి మూడు భాగాలుగా పరిహారం అందించారు.

**రహదారి విస్తరణ పనుల్లో వేగం**


ఘోర దుర్ఘటన తరువాత ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం మేల్కొంది. రంగారెడ్డి జిల్లా మన్నెగూడ నుంచి చేవెళ్ల, మొయినాబాద్ రోడ్డును వెడల్పు చేస్తోంది. ప్రమాదంతో ఈ దారికి మోక్షం లభించడం దురదృష్టకరమని ప్రయాణికులు, వాహనదారులు చర్చించుకుంటున్నారు.

**నిద్రలో అమ్మానాన్నలు గుర్తొస్తున్నారు**

శివలీల, భవానీ, హాజీపూర్, యాలాల మండలం

అమ్మానాన్న(బందెప్ప, లక్ష్మి) దూరమైన తరువాత బంధువులే దిక్కయ్యారు. అయినా.. రాత్రుళ్లు నిద్రలో ఒక్కసారిగా అమ్మానాన్నలు గుర్తొచ్చి మెలకువ వస్తోంది. ఘటనా స్థలం, అమ్మానాన్న మృతదేహాలు కళ్లలో మెదులుతున్నాయని ఇద్దరు పిల్లలు కంటనీరు పెట్టుకున్నారు. వీరిని దత్తత తీసుకున్న ఓ సంస్థ చదువు, బాగోగులకు ఆర్థికసాయం అందిస్తోంది.

# పావుకేజీ మించడం లేదు



హైదరాబాద్: ఇళ్లల్లో వంట చేసుకోవడం తగ్గడం.. వారానికి రెండు, మూడు రోజులు రెస్టారెంట్లలో తినడం.. జంక్‌ఫుడ్స్‌కు ప్రాధాన్యం వల్ల ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల వినియోగం తగ్గుతోంది. నగరంలో చాలామంది రోజుకు 250 గ్రాములకు మించి ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు లాంటివి తినడం లేదని నిపుణులు చెబుతున్నారు. అది కూడా రోజూ ఏదో ఒక రకం పండు లేదంటే ఆకుకూరకు పరిమితమవుతున్నారు. రోజూ 250 గ్రాములు ఆకుకూరలు, కూరగాయలుంటే మరో 150 గ్రాముల వరకు పండ్ల శాతం ఉండాలంటున్నారు.

**ఎన్నో ప్రయోజనాలు..**

స్వీట్లు, బేకరీ ఇతర జంక్‌ఫుడ్స్‌లో క్యాలరీలు, కొవ్వులు అధికంగా ఉంటాయి. పండ్లు, కూరల్లో తక్కువ. వీటిలో మేలు చేసే విటమిన్లు, పోషకాలు, ఫోలిక్? యాసిడ్, సూక్ష్మ పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పండ్లు, ఆకుకూరలు, కూరగాయల్లో పీచు ఎక్కువ. పండ్లలోని సాల్యుబుల్ పీచు వల్ల రక్తంలో కొలెస్ట్రాల్ పెరగకుండా చూస్తాయి. పీచు ఆలస్యంగా జీర్ణం అవుతుంది. కడుపు నిండుగా ఉన్న భావనతో చిరుతిళ్ల జోలికి పోరు. ఫలితంగా ఊబకాయం రాదు.పండ్లు, ఆకుకూరల్లో ఉన్న పీచు వల్ల మలబద్ధకం దరిచేరదు. మధుమేహం నియంత్రణలో ఉంటుంది. పండ్లు, కూరల్లో పొటాషియం వల్ల అధిక రక్తపోటు సమస్య తగ్గుతుంది.

వీటిలోని యాంటి ఆక్సిడెంట్లు శరీరంలోని కణజాలాన్ని ఉత్తేజితం చేస్తాయి. జుట్టు రాలటం, చర్మం ముడతలు, వృద్ధాప్య సమస్యలను తగ్గిస్తాయి. గ్యాస్ట్రిక్ క్యాన్సర్లకు అడ్డుకట్ట వేస్తాయి.

**అనేక జబ్బులకు అడ్డుకట్ట: డా:లక్ష్మయ్య**

మాజీ శాస్త్రవేత్త, జాతీయ పోషకాహార సంస్థ

నగరంలో జంక్‌ఫుడ్స్ వినియోగం పెరిగి చాలామంది పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవడం లేదు. వివిధ అనారోగ్య సమస్యలకు ఆహారపుటలవాట్లే కారణం. పండ్లు, ఆకుకూరలు విరివిగా తీసుకుంటే పేగుల్లో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. జబ్బులకు అడ్డుకట్ట వేయవచ్చు. నిత్యం పెద్దలు 400 గ్రాములు, 18 ఏళ్లలోపు పిల్లలు 250 గ్రాముల పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు ఆహారంలో మిళితం చేసుకోవాలి.

# ధర ఎక్కువ.. తూకం తక్కువ



హైదరాబాద్: కొనుగోలుదారులకు అందుబాటు ధరల్లో.. తాజా కూరగాయల విక్రయాలకు ఉద్దేశించిన రైతుబజార్లు గాడి తప్పాయి. నిర్వహణ కొరవడి అధ్వానంగా మారుతున్నాయి. సౌకర్యాల కొరత, పారిశుద్ధ్య లోపం, నిర్దేశించిన ధరలకంటే ఎక్కువకు విక్రయాలు, తూకాల్లో మోసాలు, రైతుబజార్లలో వ్యాపారుల హవా పెరుగుతోంది. ఎర్రగడ్డ, మెహిదీపట్నం, కేపీహెచ్‌బీ, వనస్థలిపురం రైతుబజార్లకు ఆదరణ ఉన్నా సమస్యలు అదే స్థాయిలో ఉన్నాయి.

**ఎర్రగడ్డలో..**

ఎర్రగడ్డ రైతుబజారులో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. బీరకాయ కిలో రూ.38 అని బోర్డులో ఉంటే రూ.55కు విక్రయిస్తున్నారు. నిత్యం బోయిన్‌పల్లి మార్కెట్ ఆధారంగా నిర్ణయించే ధరలు ఉదయం 10 గంటలకు వస్తాయి. కొత్త ధరలు రాలేదంటూ పెంచి విక్రయిస్తున్నారు. చాలా స్టాళ్లను వ్యాపారులే నడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

**సంచార రైతుబజార్లలో..**

సంచార రైతుబజార్ల ముసుగులో వినియోగదారులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. వాస్తవానికి రైతుబజారులో ధరపై కిలోకు రూ.5 పెంచి సంచార రైతుబజార్లలో విక్రయించాలి. కానీ రూ.15 వరకు వసూలు చేస్తున్నారు.

**నిత్యం 6 వేల మంది**

మెహిదీపట్నం రైతుబజార్‌కు నిత్యం ఆరు వేల మంది కొనుగోలు దారులు వస్తుంటారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారాయి. తాగునీటి ఏటీఎం, ఆర్వో ప్లాంట్? పనిచేయడం లేదు. షెడ్లు సరిపోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

**కూకట్‌పల్లిలో పైకెక్కాలంటే..**

కూకట్‌పల్లి రైతుబజారు ప్రాంగణం వ్యర్థాలతో అధ్వానంగా మారింది. లిఫ్ట్ పనిచేయక పైఅంతస్తులో 40 కూరగాయల దుకాణాలు ఉండడంతో అక్కడకు వెళ్లేందుకు వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. తూకాల్లో తేడాలు ఉంటున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. సెల్లార్ పార్కింగ్ దారిలో అక్రమంగా దుకాణాల ఏర్పాటుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

**25 ఏళ్లయినా రేకుల షెడ్డే గతి**

వనస్థలిపురంలో 25 ఏళ్ల కిందట ఆరు రేకుల షెడ్లలో రైతుబజారును ఏర్పాటు చేశారు. ఇప్పటికీ అందులోనే కొనసాగుతోంది. రైతుబజారు ముందు పార్కింగ్‌తో ఇబ్బందులు తప్పడం లేదు. మరుగుదొడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. బోర్డు ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారని నిత్యం ఫిర్యాదులు వస్తున్నాయి.

# కాలిబాటలతో బహుళ ప్రయోజనం



హైదరాబాద్ : హైదర్‌గూడలో నాలుగో తరగతి చదివే విద్యార్థి నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్నాడు. కొంతదూరం వెళ్లాక రహదారి పొంగిన డ్రైనేజీతో నిండిపోయింది. కాలు పెట్టే వీల్లేక ఇంటికెళ్లి తండ్రికి చెప్పడంతో అతన్ని బైకుపై తీసుకెళ్లి దిగబెట్టాడు. కాలిబాటలు సక్రమంగా ఉంటే ద్విచక్రవాహన ట్రిప్పులు తగ్గించొచ్చు అనేందుకు ఈ ఉదాహరణే నిదర్శనం.

కాలుష్యంతో నగరాలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. అందులో వాహన కాలుష్యమే ఎక్కువ ముప్పు. ప్రజారవాణా తగ్గి వ్యక్తిగత వాహనాలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని పర్యావరణవేత్తలు అంటున్నారు. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా ప్రజారవాణాను విస్తరించకపోవడం, ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ సదుపాయాలను కల్పించకపోవడంతో సొంత వాహనాల వైపు ప్రయాణికులు మొగ్గు చూపుతున్నారు. కాలిబాటలను పక్కాగా ఏర్పాటు చేస్తే ప్రజారవాణా గణనీయంగా పెరిగి.. తద్వారా వాహన కాలుష్యమూ తగ్గుతుంది.

**ప్రజా రవాణా వాటా పెరగా..**

హెచ్?ఎండీఏ పరిధిలో రోజువారీ ప్రయాణంలో ప్రజారవాణా 2011లో 42 శాతం ఉండగా 2025 నాటికి 28 శాతానికి పడిపోయిందని లీ అసోసియేట్స్? కాంప్రహెన్సివ్? మొబిలిటీ ప్లాన్? (సీఎంపీ) నివేదికలో వెల్లడించింది. 45 శాతం మంది రోజువారీ అవసరాల కోసం ద్విచక్రవాహనం వినియోగిస్తున్నారు. వీరు 69.2 లక్షలు ట్రిప్పులు రోజూ తిరుగుతున్నారు. కార్లలో తిరిగేవారు 16 శాతం. కార్లు 24.3 లక్షల ట్రిప్పులు తిరుగుతున్నాయి. వీరిని ప్రజారవాణా వైపు మళ్లించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుత ప్రజా రవాణా వాటాను 70 శాతానికి తీసుకెళ్లాలనుకుంటోంది.

**మెట్రో, బస్సుల వరకు...**

బస్టాప్, మెట్రోరైలు స్టేషన్లకు చేరుకునేందుకు నడక ప్రమాదమని చాలామంది వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీన్ని సురక్షితంగా మారిస్తే వాహన రద్దీ, కాలుష్యం తగ్గుతుంది.

**అక్కడ చాలా సురక్షితం..** పాదచారులకు అత్యంత సురక్షితమైన నగరాల్లో పారిస్, బార్సిలోనా ముందుంటాయి. నడిచి వెళ్తూ రోజువారీ అవసరాలు తీరేలా డిజైన్? చేశారు. 15 నిమిషాల దూరంలోనే అన్నీ లభించేలా దృష్టి పెట్టారు. తెలంగాణ ప్రభుత్వం ఇదేవిధంగా టీవోడీ ఆధారిత రవాణా సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టబోతున్నట్లు విజన్? 2047 డాక్యుమెంట్?లో ప్రకటించింది.

సింగపూర్?లో సైతం కాలిబాటలకు ప్రాధాన్యం ఉంటుంది. నడకను సులభతరం చేయడమే కాదు సురక్షితం అంటారు.

మనదేశంలో చండీగఢ్, చెన్నై, కోల్‌కతాలో కొంత భాగం వరకు నడక మార్గాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

# ఈ-పంచాయతీల్లో వేతన వెతలు

జమ్మికుంట : గ్రామ పంచాయతీల్లో ధ్రువపత్రాలు, పంచాయతీల ఆదాయం, పన్నుల వసూళ్లు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వివరాలు, గృహ నిర్మాణాలకు సంబంధించిన పత్రాలు, ఎన్నికల సమయంలో నామపత్రాల స్వీకరణ నుంచి ఫలితాలు వచ్చేదాకా కంప్యూటర్ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తూ అంతర్జాలంలో పొందుపరుస్తుంటారు. ప్రభుత్వానికి సంబంధించిన పలు సర్వే రిపోర్టుల వివరాలు, ఇలా ప్రతి అంశంలోనూ ఈ–పంచాయతీ ఆపరేటర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. మండల ప్రజా పరిషత్తు కార్యాలయాలు, పంచాయతీ క్లసర్? కేంద్రాల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా అవసరాన్ని బట్టి ఉదయం, రాత్రి సమయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే వారికి వేతనం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

**190 మంది నిరీక్షణ**



నాలుగు మాసాలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆపరేటర్లకు ఇస్తున్న వేతనంలో గతేడాది నుంచి రూ.3,250 కోత విధించడంతో ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 190 మంది విధులు నిర్వహిస్తున్నారు. గతేడాది డిసెంబరు దాకా రూ.22,750 దాకా వేతనం రాగా.. జనవరి నుంచి వేతనాల్లో కోత విధించి రూ.19,500 ఇస్తున్నారు. అది కూడా రెండు లేదా మూడు మాసాలకోసారి ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది అక్టోబరు నుంచి నేటి దాకా వేతనాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నామని వాపోతున్నారు.

**పెరిగిన పనిభారం**

పంచాయతీలకు సంబంధించిన పూర్తి వివరాలను కంప్యూటర్లలో నమోదు చేయడం, ధ్రువపత్రాల జారీ నుంచి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తుల నమోదు ఇలా ప్రతి పనిలోనూ పనిభారం పెరుగుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో మండలానికి ఇద్దరు నుంచి ముగ్గురు దాకా విధులు నిర్వహిస్తున్నారు.

**పోషణకు అప్పులు**

ప్రతినెల వేతనాలు ఇవ్వకపోవడంతో ఆపరేటర్లు ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబాలను పోషించేందుకు అప్పులు చేస్తున్నాం. గతంలో ఇచ్చినట్లు వేతనాన్ని రూ.22,750 చొప్పున ఇవ్వాలి. పని భారం పెరుగుతుంటే వేతనాలను తగ్గించడం తగదు. ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఆపరేటర్లకు రూ.15 వేల పారితోషికం ఇవ్వాలి.

అంజి, అధ్యక్షులు, ఈ–పంచాయతీ ఆపరేటర్ల సంఘం, కరీంనగర్ జిల్లా **ఉమ్మడి జిల్లాలో ఈ–పంచాయతీ ఆపరేటర్ల వివరాలు**


జగిత్యాల 63 కరీంనగర్ 52 పెద్దపల్లి 39 రాజన్న సిరిసిల్ల 36

# వేసవి ప్రణాళిక.. సమస్యలు ఉండవిక

భగత్‌నగర్ : వేసవి అనగానే వినియోగదారులకే కాదు విద్యుత్తు అధికారులకూ ముచ్చెమటలు పడతాయి. బోరుబావులపై వ్యవసాయం సాగుతుంది. ఇదే సమయంలో వేసవి తాపం నుంచి రక్షించుకోవడానికి ప్రజలు ఎయిర్ కండిషనర్లు, కూలర్లు, ఫ్యాన్లు విరివిగా ఉపయోగిస్తారు. విద్యుత్తు వినియోగం పెరిగి నియంత్రికలపై, లైన్లపై భారం అధికమవుతుంది. పెరిగిన భారాన్ని తట్టుకోలేక నియంత్రికలు కాలిపోవటం.. లైన్లలో బ్రేక్ డౌన్లు తదితర సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతాయి. పదేపదే కరెంటు సరఫరా నిలిచిపోతుంది. ఇలా జరగకుండా విద్యుత్తు సంస్థ వేసవి ప్రణాళిక చేపడుతుంది.

**భారం పడకుండా..**

విద్యుత్తు పంపిణీలో కీలకం నియంత్రికలు.. ఇళ్లకైనా వ్యవసాయ బావులకైనా వాటి సామర్థ్యంపైనే కరెంటు పంపిణీ వ్యవస్థ ఆధారపడి ఉంటుంది. సామర్థ్యానికి మించి భారం ఉంటే నియంత్రికాలు కాలిపోతాయి. దీన్ని ముందస్తుగా గుర్తించి దాని సామర్థ్యం మించిన నియంత్రిక ఏర్పాటు చేయాలి. క్షేత్రస్థాయిలో టాంగ్ టెస్టర్‌తో నియంత్రికల్లోని ఫీడర్లపైన ఉన్న భారం (లోడ్?) కొలిచి అవసరమైన చోట సామర్థ్యం పెంచారు. అవసరమైన ప్రదేశాల్లో కొత్తవి ఏర్పాటు చేశారు. గతేడాది 693 నియంత్రికల ఏర్పాటు చేశారు. రాబోయే వేసవిలో 136 నియంత్రికల ఏర్పాటుకు ప్రణాళిక తయారు చేశారు.



**విద్యుత్తు ఉపకేంద్రాల అనుసంధానం**

ఒక విద్యుత్తు ఉపకేంద్రంలో సాంకేతిక సమస్య తలెత్తితే మరో ఉపకేంద్రం నుంచి ప్రత్యామ్నాయ మార్గంలో కరెంటు సరఫరా చేసే విధంగా లైన్లను అనుసంధానం చేస్తున్నారు. జిల్లాలో 97 విద్యుత్తు ఉపకేంద్రాలు 33/11కేవీ ఉంటే అందులో 23 విద్యుత్తు ఉపకేంద్రాలకు ప్రత్యామ్నాయ మార్గంలో విద్యుత్తు సరఫరా చేసేలా 23 కొత్త 33 కేవీ లైన్లు నిర్మించారు. వేసవి నాటికి 11 కొత్త లైన్లు నిర్మించడానికి సిద్ధమవుతున్నారు.

**సామర్థ్యం పెంపు**

ఒక ప్రాంతంలోని ఉపకేంద్రంలో కరెంటు సరఫరా నిలిచిపోతే మరో ఉపకేంద్రం నుంచి విద్యుత్తు సరఫరా చేయాలంటే అందులోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచాలి. ఇలా జిల్లాలో 17 పవర్? ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచారు.

# కుప్పం.. ఆధ్యాత్మిక నిలయం

కుప్పం : మూడు ప్రాంతాల భిన్న సంస్కృతులు, సంప్రదాయాల మేళవింపుతో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం.. అటు రాతి పరిశ్రమ.. ఇటు రాజకీయంగానూ ఓ ప్రత్యేక స్థానం కలిగిన ప్రాంతం కుప్పం.. ఇక్కడ లభించే రాతితో దేవతామూర్తుల తయారీతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళతో పాటు ఇతర దేశాల్లో ఆలయ నిర్మాణాలు చేపట్టే కార్మికులూ ఉన్నారు. ఇలాంటి ప్రాంతంలో కొలువైన దేవతామూర్తుల ఆలయాలను మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలోని 11 దేవాలయాల అభివృద్ధికి రూ.50.38 కోట్లు మంజూరు చేశారు. వీటితో పాటు నియోజకవర్గంలోని 130 చిన్న ఆలయాలను తితిదే, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపడుతున్నారు.

**పూర్తి స్థాయిలో అభివృద్ధికి..**

కుప్పం గ్రామదేవత శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామంటూ వైకాపా ప్రభుత్వంలో ఆలయాన్ని పూర్తి స్థాయిలో తొలగించి, అమ్మవారి పీఠాన్ని పక్కనున్న షెడ్డులో నెలకొల్పారు. రాతితో కడుతున్నామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా పూర్తిచేయక.. అసంపూర్తిగా నిర్మించిన ఆలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించి జాతరను సైతం జరిపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అర్ధంతరంగా నిలిచిన పనులను కొంత మేరకు పూర్తి చేసి, ఆలయానికి వచ్చే భక్తుల కోసం షెడ్డును నిర్మించారు. పూర్తి స్థాయిలో అభివృద్ధికి చేసేందుకు శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయాభివృద్ధికి రూ.8.72 కోట్లు మంజూరు చేశారు.

**నిధుల విడుదల ఇలా.. (రూ.కోట్లలో..)**

నూలుకుంట శ్రీకదిరిలక్ష్మీ నరసింహస్వామి: 1.35
కర్లగట్ట శ్రీద్రౌపతి సమేత శ్రీధర్మరాజుల: 5.34
యామగానిపల్లె శ్రీధర్మరాజు ఆలయం: 6.93
రాళ్లబూదుగూరు శ్రీకోదండస్వామి: 7.85
శ్రీసుబ్రహ్మణ్యస్వామి(రామకుప్పం) 3.49
మల్లప్పకొండ మల్లేశ్వరస్వామి: 3.87



శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ: 8.72
పెద్దవంక కనకనాచమ్మ: 3.43
గంధారేశ్వర ఆలయం: 1.87
శ్రీబేటరాయస్వామి: 2.66
గుడివంక: 4.87

**రూ.33 కోట్లతో 130 ఆలయాల అభివృద్ధి..**

నియోజకవర్గంలో 142 చిన్న ఆలయాల అభివృద్ధి ప్రతిపాదనలు పెట్టగా, వీటిలో 130 ఆలయాల అభివృద్ధికి తితిదే రూ.33 కోట్లను మంజూరు చేసింది. ప్రస్తుతానికి 25 శాతం నిధులు మంజూరయ్యాయి. త్వరలో మరో 70 ఆలయాలను గుర్తించి, వాటిని తితిదే ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం.
శాంతారామ్, తితిదే పాలకవర్గ సభ్యుడు, కుప్పం

**పర్యాటకులను ఆకర్షించేందుకు..**

నియోజకవర్గంలోని ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేసి, ఆధ్యాత్మిక ప్రాంతంగా మార్చి పర్యాటకులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించారు. నియోజకవర్గంలోని పెద్ద ఆలయాలను దేవాదాయ శాఖ ఆధ్వర్యం, చిన్న ఆలయాలను తితిదే ఆధ్వర్యంలో అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక కేంద్రంగా మారుస్తాం.
కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీ

# మట్టి.. కొల్లగొట్టి..!

రాజమహేంద్రవరం : మట్టి దందాకు అడ్డులేకుండా పోతోంది.. ఖద్దరు నాయకుల అండదండలతో రెచ్చిపోతూ నిబంధనలను తుంగలోకి తొక్కి అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. ఓ వైపు అధికారులు కేసులు నమోదు చేస్తున్నా.. అయితే మాకేంటి? అన్న చందంగా మళ్లీ తవ్వకాలు చేస్తూ తమ దర్పాన్ని ప్రదర్శిస్తుం డటం గమనార్హం.

**అక్రమాల 'వారధి'..**

గంగంపాలెం శివారునున్న పొలాల్లో మట్టిని యంత్రాలతో తవ్వి రాజమహేంద్రవరం, కడియం తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్కో లారీ మట్టి ధర సుమారు రూ.15 వేలకు విక్రయిస్తున్నారు. గత డిసెంబరు 22న 'మట్టికి రెక్కలు' శీర్షికన లో కథనం ప్రచురితమైన తరువాత జిల్లా గనుల శాఖ అధికారి వెళ్లి కేసులు నమోదు చేశారు. మరి కొన్ని రోజులకే రాత్రి వేళ తవ్వకాలు ప్రారంభించారు. తాజాగా అధికారులు కేసు నమోదు చేశారు. భారీ వాహనాల రాకపోకలకు సూరంపాలెం ప్రాజెక్టు కాలువపై అనధికారికంగా తూరలను ఏర్పాటు చేసి వంతెన నిర్మించినా జలనవరుల శాఖకు పట్టకపోవడం గమనార్హం.

**యంత్రాలు స్వాధీనం చేసుకున్నా..**

గోకవరం మండలం గంగంపాలెంలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ దందాను పలు సార్లు వెలుగులోకి తీసుకురాగా.. జిల్లా గనుల శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. జేసీబీలు సీజ్ చేసినట్లు ప్రకటించారు. కేసులు నమోదు చేస్తున్నా అక్కడ తవ్వకాలు మాత్రం ఇప్పటికీ ఆగడం లేదంటే అక్రమార్కులు ఎంత బరితెగించారో అర్థం చేసుకోవచ్చు. స్థానిక రెవెన్యూ యంత్రాగానికి ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. అందర్నీ కాసులతో బంధించేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

**రాత్రి సమయాల్లో..**

సూదికొండలోని కొండ వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రోజూ రాత్రి పెద్ద ఎత్తున లేఅవుట్‌లకు గ్రావెల్ తరలిస్తున్నారు. అటవీ రేంజ్ సమీపంలో ఈ దందా జరుగుతున్నా తమకు పట్టనట్టు అటవీ, రెవెన్యూ అధికారులు వ్యవహరించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు అందగా కేసు నమోదు చేశారు. అయితే రాత్రి తవ్వకాలు చేపట్టడం గమనార్హం.

# ఆర్‌బీఎస్‌కే.. పిల్లల ఆరోగ్యానికి నమ్మకమైన రక్షణ




అనంతపురం : పిల్లలకు పుట్టుకతో వచ్చే వివిధ రకాల జబ్బులను గుర్తించి సకాలంలో వైద్యచికిత్సలు అందించేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, పాఠశాలల్లో చదువుతున్న 18 ఏళ్లలోపు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి గుర్తించిన జబ్బులకు చికిత్సలు అందించేందుకు జాతీయ ఆరోగ్య మిషన్ కింద రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)ను ప్రారంభించింది.

**చికిత్సలు ఇలా..:** ఆటిజం వంటి సమస్యలున్న వారికి డీఈఐసీలో వైద్యసేవలు, నడవలేని వారికి వ్యాయామాలు, మాట్లాడలేని వారికి స్పీట్‌థెరఫి సేవలు అందిస్తున్నారు. గుండెకు సంబంధించి బైపాస్ సర్జరీ వంటి వాటిని తిరుపతి, హైదరాబాద్‌లో.., పెదవి చీలిక శస్త్రచికిత్సలు, కంటి శస్త్రచికిత్సలు కడపలోని పుష్పగిరి కంటి వైద్యశాలలో ఉచితంగా చేయిస్తున్నారు.

48 రకాల జబ్బులకు ఎన్టీఆర్ వైద్యసేవ అమలవుతున్న ప్రైవేట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రిలో చికిత్స ఉచితంగా అందిస్తున్నారు.

**వీటిపై దృష్టి**పుట్టుకతో వచ్చే గుండె జబ్బులు, డౌన్‌సిండ్రోమ్, న్యూరల్ ట్యూబ్ లోపాలు, గ్రహణ మొర్రి, చీలిక పెదవి, వంకర పాదాలు (క్లబ్‌ఫుట్), తుంటి అభివృద్ధి, డిస్ప్లాస్పియా, దంత, చర్మ, కంటి, చెవి సమస్యలు, మూర్ఛవ్యాధి, విటమిన్ లోపాలు వంటి తదితర వాటిపై దృష్టిసారిస్తున్నారు.

**స్క్రీనింగ్ పరీక్షల తీరు..**

అనంతపురం జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు: 2302
గత ఏడాది స్క్రీనింగ్ పరీక్షల చేయాలనుకున్న వారి సంఖ్య : 2,04,206
స్క్రీనింగ్ పరీక్ష చేయించింది: 1,96,444 మందికి
లోపాలు తేలిన తీరు:..
పుట్టుకతో వచ్చే లోపాలున్న కేసులు : 16
రక్తహీనత, పోషకాహార లోపం : 157
వివిధ రకాల అనారోగ్య సమస్యలు : 567
జిల్లావ్యాప్తంగా పాఠశాలలు : 1741
స్క్రీనింగ్ పరీక్షలు చేసింది: 2,36,763 మందికి
సమస్యలు తేలిన విద్యార్థుల సంఖ్య: 1498
పుట్టుకతో లోపాలున్న కేసులు: 24
పోషకాహార, రక్తహీనత లోపాలు: 235
చర్మ, పంటి సంబంధిత, మూర్ఛ, ఇతర: 640

# అమృత.. కాలం



తిరుపతి : అమృత్ 2.0 పథకం పట్టాలెక్కేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడంతో నగరాలు, పట్టణాల్లో మరిన్ని మౌలిక వసతులు సమకూరనున్నాయి. ఈ పథకం ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.355.96 కోట్ల విలువైన 28 పనులు చేపట్టనున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తికావడంతో ఫిబ్రవరిలోపు పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**ఏఏ పనులు చేస్తారంటే...**

రాబోయే పాతికేళ్ల జనాభా అవసరాలకు అనుగుణంగా నగర, పురపాలికల్లో నీటి పథకాల విస్తరణ, చెరువుల ఆధునికీకరణ, మురుగు నీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపడతారు. పైప్‌లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, చెరువుల్లో పూడికతీత, గట్ల బలోపేతం, వాకింగ్ ట్రాక్‌లు, బలహీనవర్గాల కాలనీలకు నీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. అమృత్ నిధులతోపాటు 15, 16వ ఆర్థిక సంఘం నిధులు, నగరపాలికలు, పురపాలికల నిధులను వెచ్చిస్తారు.

వెంకటగిరి పురపాలికలో నీటి సరఫరా అభివృద్ధికి రూ.102.86 కోట్లు కేటాయించారు. శ్రీకాళహస్తి తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.27.30 కోట్లు కేటాయించారు.

చిత్తూరులో మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకు రూ.34.43 కోట్లు, తాగునీటి సరఫరాకు రూ.29.70 కోట్లు, పుత్తూరుకు తాగునీటి సరఫరా పథకానికి రూ.14.70 కోట్లు మంజూరయ్యాయి.


**సవరించిన అంచనాలతో టెండర్లు**

2016-20 మధ్యకాలంలో చేపట్టిన అమృత్ 1.0లో పనులు పూర్తి చేయడానికే పరిమితమైన వైకాపా ప్రభుత్వం 2.0ను పూర్తిగా విస్మరించింది. నెల్లూరు సర్కిల్ ప్రజారోగ్య విభాగం పరిధిలోని తిరుపతి జిల్లాలో గతంలో రూ.184.68 కోట్లు, చిత్తూరు జిల్లాలో రూ.144.72 కోట్లతో అంచనాలు తయారు చేయగా.. కూటమి ప్రభుత్వం తాజాగా పెరిగిన ధరలను అనుసరించి కొత్తగా రూ.355.96 కోట్లకు టెండర్లు పిలిచింది. మేఘా సంస్థ ఈ పనులు దక్కించుకుంది.

త్వరలో పనుల ప్రారంభం.. ఇప్పటికే టెండర్ల నిర్వహణ పూర్తయిందని, ఒప్పందం ప్రక్రియ తుదిదశలో ఉందని, కుప్పంలో పనులు ప్రారంభమైనట్లు ప్రజారోగ్య విభాగం నెల్లూరు సర్కిల్ ఎస్ఈ టి.మోహన్ తెలిపారు. చిత్తూరు జిల్లాకు మంజూరైన నిధులు (రూ.కోట్లలో)

పురపాలిక నిధులు
చిత్తూరు 71.83
కుప్పం 17.54
పుంగనూరు 14.35
పలమనేరు 18.01
నగరి 20.13
మొత్తం 141.86

# నొప్పుల మాత్రలతో మత్తెక్కిస్తారు.. గంజాయి స్థానంలో సూదుల వినియోగం



తిరుపతి : జిల్లాలో మత్తు మాఫియా ఆగడాలు వీడటం లేదు. గంజాయి స్థానంలో మత్తుమాత్రల పొడితో నరాలకు సూదిమందు వేసుకుని మైకంలో జోగడం కలకలం రేపుతోంది. కొందరు ఏకంగా సిబ్బందిని నియమించుకుని కావాల్సినవారికి సూదులు వేసి డబ్బు దండుకుంటున్నట్లు తెలుస్తోంది. కడుపులోకి పంపాల్సిన ఆ మాత్రలను రక్తం, కండరాల్లోకి పంపడంతో ప్రాణాలకే ప్రమాదం ఉంటుందని తెలిసినా యథేచ్ఛగా వినియోగిస్తున్నారు.

**నేరాల నుంచి తప్పించుకోవచ్చని**

గంజాయి అక్రమ రవాణా.. విక్రయాల కేసులతో పరిచయం ఉన్న ఇద్దరు మహిళలు పోలీసు చర్యలకు భయపడి మత్తు సూదుల విక్రయాలకు తెరతీసినట్లు తెలుస్తోంది. నార్కోటిక్ (ఎన్‌డీపీఎస్) పరిధిలోకి రాని మత్తు మాత్ర (ట ఫెంటడాల్)లను సూదుల రూపంలో నరాల్లోకి ఎక్కిస్తూ.. దొరికినా పెద్దగా శిక్షలు ఉండవని తెలుసుకుని తాతయ్యగుంట కేంద్రంగా ఈ దందా నడుపుతున్నారు. ఇందుకు ఏకంగా కొందరు సిబ్బందిని నియమించుకుని అలవాటు పడ్డవారి నుంచి ఫోన్.. మెసేజ్ రాగానే అక్కడికి వెళ్లి మత్తుసూదులు వేస్తున్నారు. మాత్రలను పొడిచేసి స్టైరెల్ వాటర్‌తో వేడి చేశాక ఆ మిశ్రమాన్ని సిరంజ్‌లోకి ఎక్కించి.. ఆర్డర్ల ప్రకారం అక్కడికి వెళ్లి వేస్తున్నట్లు సమాచారం. ఇంకొందరు టఫెంటడాల్ మాత్రలను మద్యంలో కలుపుకొని తాగి మత్తులో జోగుతున్నారు.

**కార్గోలో కిలోలు చొప్పున**

మాత్రలను వైద్యుడి సిఫార్సుతోనే ఔషధరి దుకాణదారులు విక్రయించాలి. వివరాలు నమోదు చేసుకోవాలి. అలాంటి నిషేధిత మందు బిల్లలు 20 - 50 కిలోల వరకు కార్గోలో అనంతపురం, తాడిపత్రి నుంచి తిరుపతికి తెప్పించుకుంటున్నట్లు తెలిసింది.

# మహాశివరాత్రి పర్వదినం.. అప్రమత్తతే ప్రధానం

అన్నవరం : ఈ నెల 15న మహాశివరాత్రి పర్వదినం. జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలు పిఠాపురం, ద్రాక్షారామ, సామర్లకోట ఆలయాల్లో రద్దీ అధికంగా ఉంటుంది. అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు సహకరించి దర్శనానికి కొంత సమయాన్ని ముందుగానే ప్రణాళిక చేసుకుని ప్రశాంతంగా శివారాధన చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

**ఇలా చేస్తే సాఫీగా..**నిర్దేశించిన క్యూలైన్లలో మాత్రమే వెళ్లాలి. దర్శన సమయాలను పాటించాలి. రద్దీ నేపథ్యంలో భక్తి, సహనంతో వేచి ఉండాలి. వృద్ధులు, మహిళలు, పిల్లలు ముందుగా వెళ్లేలా సహకరించాలి. తొక్కిసలాట, పెద్దగుంపు, అస్తవ్యస్త పరిస్థితి ఉండే ఆ ప్రాంతం నుంచి దూరంగా వెళ్లాలి. ఇబ్బంది ఉంటే సిబ్బందికి తెలపాలి. క్యూలైన్లలో వ్యతిరేక దిశలో ప్రవేశిస్తే ఎదుటి వారికి ఇబ్బంది ఏర్పడుతుంది. తోసుకోవడం, ముందు ఉన్నవారిని నెట్టడం ప్రమాదాలకు దారి తీయొచ్చు. రైలింగ్‌లు, బారికేడ్లపై బరువు ఆన్చి నిల్చోవద్దు. అధికారుల సూచనలు పాటించాలి.

**అధికారుల ప్రణాళిక** ఆలయాల్లో పకడ్బందీ క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. అదనపు సిబ్బందిని నియమిస్తున్నారు. భద్రతను కట్టుదిట్టం చేశారు. స్వచ్ఛంద సేవకుల సహకారం తీసుకుంటున్నారు. వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నారు. సూచీబోర్డులు ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నారు.



# పనుల్లో వేగం.. నాణ్యత ఆగమాగం!

ఆకివీడు : ఆకివీడు మండలం గుమ్ములూరు నుంచి అప్పారావుపేట వరకు పంచాయతీరాజ్ ప్రాజెక్టులో రూ. 1.5 కోట్లతో నిర్మిస్తున్న రహదారి పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. నాసిరకం మెటీరియల్ వినియోగంతో పాటు కనీస పర్యవేక్షణ లేకుండా పనులు సాగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పాలకొల్లు పట్టణ పరిధి యడ్లబజారు నుంచి ఆచంట వైపు వెళ్లే రహదారిని ఇటీవల నిర్మించారు. దీని అంచుల్లో పాత రోడ్డు తొలగించిన శిథిలాలు వేసి వదిలేయడం విమర్శలకు తావిస్తోంది.

కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లా వ్యాప్తంగా రహదారుల నిర్మాణం ఊపందుకుంది. రూ. కోట్లలో నిధులు మంజూరు చేయడంతో అన్ని ప్రాంతాల్లోనూ పనులు చేపట్టగా ప్రజల ప్రయాణ కష్టాలకు మోక్షం లభించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ పనులతో రహదారుల నాణ్యత, మన్నిక ప్రశ్నార్థంగా మారుతోంది. పలు ప్రాంతాల్లో నాణ్యత ప్రమాణాలను గాలికొదిలేసిన తీరు తేటతెల్లమవుతోంది. పాలకొల్లు- దొడ్డిపట్ల ప్రధాన రహదారి నిర్మాణ



ంలో అడవిపాలెం వద్ద వినియోగిస్తున్న నల్ల కంకర గుట్ట ఇది. దీనిలో పెద్ద రాళ్లతో పాటు బూడిద కూడా కలగలిసి ఉంది. రూ.20 కోట్లతో చేపట్టిన ఈ రోడ్డు నిర్మాణంలో ఇలాంటి కంకర వినియోగిస్తే మన్నిక ప్రశ్నార్థంగా మారుతుందని స్థాన్నిలు అభిప్రాయ పడుతున్నారు.

**పర్యవేక్షణ లేక..** రహదారుల నిర్మాణాల్లో గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలకంటే వేగానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉదయం 7 గంటలకే పనులు ఆరంభించి సాయంత్రం చీకటి పడే వరకు చేస్తున్నారు. దీంతో అధికారులకు పర్యవేక్షణకు అవకాశం ఉండటం లేదు. ఉదయం 7 గంటలకు విధులకు వచ్చే సిబ్బంది మచ్చుకు కూడా కనిపించరు. సాయంత్రం చీకటి పడే వరకు ఉండాలంటే అసలు అయ్యే పనికాదు. దీంతో గుత్తేదారులు ఇష్టానుసారం పనులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దొడ్డిపట్ల రహదారి నిర్మాణంలో 20 వరకు కాంక్రీటు మిక్సర్లు పనిచేస్తున్నాయి. అన్ని చోట్లా కాపలా ఉండాలంటే సరిపడా సిబ్బంది లేరు. పరిస్థితుల్లో నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది.

# గుట్టుగా తవ్వకం.. గట్టు మాయం!

లావేరు: తోటపల్లి ప్రాజెక్టు కాలువల ద్వారా ప్రస్తుతం సాగునీరు రాకపోవడంతో గట్లు ఎక్కడికక్కడ మాయమవుతున్నాయి. గట్లకు ఇరువైపులా వేసిన మట్టిని రాత్రి వేళ కొందరు అక్రమంగా తవ్వేస్తున్నారు. ట్రాక్టర్లలో తరలించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో దందా యథేచ్ఛగా సాగుతోంది.

**అంతా అధ్వానం** విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పెద్దనడిపల్లి నుంచి లావేరు మండల పరిధి జి.జి.వలస, లావేటిపాలెం, లావేరు, బొడ్డపాడు మీదుగా దుర్గమ్మతల్లి ఆలయం వెనక నుంచి గురుగుబిల్లి, శిగురుకొత్తపల్లి, బొంతుపేట తదితర ప్రాంతాలకు వెళ్లే 17ఎల్ తోటపల్లి ప్రధాన కాలువను పదేళ్ల కిందట తవ్వారు. అసంపూర్తిగా పనులు చేపట్టడంతో ముళ్లపొదలు, పనికి రాని మొక్కలతో కాలువ పూడిపోయి ఎక్కడికక్కడ అధ్వానంగా దర్శనమిస్తోంది.

కొందరు లేఅవుట్ల చదునుకు, ఇళ్ల నిర్మాణలకు, కల్లాలు ఎత్తు చేసుకోవడానికి మట్టి తవ్వేసి అక్రమంగా తరలిస్తున్నారు.

గురుగుబిల్లి సమీపంలో కాలువకు ఇరువైపులా వేసిన గట్లను సుమారు 300 మీటర్ల మేర తవ్వేయడంతో రూపు కోల్పోయింది. రాత్రి వేళ యంత్రాలతో తవ్వేస్తున్నారని సమాచారం. సుమారు 500 ట్రాక్టర్లలో తరలించారని తెలిసింది. ఒక లోడు రూ.800 నుంచి రూ.1,500 వరకు విక్రయిస్తున్నారని సమాచారం.

**కాపలాదారులు కరవు**

తోటపల్లి ప్రాజెక్టుకు సంబంధించి పర్యవేక్షణ, ఇతర పనులు చూసుకోవడానికి కాపాలదారులను నియమించకపోవడంతో కాలువ నిర్వహణ అధ్వానంగా మారింది. వైకాపా ప్రభుత్వం కాలువ నిర్వహణను గాలికొదిలేయడంతో ఐదేళ్ల పాటు ఖరీఫ్‌లో సాగునీరందలేదు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం..**

తోటపల్లి కాలువ గట్టును తవ్వేసి మట్టి అక్రమంగా తరలిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తాం. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం.
లావణ్య ప్రియదర్శిని, డీఈఈ, రణస్థలం క్లస్టర్, తోటపల్లి ప్రాజెక్టు

# కాగితాల్లోనే ఆధునికీకరణ..!

శ్రీకాకుళం :2022 జూన్‌లో అప్‌స్ట్రీమ్ ఓపెన్ కావడం.. హెడ్‌వాల్ మరమ్మతులకు గురవడంతో 7.5 కిలోమీటరు అక్కరాపల్లి (కిట్టాలపాడు సమీపంలో) వద్ద అండర్ టన్నెల్ కొంతమేర కూలిపోయింది. దిగువనున్న సుమారు లక్ష ఎకరాలకు సాగునీరందించలేని పరిస్థితి తలెత్తింది. 2023లో జలుమూరు మండలం వద్ద ప్రధాన కాలువకు గండి పడింది. వారం పాటు దిగువనున్న ఆరు మండలాలకు సాగునీరు అందించలేకపోయారు. గండి పూడ్చిన తర్వాత విడుదల చేశారు.

గతేడాది వరదల సమయంలో హెడ్‌స్లూయిస్ వద్ద గండి పడింది. వర్షాకాలంలో పూర్తి సామర్థ్యం మేరకు కాలువలోకి నీరు విడుదలకు సాధ్యపడలేదు. ఏటా ఇదే పరిస్థితి. షట్టర్లకు లీకులుండటంతో శివారుకు నీరందించలేకపోతున్నారు.

వంశధార నదిలో నీరున్నా పూర్తిస్థాయిలో రైతులకు అందడం లేదు. 50 ఏళ్ల కిందట నిర్మించిన గొట్టా బ్యారేజీ పైనే ఇప్పటికీ ఆధారపడుతున్నారు. ఎడమ కాలువ అధ్వాన స్థితికి చేరుతోంది. సుమారు 1.48 లక్షల ఎకరాల సాగుకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు నెలకొన్నాయి.

**పొంచి ఉన్న ముప్పు**

వంశధార ఎడమ కాలువ గట్లు పటిష్ఠంగా లేకపోవడం, అండర్ టన్నెళ్లు, ఓటీ స్లూయిస్, సూపర్ పాసేజ్‌లు, సింగిల్ లైన్ బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరాయి.

కిట్టాలపాడు (9.8 కిలోమీటరు) వద్ద ఎస్‌ఎల్‌బీ అధ్వానంగా ఉంది.

కాలువ ప్రారంభంలో ఎనిమిది మీటర్ల మేర మట్టి కాలువ ఉండటంతో నీటి విడుదల సమయంలో గండి పడే పరిస్థితి నెలకొంది.

రూ.1,500 కోట్లకు చేరిన వ్యయం: వంశధార ఎడమ కాలువపై నిర్మించిన సుమారు 150 రాతి కట్టడాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. 900 షట్టర్లు, 212 రెగ్యులేటర్లు మరమ్మతులకు గురయ్యాయి.

ఏటా ఆధునికీకరణ పనులకు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు చేయలేదు. 2012లో రూ.400 కోట్ల అంచనాతో పంపిన ప్రతిపాదనలు ఈ ఏడాది రూ.1500 కోట్లకు చేరాయని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

**సన్నగిల్లుతున్న సామర్థ్యం**

వంశధార ఎడమ కాలువ సామర్థ్యం క్రమేపీ సన్నగిల్లుతోంది. చిన్నపాటి వరదొచ్చినా ఎక్కడో ఓ చోట గండి పడుతోంది.

1971-77 మధ్య నిర్మించిన లైనింగ్, రాతికట్టడాలు కూలిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. షట్టర్లు, గేట్లు మరమ్మతులకు గురయ్యాయి.

ఏడేళ్లుగా సంతబొమ్మాళి, నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస, పోలాకి మండలాల్లో శివారు పొలాలకు నీరందడం లేదు.

2,480 క్యూసెక్కుల సామర్థ్యంతో నీరు విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ 1,800 క్యూసెక్కులు సరఫరా చేయలేకపోతున్నారు.

**అనుమతిస్తే వేసవిలో పనులు ప్రారంభం**

వంశధార ఎడమ కాలువ ఆధునికీకరణకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. సమస్యను కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడి దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులు అనుమతిస్తే వేసవిలో పనులు మొదలయ్యే అవకాశం ఉంది. గురుగుబిల్లి రామచంద్రరావు, ఎస్ఈ, వంశధార ప్రాజెక్టు

## చీనీ రైతుల చింత తీర్చేదెవరూ

అనంతపురం : హైదరాబాద్‌లోని గడ్డిఅన్నారం చీనీ మార్కెట్ తర్వాత అనంతపురం మార్కెట్‌యార్డులోని చీనీ సంత పెద్దది. సీజన్లలో రైతులు భారీగా చీనీకాయలను సంతకు తీసుకొస్తారు. రోజుకు సుమారు రూ.2-3 కోట్ల వ్యాపారం సాగుతోంది. నిత్యం రూ.1-1.50 లక్షల ఆదాయం యార్డుకు వస్తుంది. అంత ఆదాయం వచ్చే యార్డులో చీనీ సంత కోసం నిర్మించే కవరింగ్ షెడ్డు మూడేళ్లుగా నిర్మాణానికి నోచుకోవడం లేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.2.20 కోట్లతో కవరింగ్ షెడ్డు నిర్మాణం చేపట్టారు. దానికి అనుసంధానంగా మరో రూ.1.40 కోట్లతో షెడ్డు నిర్మాణ పనులు పొడిగించారు. షెడ్డు నిర్మాణం పూర్తయినా కింది భాగంలో ప్లాట్‌ఫాం, మురుగు వ్యవస్థ పనులు చేపట్టలేదు. పొడిగించిన షెడ్డు నిర్మాణం పిల్లర్ల దశలోనే ఆగిపోయింది. యార్డులో చీనీ సంత ఈనెలాఖరు నుంచి ప్రారంభమవుతుంది. మార్చి-జూన్ వరకు భారీగా చీనీకాయలు సంతకు వస్తాయి. ఆ తర్వాత అక్టోబరు వరకు కొనసాగుతోంది. వేసవిలో సంత



జరగడంతో ఎండకు కాయలు మాడిపోతాయి. సత్వరమే షెడ్డు నిర్మాణం పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

**రూ.8 కోట్లతో అంచనాలు..**

కొత్తగా ఎన్నికైన వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ అసంపూర్తి పనులకు అంచనాలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. సుమారు రూ.8 కోట్లతో అంచనా వేసినట్లు మార్కెటింగ్‌శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. అందులో అసంపూర్తిగా ఉన్న కవరింగ్ షెడ్డు నిర్మాణం కూడా ఉంది. కమిటీ సమావేశంలో చేపట్టాల్సిన పనులకు తీర్మానం చేసి ఆమోదం తెలపాలి. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. అయితే కమిటీ సమావేశం ఇంతవరకు జరగలేదు.

## నరసన్న 'కొండ' అసౌకర్యాలే నిండా

కోరుకొండ : ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో కోరుకొండ లక్ష్మీనరసింహఆలయం ఒకటి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఇక్కడకు వస్తారు. ఈనెల 26న జరిగే నరసన్న ఉత్సవాలకు లక్షల సంఖ్యలో తరలివస్తారు. అంతటి ప్రసిద్ధమైన ఆలయంలో అనేక కష్టాలు వెంటాడుతున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో ఇప్పటికైనా వీటిపై దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు.

**40 ఏళ్ల క్రితం నిర్మించిందే..**

కొండ ఎక్కేందుకు మెట్ల మధ్య భాగంలో, రెండు వైపులా ఇనుప గొట్టాలతో రెయిలింగ్ ఏర్పాటు చేశారు. వీటి సాయంతో భక్తులు



ఎక్కుతారు.. దిగుతారు.. 40 ఏళ్ల క్రితం వీటిని ఏర్పాటు చేయగా ఆ తర్వాత పట్టించుకున్న దాఖలాలు లేవు. కొన్నిచోట్ల రెయిలింగ్ పూర్తిగా దెబ్బతింది. మరికొన్ని చోట్ల గొట్టాలు ఊడిపోయాయి.

పైఆలయ ప్రాంగణం చుట్టూ రక్షణ గోడ ప్రమాదకరంగా ఉంది.

రథోత్సవం, చక్రస్నానం రోజుల్లో యాత్రికులు, భక్తులతో కొండపై భాగం కిక్కిరిసిపోతుంది. కోతులు బెడద విపరీతంగా ఉంది.

కొండపై స్వామిని దర్శించుకునేందుకు 615 మెట్లు ఎక్కాలి.

నిటారైన కొండ, మెట్లు చిన్నవి కావడం, కొన్నిచోట్ల పాదం కూడా పూర్తిగా పట్టని మెట్లు ఉండటం గమనార్హం.

అందులో కొన్ని శిథిలావస్థకు చేరాయి.

మెట్లకు ఇరువైపులా ప్రహరీ దిమ్మెలు పాడయ్యాయి.

కొండ ఎక్కిన భక్తులకు అత్యవసరమైతే మరుగుదొడ్లు లేవు.

విశ్రాంతి తీసుకునేందుకు మండపాలు లేవు.

దర్శన సమయాలు తెలిపే సూచికలు లేవు.

పై ఆలయంలో ఏకకాలార్చన కావడంతో కొంతమంది దర్శనం చేసుకోకుండానే వెనుదిరగాల్సి వస్తుంది.

## చేనేతలకు తీపి కబురు!

కాకినాడ : చేనేతలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఉచితవిద్యుత్తు అమలు చేస్తామని ఇటీవల చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత ప్రకటించారు. దాంతో నేతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చేనేత కార్మికుల ఇళ్లకు 200 యూట్లు, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్లు చొప్పున ఉచిత విద్యుత్తును ఇవ్వనున్నారు.

**నిబంధనల సడలింపు**

గతంలో ఇళ్లకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును సరఫరా చేసేవారు. 101 యూనిట్లు వస్తే మొత్తం బిల్లు చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడా విధానాన్ని మార్చి ఉచిత పరిమితి దాటి అదనంగా వచ్చిన యూనిట్లకు మాత్రమే ఛార్జీలను చెల్లించేలా అమలు చేయనున్నట్లు సమాచారం.



**తగ్గనున్న భారం**

చాలామంది తమ ఇళ్లల్లోనే మగ్గాలతో నేత నేస్తారు. ఆ సమయంలో మగ్గం వద్ద ఒక బల్బు వెలుగుతూ ఉండాలి. వారికి విద్యుత్తు బిల్లులు మరింత భారమయ్యేవి. ప్రభుత్వ నిర్ణయంతో వారికి ఉపశమనం కలగనుంది. కూటమి అధికారంలోకి వచ్చాక చేనేతల పింఛన్‌ను సైతం రూ.2,750 నుంచి రూ.4వేలకు పెంచడం ఊరటనిచ్చింది. ఈ పథకానికి గతంలో లబ్ధిదారులంతా అర్హులేనని, కొత్తగా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని జౌళిశాఖ ఏడీ కె.పెద్దిరాజు తెలిపారు. అర్హులైన వారంతా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**జిల్లాలో ఇవీ లెక్కలు..**

చేనేత క్లస్టర్లు: 03

సంఘాలు: 13

సంఘాల్లోని సభ్యులు: 5వేల మంది పైనే, చేనేత కుటుంబాలు: 3,500, ఉచిత విద్యుత్తుకు అర్హులు: 2,151, పవర్ లూమ్స్: 1

# దేవుడి లెక్క వేరే ఉంది!



గుత్తి : గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ నియోజకవర్గాల్లో దేవుడి భూములను ఆక్రమణదారుల పరం అవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో రాజకీయ పలుకుబడి ఉన్నవారు రూ.కోట్లు విలువైన ఆలయ భూములను కబ్జాచేస్తున్నారు. ఇంత జరుగుతున్నా దేవాదాయశాఖ అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు.

నిబంధన: రెవెన్యూ అధికారులు ఆలయ భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు దేవుళ్ల పేరుతో ఇవ్వాలి.

ఉల్లంఘన: ఆలయ భూములను కబ్జా చేసిన వారికే భూములపై హక్కులు కల్పిస్తూ పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడుతూ ఈపని చేసినట్లు ఆరోపణలున్నాయి.

ఫలితం: ఆలయ భూములు రెవెన్యూ రికార్డుల్లో మాయం అవుతున్నాయి.

**క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా...**

గుత్తి పట్టణం దాసరికాలనీలో రూ.20కోట్లు విలువైన 3ఎకరాలు ఆక్రమణలకు గురైంది. రామస్వామి రూ.10కోట్లు విలువైన ఆలయ భూమికి రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసుపుస్తకాలిచ్చారు. గొందిపల్లిలో బొలికొండ రంగనాథస్వామి రూ.30లక్షల విలువైన మూడెకరాలు అన్యాక్రాంతమైంది. రెవెన్యూ అధికారులతో ఇంటి పట్టాలు పొంది అనేకమంది పక్కా ఇళ్లను నిర్మించుకున్నారు. జక్కలచెరువులో ఇనాంభూమికి మూడేళ్ల కిందట ఓ వ్యక్తి మరొకరికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించడం వివాదాస్పదమవుతోంది. రజాపురంలోని 6.85 ఎకరాల మఠం భూమిని కొందరు ఆక్రమించుకోగా గ్రామస్థులు అడ్డుకున్నారు. బురుడాల విఘ్నేశ్వరుడి ఆలయానికి చెందిన సర్వే నంబరు 82, 83లలో 34 ఎకరాలపైనే ఉంది. ఈ భూమిని శ్రీపురానికి చెందిన 15 మంది ఆక్రమించారు. పథకం ప్రకారం క్రయ, విక్రయాలు జరిపారు. లింకు డాక్యుమెంట్లు ఉండటంతో రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. దీనిపై గ్రామస్థులు న్యాయపోరాటం చేసి విజయం పొందినా ఆర్డీవో పాసుపుస్తకాలను మాత్రం రద్దు చేయలేకపోతున్నారు.

యాడికి చెన్నకేశవస్వామి ఆలయ భూమి స్వార్థపరుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఉరవకొండ పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయభూమి కూడా ఇదే తీరు. సర్వేనంబరు 141, 132-ఏతోపాటు 26మందికి పట్టాలు ఇచ్చారు. అనువంశికంతోపాటు డీ పట్టాలతో ఆక్రమణదారులకు హక్కులు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉంది. 2,163 ఎకరాల భూమి ఉండగా 6 గ్రామాల్లో ఆక్రమణలకు గురైంది.

కాపాడుకుంటాం

దేవుడి భూములను కాపాడుకుంటాం. వ్యక్తుల పేర్లతో ఇచ్చిన పాసుపుస్తకాలను రద్దు చేయాల్సి ఉంది. రజాపురం విఘ్నేశ్వరాలయం భూమి ఆక్రమణదారులకు ఇటీవల ఆర్డీవో నోటీసులు జారీ చేశారు. నాగేంద్రుడు, సమూహ ఆలయాల ఈవో గుత్తి

# బుక్ చేసుకుంటే పొలం వద్దకే డ్రోన్



ధర్మవరం : పంటల సాగులో రైతులను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం నూతన విధానాలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగానే గ్రామాల్లో సంఘాలుగా ఏర్పడిన రైతులకు రాయితీతో డ్రోన్లు మంజూరు చేసింది. వీటి ద్వారా పంట పొలాలకు మందులు పిచికారీ చేసుకునే వెసులుబాటును కల్పించింది. ఈసారి కొత్తగా ఆలోచన చేసింది. 'యుబలైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్స్' పేరిట యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంట్లో పేర్లు నమోదు చేసుకుంటే డ్రోన్‌తో పొలాల వద్దకే వచ్చి మందులు పిచికారీ చేసి వెళ్తారు.

**రిజిస్ట్రేషన్ చేసుకోండిలా..**

సెల్‌ఫోన్‌లో ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్‌లో రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దాంట్లో యుబలైజేషన్ బటన్ నొక్కిత్ లాగిన్ లేదా సిటిజన్ అని వస్తుంది. దీన్ని నొక్కి రైతు ఫోన్ నంబరు నమోదు చేస్తే.. ఓటీపీ వస్తుంది. ఓటీపీని యాప్‌లో ఎంటర్ చేస్తే.. దగ్గరలో ఉన్న డ్రోన్, ఇతర యంత్ర పరికరాల వివరాలు కనిపిస్తాయి. కావాల్సిన యంత్రాన్ని బుక్ చేయగానే.దాని యజమాని వివరాలు వస్తాయి. రైతులు తమకు కావాల్సిన డ్రోన్లను బుక్ చేసుకొని, సమయం తెలిపితే పొలం వద్దకే వచ్చి మందులు పిచికారీ చేసేలా కార్యాచరణ రూపొందించారు.

శ్రీసత్యసాయి జిల్లాలో 24 డ్రోన్లను ప్రభుత్వం 80 శాతం రాయితీతో మంజూరు చేసింది. ఎకరాకు రూ.450- 500 చొప్పున అద్దె వసూలు చేస్తుంది. ఒకవేళ పది ఎకరాలకు పైగానే పంటలు ఉంటే.. ఈ మొత్తం కాస్త తక్కువగానే ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా డ్రోన్ సేవలు అందుబాటులోకి రాగా.శ్రీసత్యసాయి జిల్లాలో మూడు రోజులుగా దీనిపై ఆర్ఎస్‌కే సిబ్బందికి ఉన్నతాధికారులు అవగాహన కల్పిస్తున్నారు.**రైతులకు ఉపయుక్తం**

మూడు రోజుల కిందటే ఈ యాప్ అందుబాటులోకి వచ్చింది. కూలీలతో ఇబ్బందులు లేకుండా ఉండాలంటే డ్రోన్లను రైతులు ఉపయోగించుకోవాలి. దీనిపై ఆర్ఎస్‌కే సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం.కృష్ణయ్య, జిల్లా వ్యవసాయాధికారి

# కొలిక్కి తెస్తారా.. వెనక్కి పంపిస్తారా?



పుట్టపర్తి : ఉపాధిహామీ పథకం చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించింది. వీబీజీరామ్‌జీ పథకంగా పేరు మార్పు చేసింది. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో నీటి సంరక్షణ, మెటీరియల్ కాంపొనెంట్ కింద పంచాయతీకి శాశ్వత ఆస్తులు సమకూరేలా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి నూతన పథకం అమలు కానున్న నేపథ్యంలో పాత పథకం కింద మంజూరైన పనులు పూర్తి చేయాలని కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు కృషి చేస్తున్నారు.

**మార్చి 15లోపు సాధ్యమేనా?**

2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో సీసీ, బీటీ రహదారులతో పాటు మురుగు కాలువల నిర్మాణాలకు కోట్లాది రూపాయలు కేటాయించారు. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిర్దేశిత లక్ష్యం మేరకు మిగిలిన రూ.88.90 కోట్ల పనులను మార్చి 15లోపు పూర్తి చేయాల్సి ఉంది. లేకుంటే నిధులు వెనక్కి వెళ్లిపోతాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు జారీ చేసింది. డ్వామా పీడీ విజయప్రసాద్ వివరణ కోరగా.. నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నామని చెప్పారు.

2025-26 ఆర్థిక సంవత్సరానికి మంజూరైన నిధులు, పనుల పురోగతి

మొత్తం పనులు: 29,132నిధుల అంచనా: రూ.321.89 కోట్లు

ఇప్పటి వరకు పూర్తయినవి: 17,136

ఖర్చు చేసిన నిధులు : రూ.232.99 కోట్లు

పురోగతిలో ఉన్న పనులు: 11,996

ఖర్చు చేయాల్సింది : రూ.88.90 కోట్లు

## అరటి.. కొబ్బరి మార్కెట్లలో సందడి

అంబాజీపేట: దేశవ్యాప్తంగా నిర్వహించే మహాశివరాత్రి పండుగ నేపథ్యంలో కోనసీమలోని కొబ్బరి, అరటి మార్కెట్‌లో సందడి చోటుచేసుకుంది. ధరలు కాస్త ఆశాజనకంగానే ఉన్నాయి. ఈనెల 15న (ఆదివారం) మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వారం రోజుల ముందుగా ఆయా మార్కెట్లలో వ్యాపార లావాదేవీలు ఊపందుకున్నాయి. కొబ్బరి విషయానికి వస్తే శివరాత్రికి పొరుగు రాష్ట్రాలకు ఇప్పటికే ఖరీదులు అయిపోయాయి. ఈ నేపథ్యంలో ధరలు కొంచెం తగ్గాయి. తమిళనాడు రాష్ట్రంలో కొబ్బరి ధర ఇతర రాష్ట్రాల వ్యాపారులకు అనుకూలంగా ఉండడంతో అక్కడి కాయలనే ఆయా రాష్ట్రాల వర్తకులు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ కారణంగా కోనసీమ సరకుకు అంతర్రాష్ట్ర మార్కెట్‌లో డిమాండ్ తగ్గినా స్థానికంగా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వారం రోజుల క్రితం వెయ్యి పచ్చి కొబ్బరికాయల ధర రూ.20 వేల నుంచి రూ.21 వేల మధ్య పలికింది. దీంతో బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఎగుమతులు చేశారు. తమిళనాడులో కోనసీమ కొబ్బరి కంటే తక్కువ ధరకే రావడంతో ఆయా రాష్ట్రాల వ్యాపారులు అక్కడి నుంచే కొనుగోలు చేశారు. ప్రస్తుతం వెయ్యి పచ్చి కొబ్బరికాయల ధర రూ.18 వేల నుంచి 19 వేల మధ్య పలుకుతోంది. శివరాత్రికి కొబ్బరి ధరలు నిలకడగా ఉంటాయని.. ఇంకా పెరిగే అవకాశం ఉందని కోనసీమ రైతులు చెబుతున్నారు. తమిళనాడు మార్కెట్‌లో ఏర్పడిన భిన్న పరిస్థితులతో ఈ మార్పులు కోనసీమ మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి.



**ధరలు ఆశాజనకం..**

కోనసీమ జిల్లాలో కొబ్బరి, వరి తరవాత ప్రధానంగా కొబ్బరి తోటల్లోనే అంతరపంటగా అరటి సాగు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల్లో ఈ పంట సాగులో ఉంది. ప్రస్తుతం శివరాత్రి నేపథ్యంలో శివాలయాల్లో నిర్వహించే పూజలకు కొబ్బరికాయలతో పాటు అరటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. శివరాత్రి పర్వదినాన్ని దృష్టిలో ఉంచుకుని చాలా మంది రైతులు తోటల్లో గెలలను అలాగే వదిలేశారు. శివరాత్రి పండగకు రెండు, మూడు రోజుల ముందు మార్కెట్‌కు తరలిస్తే మంచి ధర వస్తుందని భావిస్తున్నారు. అయితే అరటి ఇప్పుడే ఆశాజనకంగా ఉంది. పండగకు ఇంకా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. కర్పూర రకం గెల ప్రస్తుతం రూ.500 నుంచి రూ.600 మధ్య పలుకుతోంది. రెండు వారాల క్రితం రూ.200 నుంచి 250 మధ్య విక్రయమైంది. చక్రకేళి, అమృతపాణి, పచ్చ అరటి రకాల ధరలు కూడా సంతృప్తికరంగానే ఉన్నాయి. దీంతో అంబాజీపేట, రావులపాలెం అరటి మార్కెట్‌ల్లో విక్రయాల సందడి నెలకొంది.

## చెట్టయిన.. ఆక్రమణల విత్తనం

టి.నరసాపురం : టి.నరసాపురం మండలం అల్లంచర్లరాజుపాలెంలో రూ.కోట్ల విలువైన విత్తనాభివృద్ధి క్షేత్ర భూమిని ఆక్రమణదారులు చెరబట్టారు. సుమారు 44 ఎకరాల విస్తీర్ణం గల ఆ భూమిలో నేడు ఎకరం కూడా కానరావడం లేదు.

**ఇరవై ఏళ్ల కిందట**

2006 నవంబర్‌లో రాజీవ్ మెట్ట ప్రాంత విత్తనాభివృద్ధి క్షేత్రం పేరుతో నాటి ప్రభుత్వం దీనిని ఏర్పాటు చేసింది. ఇందుకోసం సుమారు 44 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. అనంతరం వ్యవసాయ శాఖ ఆ భూమిని బాగు చేయించి, అందులో మూడు బోర్లు వేసి అంతర్గత పైపులైను, పంటల సాగు కోసం సుమారు రూ.40 లక్షలు పైగా ఖర్చు చేసింది. తర్వాత కాలంలో అధికారులు ఆ భూమిపై శ్రద్ధ చూపకపోవడంతో నెమ్మదిగా అది ఆక్రమణకు గురైంది. అందులోని ఒక వ్యవసాయ బోరు, పైపులు అపహరణకు గురయ్యాయి.

**సర్వే చేసి అప్పగించినా..**

గతేడాది ఆ భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేయించి, వ్యవసాయశాఖకు అప్పగించారు. ఆ శాఖాధికారులు దాన్ని స్వాధీనం చేసుకునేందుకు సన్నద్ధమైనా.. అందులోని ఆక్రమణదారులు అక్కడి నుంచి బయటకు వెళ్లలేదు. దీంతో చేసేదేమీ లేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



**ప్రయోజనం లేకుండా పోయింది..**

విత్తనాభివృద్ధి క్షేత్రానికి భూమి కేటాయించి ఇరవై ఏళ్లు గడుస్తున్నా.. ప్రయోజనం లేకుండా పోయింది. వ్యవసాయ శాఖ అడపాదడపా పంటలు సాగు చేసినా, వాటితో ఉపయోగం లేదు. ఆ భూములను ఆక్రమణ చెర నుంచి కూడా కాపాడలేదు.నార్ని వెంకట్రావు, సర్పంచి, అల్లంచర్లరాజుపాలెం

**శాశ్వత పరిష్కారానికి చర్యలు**

ఆక్రమణలకు గురైన వ్యవసాయ క్షేత్ర భూమిలో ఆక్రమణ దారులను బయటకు పంపడం ఇబ్బందిగా మారింది. శాశ్వత పరిష్కారానికి ఆ భూమి చుట్టూ రక్షణ గోడ నిర్మించాల్సి ఉంది. దీనికి ప్రభుత్వానికి రూ.40 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే ఆక్రమణలు తొలగించి, గోడ నిర్మించి, విత్తనాభివృద్ధికి చర్యలు చేపడతాం. హబీబ్‌బాషా, జిల్లా వ్యవసాయాధికారి

చురకలు



## కృష్ణమ్మ వచ్చింది.. తృష్ణ తీర్చింది

చిత్తూరు: హంద్రీ– నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టుతో జిల్లాలోని ఒక్కో ప్రాంతం సస్యశ్యామలమవుతోంది. భారీ సాగునీటి ప్రాజెక్టులు లేని ఈ ప్రాంతంలో ఐదేళ్లలో కనీసం మూడేళు కరవు విలయతాండవం చేసే పరిస్థితి. ఉపాధి కోసం బెంగళూరుకు వలస వెళ్తుంటారు. అలాంటిచోట కృష్ణా జలాలు చెరువులను నింపుతూ రైతాంగాన్ని మురిపిస్తున్నాయి. కుప్పం నియోజకవర్గమే ఇందుకు నిదర్శనం. చిట్టచివరగా ఉన్న ఈ ప్రాంతంలో ఇప్పుడు కృష్ణమ్మ పరవళు తొక్కుతోంది. పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లెలోని చెరువులకూ నీరందించేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తు న్నారు.ఏడాదిలోనే నీవా కాలువల పనులు పూర్తిచేసి పీలేరు, చంద్రగిరి, పూతలపట్టు, చిత్తూరుకు జలాలు అందేలా అడుగులు పడుతున్నాయి.

**పుష్కలంగా భూగర్భ జలాలు**

కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గతంలో 1000–



1,500 అడుగుల లోతులో బోరు వేస్తేనే నీళ్లు పడేవి. అందులోనూ రెండింట్లో ఒకటి మాత్రమే నీరు వచ్చేది. రూ.3–5 లక్షల వరకు ఖర్చు చేసేవారు. ఆరు నెలలు– ఏడాదిలోపే ఎండిపోయేవి ఎన్నో. కూటమి ప్రభుత్వం వచ్చాక అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసి కాలువకు లైనింగ్ చేసి చివర్లో ఉన్న పరమసముద్రం చెరువు వరకూ నీరు చేర్చారు. దాంతో ప్రస్తుతం 150– 200 అడుగుల్లోనే భూగర్భ జలాలు ఉన్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**70 కాదు.. 126..**

కుప్పం బ్రాంచి కాలువ కింద కుప్పం, పలమనేరులో 110 చెరువులు నింపాలని అధికారులు భావించారు. ఇందులో 70 వరకు కుప్పంలోనే ఉన్నాయి. ఇక్కడ మిగతా వాటినీ నింపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఈనేపథ్యంలోనే అదనంగా మరో 56 చెరువులకు నీరందిస్తున్నారు. తదనంతరం పలమనేరు నియోజకవర్గంలోని చెరువులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

కుప్పం నియోజకవర్గంలోని చెరువులు 126

సామర్థ్యం 456.69 ఎంసీఎఫ్ టీలు పూర్తిగా నిండిన చెరువులు 87

పాక్షికంగానిండినవి 16 నిండిన సామర్థ్యం 320.18 ఎంసీఎఫ్‌టీలు

## కేజీహెచ్లో వెంటిలేటర్ నుంచి పొగలు

పాయకరావుపేట : కేజీహెచ్ ఆవరణలోని పిల్లల వార్డుకు అనుబంధంగా ఉన్న (నియోనెటాల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్)లోని వెంటిలేటర్ నుంచి పొగలు ఒక్కసారిగా రావడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. వెంటిలేటర్ రన్నింగ్లో ఉండగా షార్ట్సర్క్యూట్ కారణంగా కంప్రెషర్ కాలిపోయి పొగలు వచ్చాయి. వెంటనే వైద్య సిబ్బంది వెంటిలేటర్ను ఆపేశారు. ఆ వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులను మరొక వార్డుకు తరలించారు. శీతలగది కావడంతో అలముకున్న పొగలు పూర్తిగా సర్దుబాటు అయ్యే సరికి గంటకుపైగా పట్టింది. పరిస్థితి సాధారణమయ్యాక మళ్లీ పిల్లలను ఎసీయూలోకి తీసుకెళ్లి



చికిత్స అందించామని ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ ఐ.వాణి తెలిపారు. అనుకోని రీతిలో స్వల్ప ప్రమాదం చోటు చేసుకోవడంతో చికిత్స పొందుతున్న చిన్నారులు, వారి బంధువులు ఆందోళనకు గురయ్యారు. ప్రమాద తీవ్రత చిన్నది కావడంతో, వెంటిలేటర్ సేవలను వెంటనే నిలిపివేయడంతో ముప్పు తప్పింది. ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వెంటిలేటర్ల నిర్వహణపై కాస్త దృష్టి సారించాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

## ఆరు వరుసలుగా జాతీయ రహదారి

పాయకరావుపేట : పాయకరావుపేట, అనకాపల్లి మధ్య ఉన్న 16వ నంబరు జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించేందుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం నాలుగు వరుసల రహదారి ఉండగా.. విస్తరణకు సంబంధించిన పనులు మార్చి నుంచి మొదలుకానున్నాయి. డీపీఆర్ను రూపొందించిని ఎన్హెఐ అధికారులు ఇప్పటికే జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు.

అనకాపల్లి నుంచి ఆనందపురం మీదుగా ఆరు వరుసల రహదారి ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. అనకాపల్లి నుంచి పాయకరావుపేట మీదుగా తుని వరకు 69 కి.మీ. దూరం జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాల్సి ఉంది. ప్రస్తుతం రహదారికి ఇరువైపులా గ్రామాలు పెరిగాయి. ట్రాఫిక్ ఇబ్బందులు రెట్టింపయ్యాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని అడ్డరోడ్డు నుంచి ఒడ్డిమెట్ట వరకు, ఒడ్డిమెట్ట నుంచి గుంటపల్లి, మంగవరం, అరట్లకోట మీదుగా కాకినాడ జిల్లా తుని మండలం ఎర్రకోనేరు వరకు బైపాస్ నిర్మించే అవకాశముంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తుని నుంచి దివాన్చెరువు వరకు 92 కి.మీ. దూరం ఆరు వరుసలుగా రహదారిని విస్తరిస్తారు.ఉమ్మడి తూ.గో. జిల్లాలోని దివాన్చెరువు నుంచి అనకాపల్లి వరకు 161 కి.మీ. దూరం ఆరు వరుసల రహదారితోపాటు రెండు సర్వీసు రోడ్లు నిర్మిస్తారు. ప్రస్తుతం ఉన్న రహదారిలో తుని మండలం తలుపులమ్మలోవ కూడలి నుంచి నామవరం వరకు పైవంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. రహదారికి ఇరువైపులా గ్రామాలున్న చోట బైపాస్లు ఇచ్చేలా డీపీఆర్ రూపొందించారు. త్వరలోనే భూసేకరణ చేపట్టే అవకాశముంది.

# ఇంటి స్థలాలు బేరం!



గుంతకల్లు: పురపాలిక, పట్టణాల పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రశ్నార్థకంగా మారాయి. కొందరు స్థలాలను అమ్ముకుంటున్నారు. మరికొందరు పునాదులతో పాటు బేరానికి పెట్టారు. ప్రధానంగా గుంతకల్లు, గుత్తి పురపాలికలు, ఉరవకొండ మండలంలో ఈ పరిస్థితి నెలకొంది. ఇంటిస్థలాలను కొందరు రూ.60 వేల నుంచి లక్షకు, పునాదులతో ఉన్నవి రూ.1.50 లక్షల నుంచి రూ. 2 లక్షలకు విక్రయిస్తున్నారు.

**అత్యధికం అసంపూర్తి** గుంతకల్లులో 3310 ఇళ్లు మంజూరు కాగా పూర్తయినవి 1348, నిర్మాణానికి నోచుకోనివి 1952 వరకు ఉన్నాయి. గుత్తిలో 3500గాను 1400 వరకు పూర్తయ్యాయి. ఉరవకొండ మండలంలోనూ 4838గాను 518 మాత్రమే నిర్మితమయ్యాయి.

**అనర్హులే పాగా..**

గుంతకల్లు, గుత్తి జగనన్న కాలనీల్లో అనర్హులు పాగా వేశారు. పట్టణాల్లో పక్కా భవనాలు ఉన్నవారు స్థలాలు పొంది ఇళ్లను మంజూరు చేయించుకున్నారు. తర్వాత వాటిని అమ్ముకున్నారు. ఈక్రమంలో రూ.కోట్లు చేతులు మారాయి. ఇంటి స్థలాలను ఇతరుల పేరుమీద మార్చడానికి రెవెన్యూ అధికారులు తిరస్కరిస్తుండటంతో స్థలాలను అమ్మే వారి నుంచి కొనుగోలుదారులు ఒప్పంద పత్రాలు రాయించుకుంటున్నారు.

**నోటీసులు జారీ చేశాం షేక్షావలి, డీఈ, గృహనిర్మాణ సంస్థ**

గత డిసెంబరులోపు పూర్తి చేసుకోవాలని నోటీసులిచ్చాం. స్పందన రాలేదు. వాటిని రద్దు చేసే అవకాశం ఉంది. ఇంకా నివాస గృహాలు కావాలంటూ దరఖాస్తులు వస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయం బట్టి వాటిని పరిశీలించాల్సి ఉంది.

# చింతతో అనంత నిశ్చింత!



తపోవనం : ఓ ఐఏఎస్ అధికారి మదిలో మెదిలిన అద్భుత ఆలోచన కార్యరూపం దాల్చింది. 23 ఏళ్ల క్రితం బీజం పడి... కరవుసీమ అనంతలో సిరులు పండిస్తోంది. అంతకుమించి ప్రభుత్వ భూములకు రక్షణగా నిలుస్తోంది. చింత చెట్టు పెంచితే బోలెడు ప్రయోజనాలున్నాయని గుర్తించిన అప్పటి అనంత జిల్లా కలెక్టర్ సోమేష్‌కుమార్.. పథకాన్ని రూపొందించి అమలు చేశారు.

**సంకల్పం..** ఒక చింత చెట్టు ఏళ్లుగా ప్రజలకు అనేక లాభాలు కురిపిస్తుందన్న దూరదృష్టితో పథకాన్ని రూపొందించారు. ప్రభుత్వ అసైన్డ్, దేవదాయశాఖ, పంచాయతీల ఖాళీ స్థలాల్లో చింత మొక్కలు నాటించి ఆదాయం పెంచాలన్నదే సంకల్పం. కరవు ప్రాంతంలో అనుకూలంగా ఉండే మొక్కల్లో చింత ఒకటి. నీరు సరిగా లేకపోయినా అరకొరగా వచ్చే వర్షంతోనే బతికి.. ఎదిగి లాభాలిస్తున్నాయి. పలు గ్రామాల్లో ఫలసాయం అందిస్తుండటంతో పంచాయతీలకు ఆదాయం సమకూరుతోంది. కొన్నిచోట్ల పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామంలో ఎవరికి వారే ఫలసాయం అందుకుంటున్నారు.


**రక్షణ:** వందలాది ఎకరాల్లోని భూములకు చింతవనం రక్షణ కవచంగా మారింది. చెట్టు కొడితే కేసు నమోదవుతుందన్న భయంతో ఎవరూ ఆ భూముల జోలికి వెళ్లడం లేదు. వందల కోట్ల రూపాయల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడిన ఘనత పథకానికే దక్కుతుంది. చింత వనాలు పంచాయతీలకు ఒక ఆదాయ వనరు. ఖాళీ స్థలాల్లో పెంచడానికి అధికారులు ఆసక్తి చూపితే మరిన్ని లాభాలు ఉంటాయని అనంత జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు అభిప్రాయపడ్డారు.

**600 ఎకరాలు**

ఉమ్మడి జిల్లాలోని పలు పంచాయతీల్లో పథకం కింద దాదాపు వెయ్యి ఎకరాల్లో చింత మొక్కలు నాటారు. కొన్నిచోట్ల వివిధ కారణాలతో మొక్కలు ఎండిపోవడంతో వదిలేశారు. ప్రస్తుతం దాదాపు 600 ఎకరాల్లో చింతవనాలు విస్తరించాయి.

**ఎక్కడ, ఎలాగంటే..** కనగానిపల్లి మండలం దాదులూరులో జాతీయ రహదారి పక్కన 20 ఎకరాల్లో చింతవనం ఆహ్లాదకరంగా ఉంది. ఆత్మకూరు మండలం పాపంపల్లి గ్రామంలో 10 ఎకరాల్లోని వనం లాభాలిస్తోంది. ప్రస్తుతం వేలం వేసి రూ. 24వేలకు పంటను విక్రయించారు. మడకశిర నియోజకవర్గం పరిధిలోని రాళ్ల అనంతపురం, ఆమిదాలగొంది.. గోరంట్ల మండలంలో పాలసముద్రం, వానవోలు గ్రామాల్లో ఎక్కువ శాతం దేవుడి మాన్యాలలోనే మొక్కలు నాటి సంరక్షించారు. హిందూపురం నియోజకవర్గంలోని కొండూరు, కొడికొండ చెక్‌పోస్టు.. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని గోళ్లలో 60 ఎకరాలు, హులికల్లులో 30 ఎకరాలు, శెట్టూరు మండల పరిధిలో దాదాపు 115 ఎకరాలు, బ్రహ్మసముద్రం, ముద్దలాపురం, తీటకల్లు, సూగేపల్లి గ్రామాల్లో 70 ఎకరాల్లో వనాలు విస్తరించాయి. పెద్దపప్పూరు మండలం సోమనపల్లి, యాడికితోపాటు అనంతపురం గ్రామీణ మండలం మన్నీలలో ఫలసాయం పొందుతున్నారు.

# దేవుడి మాన్యం.. దొంగలకు నైవేద్యం



కుప్పం : శాంతిపురం మండలం తుమ్మిశిలోని పురాతన బేటరాయస్వామి ఆలయం ఇది. పదెకరాల మాన్యం ఉన్నా ఎలాంటి ఆదాయం రాకపోవడంతో ఆలయం జీర్ణోద్ధరణ, నిత్య కైంకర్యాలకు అవరోధం ఏర్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. శాంతిపురం మండలం అబకలదొడ్డిలోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి రూ.కోట్ల విలువచేసే మాన్యం భూములున్నా.. ఎలాంటి ఆదాయం సమకూరని దుస్థితి. ఏటా శివరాత్రి ఉత్సవాలు భక్తుల విరాళాలతో నిర్వహించాల్సిన పరిస్థితి.

**వందల ఏళ్ల చరిత్ర..** విశేష ప్రాశస్త్యం కలిగిన ఆలయాలవి. జమిందారులు, పాలేగాళ్ల పాలనలో వాటి నిర్వహణకు వందలాది ఎకరాలు కేటాయించారు. కంగుందిలోని శ్రీవిరూపాక్షేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి శాంతిపురం పరిసరాల్లో రూ.వందల కోట్ల విలువైన భూములు ఉన్నట్లు దస్త్రాలు చెబుతున్నాయి. కొన్నేళ్లుగా వాటిని వాణిజ్య స్థలాలుగా క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. భూములకు వేలం నిర్వహించాలని భక్తులు పట్టుబట్టినా.. రాజకీయ కారణాలతో అడ్డంకులు ఎదురవుతున్నాయి.

**పైసా ఇవ్వని పరిస్థితి..**

రామకుప్పం మండలంలోని రాజుపేటలో రామాలయం, శివాలయానికి సంబంధించి దాదాపు 40 ఎకరాలు భూములున్నా.. ఆదాయం లేదు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 1,500 ఎకరాల మాన్యం భూములున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మామిడి, యూకలిప్టస్? తదితర తోటల నుంచి ఏటా రూ.లక్షల్లో ఆదాయం గడిస్తున్న ఆక్రమణదారులు ఆలయం అభివృద్ధికి నయా పైసా ఇవ్వడం లేదు. దీంతో అనేక ఆలయాలు దుస్థితికి చేరువయ్యాయి. మఠంలోని శ్రీబసవేశ్వరస్వామి, కొత్తపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి, ఎంకేపురంలోని శ్రీచంద్రమౌళేశ్వరస్వామి, జంగాలపల్లెలోని శ్రీవీరభద్రేశ్వర స్వామి, రాజుపేటలోని శివాలయం జీర్ణోద్ధరణకు నిరీక్షిస్తున్నాయి.

**కూటమి చొరవతో రూ.40 కోట్లు**

నియోజకవర్గంలో పలు ప్రధాన ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొంది. నాలుగు మండలాల్లో 52 ఆలయాలకు సుమారు రూ.40 కోట్లు కేటాయించింది. మిగిలిన ఆలయాలను అభివృద్ధి చేస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## సేవా లోపాలు.. అవినీతి వ్యవహారాలు..!

అచ్యుతాపురం : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన కేజీహెచ్లో ఇటీవల అవినీతి వ్యవహారాలు పెచ్చుమీరుతున్నాయి. నాలుగో తరగతి ఉద్యోగులు డబ్బుల కోసం రోగులను పీడిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డిసెంబరు 31వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఓ యువకుడు చికిత్స నిమిత్తం కేజీహెచ్ క్యాజువాల్టీకి వెళ్లాడు. నాలుగో తరగతి ఉద్యోగులు తెలిసీ తెలియని పరిజ్ఞానంతో కట్టువేశారు. అంతటితో ఆగకుండా రూ.వెయ్యి వసూలు చేశారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగి కట్టుకట్టడానికి మామూళ్లు అడుగుతున్నారని రోగులు శనివారం కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. వెంటనే సదరు ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి ఘటనలు నిత్యం ఏదోఒక వార్డులో జరుగుతూనే ఉన్నాయి.

**చేయి తడపనిదే పనికాదు..:** ప్రసూతి విభాగంలో ఆడబిడ్డ పుడితే ఒకరేటు, మగబిడ్డ పుడితే మరో రేటు వసూలు చేస్తున్నారు. చేయి తడపకపోతే పుట్టిన బిడ్డను వార్డుకు సైతం చేర్చడం లేదు. సర్జికల్, అత్యవసర వైద్య విభాగాల్లోనూ డబ్బులు ఇవ్వనిదే సేవలు అందడం లేదని రోగుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఎక్స్రేలు, స్కానింగ్లు, ఈఈజీ, ఈఎంజీ, డయాలసిస్, 2డీ ఎకో పరీక్షలతో పాటు రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నా ఇదే పరిస్థితి.

**రాత్రి వేళ సేవలు కష్టమే:** ఆసుపత్రిలో సీనియర్ వైద్యులు 24గంటలూ అందుబాటులో ఉండాలి. ముఖ్యంగా క్యాజువాల్టీలో అత్యవసర వైద్యం అందించే సీనియర్ వైద్యులు రాత్రుళ్లు ఉండడం లేదని రోగులు వాపోతున్నారు. జూనియర్ వైద్యులే ఆ సేవలు అందిస్తున్నారు. వీరు



సైతం రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత విశ్రాంత గదులకే పరిమితం అవుతున్నారని రోగుల సహాయకులు చెబుతున్నారు.

**ఆధిపత్య పోరు:** కూటమి ప్రభుత్వం రూ.కోట్లు విలువ చేసే వైద్య పరికరాలను కేజీహెచ్కు సమకూర్చింది. మౌలిక వసతులూ మెరుగవుతున్నాయి. ఈ తరుణంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించకుండా వైద్య, పరిపాలన అధికారులు ఆధిపత్య పోరులో ఉంటున్నారనే విమర్శలొస్తున్నాయి.జిల్లా కలెక్టర్ స్పందించి పెద్దాస్పత్రికి కాయకల్ప చికిత్స చేసి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని రోగులు, సహాయకులు కోరుతున్నారు. ఇటీవల తలకు గాయంతో ఓ వ్యక్తి క్యాజువాల్టీకి రాగా, వైద్యులు లేకపోవడంతో సిబ్బంది వైద్యం అందించాల్సి వచ్చింది.

## అద్దాల పరిశ్రమకు అడ్డంకులు తొలగేనా?

అచ్యుతాపురం : వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అచ్యుతాపురం సెజ్లోని పరిశ్రమలకు గ్రహణం పట్టింది. వేలాది మంది ఉపాధికి, రాష్ట్రాభివృద్ధికి దోహదపడే అంతర్జాతీయ పరిశ్రమ ఏర్పాటుకు భూకేటాయింపు పూర్తయ్యాక జగన్ సర్కారు అటకెక్కించింది. నాటి నుంచి ఆ భూములు నిరుపయోగంగా ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వ దృష్టిసారిస్తే అద్దాల పరిశ్రమ ఏర్పాటుకు అడ్డంకులు తొలగుతాయి.అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో పరిశ్రమ ఏర్పాటుకు సెయింట్ గోబైన్ కంపెనీ 2019లో ముందుకొచ్చింది. అంతర్జాతీయంగా పేరొందిన పరిశ్రమ కావడంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అందరూ ఆశ పడ్డారు. 3,500 వేల మందికి ప్రత్యక్షంగా, ఇదే స్థాయిలో పరోక్షంగా ఉపాధి లభిస్తుందని సంతోషించారు. నాటి ఎన్నికల్లో గెలుపొంది అధికార పగ్గాలు చేపట్టిన జగన్ సర్కారు తీరు ప్రతిబంధకంగా మారింది. 180 ఎకరాల్లో ఏర్పాటు కావాల్సిన పరిశ్రమ 50 ఎకరాలకే పరిమితమైంది. 130 ఎకరాల్లో అద్దాల యూనిట్ ఏర్పాటు చేస్తామని, ఇసుకను రాయితీపై సరఫరా చేయాలని కంపెనీ ప్రతినిధులు కోరినా ఐదేళ్లూ పట్టించు




కోలేదు. సెజ్లో సెయింట్ గోబైన్కు కేటాయించిన 180 ఎకరాల చుట్టూ పరిశ్రమ రక్షణ గోడ నిర్మించింది. మొదటి దశలో జిప్సమ్ షీట్ల తయారీ యూనిట్ను ప్రారంభించింది. ఈ యూనిట్ ప్రారంభానికి ముందే వైకాపా ప్రభుత్వం ఏర్పాటు కావడం, రాయితీల మాటెత్తకపోవడంతో రెండో యూనిట్ మరుగున పడింది. ప్రస్తుతం ఒక యూనిట్ ద్వారా జిప్సమ్ షీట్లు తయారు చేస్తుండగా వెయ్యి మంది వరకు ఉపాధి పొందుతున్నారు. అద్దాల పరిశ్రమ ఏర్పాటైతే మూడు వేల మందికి ఉపాధి లభిస్తుంది. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు దృష్టిసారిస్తే నిరుద్యోగ యువతకు మేలు చేసినవారవుతారు.

## లూయిస్ పోర్టుకు చేరుకున్న 'సంకల్ప్'



సింధియా : సముద్ర ప్రాంత భద్రత, పురోగతి (సాగర్) లక్ష్యంగా భారతీయ తీరగస్తీ దళానికి చెందిన నౌక 'ఐఎస్ సంకల్ప్' మారిషస్లోని పోర్టు లూయిస్కు చేరుకుందని ఐసీజీ వర్గాలు తెలిపాయి. మారిటైం ఆపరేషనల్ విధుల్లో ఇద్దరు మహిళా అధికారులు నౌకలో భాగస్వామ్యం అయ్యారని పేర్కొన్నాయి. సముద్ర ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ చేపట్టడం, హార్బర్డ్రిల్, చమురు కాలుష్య నివారణ, ఫైర్ ఫైటింగ్ వంటి విన్యాసాలను ప్రదర్శించడం నౌక పర్యటనలో ప్రధాన అంశాలు కాబోతున్నాయన్నారు.

చురకలు



# ఒన'గూడు'తోంది

కర్నూలు : పట్టణ పేదల సొంతింటి కల సాకారానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని లబ్ధిదారులకు తూతూమంత్రంగా సాయం అందించారు. ఫలితంగా చాలామంది గృహ నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం వీరిని ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

**సర్వే పూర్తి చేసి..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేవారికి బీఎల్?సీ కింద ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షల సాయం ప్రకటించింది. గృహాలు నిర్మించుకునేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. సొంత స్థలాల్లో నిర్మించుకునేవారికి 2024-25 సంవత్సరానికిగాను ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్?-2.0 కింద గతేడాది జూన్‌లో సర్వే చేపట్టారు. సెప్టెంబరులో పీఎంఏవై అర్బన్ 2.0 కింద ఇళ్లు మంజూరు చేశారు.

**లబ్ధిదారులకు ఇబ్బందులు**

నంద్యాల జిల్లాకు 2,231 గృహాలు కేటాయించారు. నంద్యాల పట్టణంతోపాటు ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు, నందికొట్కూరు, బేతంచెర్ల మున్సిపాలిటీల పరిధిలో 2,209 ఇళ్లు మంజూరు చేయగా.. 609 మంది నిర్మాణాలు ప్రారంభించారు. 50 బిల్లులు మాత్రమే అప్‌లోడ్ చేయగా ఒక్కరికి కూడా మంజూరు కాలేదు. బేస్‌మెంటు బిల్లులు అప్‌లోడ్ చేసేదాకా నిర్మాణాలు చేపట్టొద్దని సిబ్బంది చెబుతుండటంతో



లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎప్పటికప్పుడు బిల్లులు ఇచ్చేలా చొరవ తీసుకుంటే నిర్మాణాలు ముందుకు సాగుతాయని పలువురు పేర్కొంటున్నారు.

**రూ.2.50 లక్షల మంజూరు**

పీఎంఏవై అర్బన్ 2.0 ద్వారా ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షల చొప్పున ఇస్తారు. ఇందులో కేంద్రం వాటా రూ.1.50 లక్షలు, రాష్ట్రం వాటా రూ.లక్ష. గత ప్రభుత్వం రూ.1.80 లక్షలు మాత్రమే ఇచ్చేది. దీనికితోడు బిల్లులు సరిగా చెల్లించక చాలామంది అప్పుల పాలయ్యారు.

**ఆసక్తి చూపుతున్నా..**

కర్నూలు జిల్లాలో 2,725 గృహాలు కేటాయించగా.. అందులో 2,688 మంజూరు చేశారు. ఇప్పటివరకు 655 మంది నిర్మాణాలు ప్రారంభించారు. లబ్ధిదారులకు సంబంధించి బేస్‌మెంట్ బిల్లులను అప్‌లోడ్ చేయడంలో గృహ నిర్మాణశాఖ అధికారులు వెనుకబడ్డారు. ఇంటి నిర్మాణాన్ని జియో ట్యాగింగ్ చేయడంతోపాటు హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ ఏఈ కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. జిల్లాలో 160 ఇళ్లకు సంబంధించిన బిల్లులు మాత్రమే అప్‌లోడ్ చేశారు.

# భక్తులకు అక్కరకొచ్చేనా?




తిరుపతి : 'నిత్య కల్యాణం.. పచ్చతోరణం'లా విరాజిల్లే తిరుమలేశుని వైభవాన్ని నలుదిశలా చాటాలన్నది తితిదే సంకల్పం. సామాన్యుడు సైతం శ్రీవారినీడలో వివాహం చేసుకోవాలన్న లక్ష్యంతో తితిదే నిధులతో పెద్దఎత్తున నిర్మించిన కల్యాణ మండపాలు సమస్యలకు కేంద్రంగా మారాయి. వాటి గుత్తేదారులు ఆడుతున్న ఆటకు భక్తులు బలవుతుంటే.. మరోవైపు తితిదే ఖజానాకు పెద్దఎత్తున చిల్లు పడుతోంది. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన నిర్మానాలు చాలాచోట్ల నిరుపయోగంగా మారగా మరికొన్నిచోట్ల సిండికేట్‌గా మారి సామాన్యుడిని భయపెడుతున్నారు.క్షేత్రస్థాయిలో లోపాలు : తితిదే ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా మొత్తం 320 కల్యాణ మండపాలు ఉన్నాయి. వాటిలో ఆంధ్రప్రదేశ్?లో 231, తెలంగాణలో 78, ఇతర ప్రాంతాల్లో 11 ఉన్నాయి. 174 మండపాలు లీజుకు ఇవ్వగా ఏడాదికి రూ.7.80 కోట్ల రాబడి వస్తోంది. దేవాదాయ శాఖ పరిధిలోని 29 వాటి నుంచి నామమాత్రంగా రూ.5-30 వేల అద్దె మాత్రమే వస్తోంది. 16 ఏసీ కల్యాణ మండపాల ద్వారా రూ.5.70 కోట్లు సమకూరుతున్నాయి. మొత్తం నిర్వహణ, పారిశుద్ధ్యం, సిబ్బంది జీతభత్యాల కోసమే ఏటా రూ.5.57 కోట్లను తితిదే ఖర్చు చేస్తోంది.

**గుదిబండగా నిర్వహణ**

దాదాపు 25 శాతం మండపాల్లో ఏడాదికి 5 నుంచి 10 శాతం పెళ్లిళ్లు కూడా జరగడం లేదు. వీటి నిర్వహణ భారం దేవస్థానంపై పడుతోంది. 40 శాతం మండపాలకు అసలు లీజుదారులే దొరకని పరిస్థితి. ఫలితంగా రూ.వందల కోట్లు వెచ్చించి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారి నిర్వీర్యమవుతున్నాయి. గతంలో కొందరు వ్యక్తుల ప్రమేయం, రాజకీయ ఒత్తిళ్లతో డిమాండ్ లేని ప్రాంతాల్లోనూ మండపాలు నిర్మించారన్నది ఆడిట్ నివేదికలో వెల్లడైన చేదునిజం. మరోవైపు లీజుకు తీసుకున్న గుత్తేదారులు తితిదే నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. నిర్ణయించిన అద్దె కంటే అధిక మొత్తంలో వసూలు చేయడమే కాకుండా పెళ్లివారికి 'కండిషన్ల' పేరుతో చుక్కలు చూపిస్తున్నారు.

**తిరుపతిలో తిరకాసు...**

ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో ప్రైవేటు ఫంక్షన్ హాళ్లు కాసుల వర్షం కురిపిస్తుంటే.. సకల సౌకర్యాలున్న తితిదే మండపాలు మాత్రం వెలవెలబోతున్నాయి. తిరుపతిలో చిన్నపాటి ప్రైవేటు మండపానికి రూ.3-5 లక్షలు, మోస్తరు వాటికి రూ.10 లక్షలు, లగ్జరీ వాటికి రూ.30 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. అదే సమయంలో శ్రీనివాస, పద్మావతి వంటి తితిదే మండపాలు పూర్తిగా ఏసీగా మార్చడంతో పేద, మధ్య తరగతి వర్గాలు ఇక్కడికి రాలేకపోతున్నాయి. ఏసీ, నాన్-ఏసీ ఆప్షన్లు ఇచ్చి ఉంటే.. ఒక్క తిరుపతి నుంచే ఏటా రూ.10 కోట్ల ఆదాయం వచ్చేదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ శ్రీనివాస, పద్మావతి, శ్రీనివాసమంగాపురం, తిరుచానూరులోని తోలప్ప గార్డెన్ సహా 7 మండపాలు తితిదే ప్రత్యక్ష నిర్వహణలో ఉన్నాయి. వీటిద్వారా కేవలం రూ.3.50 కోట్ల నుంచి రూ.4 కోట్ల ఆదాయమే వస్తోంది.

**ప్రక్షాళన దిశగా.. :** కల్యాణ మండపాల సమస్యలపై తితిదే ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఇటీవల సమీక్షించారు. ప్రత్యేక టోల్‌ఫ్రీ అందుబాటులోకి తేవడంతోపాటు సమస్యల పరిష్కారంపై నివేదికలు కోరిన నేపథ్యంలో లీజుల విధానాన్ని ప్రక్షాళన చేసి, సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# 'కుయ్యో'స్కులు

ఆళ్లగడ్డ: రైతులకు మెరుగైన వసతులు కల్పించే ఉద్దేశంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో వివరాలు నమోదు చేసి రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు తదితరాలు అందించాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో అలంకారప్రాయంగా మారాయి.

రూ.8.77 కోట్ల ఖర్చు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కియోస్క్ యంత్రాల ఏర్పాటుకుగాను సుమారు రూ.8.77 కోట్లు ఖర్చు చేశారు. ఆర్‌ఎస్‌కేలలో ఒక్కో యంత్రం ఏర్పాటు చేసేందుకు రూ.లక్ష వరకు వెచ్చించారు. రైతులకు ఎలాంటి రకాల విత్తనాలు, ఎరువులు కావాలో తెలుసుకుని కియోస్క్? యంత్రాల ద్వారా ఇండెంట్ పెట్టి సరఫరా చేయాల్సి ఉంది.

చాలా ప్రాంతాల్లో యంత్రాలు మూలకు చేరాయి. మరికొన్ని ప్రాంతాల్లో పనిచేయడం లేదు.

ఉమ్మడి జిల్లాలో సాగు భూమి : 10 లక్షల హెక్టార్లు



రైతు కుటుంబాలు : 7 లక్షలకుపైగా..

ఆర్‌ఎస్‌కేలు : 877

సొంత భవనాలున్నవి : 483

కియోస్క్‌యంత్రాలు : 877

పనిచేయనివి : 170

రైతులకు ఉపయోగపడక..

ఆళ్లగడ్డ పురపాలిక పరిధిలోని ఆర్‌ఎస్‌కేల్లో విలువైన కియోస్క్ యంత్రాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. ఆళ్లగడ్డ పురపాలక సంఘంగా పేరున్నప్పటికీ దీని పరిధిలో పడకండ్ల, పి.చింతకుంట, దేవరాయపురం, పాలసాగరం.పి.నాగిరెడ్డిపల్లె తదితర గ్రామాలు విలీనమయ్యాయి. వీటిల్లో 80 శాతం మంది రైతులు ఉన్నారు. పురపాలిక పరిధిలో ఉండడంతో కొన్ని ప్రాంతాల్లో ఆర్‌ఎస్‌కలకు సొంత భవనాలు లేవు. సిబ్బంది కొరత వేధిస్తోంది. ఆర్‌ఎస్‌కేల ద్వారా గతేడాది జూన్‌లో కేవలం జీలుగ విత్తనాలు మాత్రమే పంపిణీ చేశారు.

# తూకంలో నొక్కుడు.. ఎంచక్కా బొక్కుడు!

నెల్లూరు : గత ఏడాది నవంబరు ఏడో తేదీన వెంకటగిరి నుంచి నెల్లూరుకు రేషన్ బియ్యం తరలిస్తుండగా పొదలకూరు మండలం మరుపూరు వద్ద వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. అందులో 111 బస్తాల్లో ఉన్న సుమారు 4,170 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరులో సేకరించిన రేషన్ బియ్యం కొందరు నెల్లూరుకు తరలిస్తుండగా బుచ్చిరెడ్డిపాలెం పోలీసులు పట్టుకుని.. 200 బస్తాలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో గోదాములు, రేషన్ దుకాణాల నుంచి బియ్యం పక్కదారి పడుతోంది. డీలర్లు తూకాల్లో మోసాలు చేస్తూ.. పెద్ద మొత్తంలో నొక్కేస్తున్నారు. వాటిని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దాంతో పాటు.. ఇంటింటా సేకరించిన బియ్యాన్ని ఎక్కడికక్కడ నిల్వ చేసి రాత్రివేళ గుట్టుగా సరిహద్దులు దాటిస్తున్నారు. అక్రమ రవాణాను అప్పుడప్పుడు పోలీసులు అడ్డుకోవడం మినహా.. పూర్తిస్థాయిలో అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారు.

**గోదాముల నుంచే..**

రేషన్ బియ్యాన్ని గోదాముల నుంచి మండల నిల్వ కేంద్రాలకు.. అక్కడి నుంచి రేషన్ డీలర్లకు సరఫరా చేస్తారు. ఎంఎల్‌ఎస్ పాయింట్లలో సంచి బరువుతో కలిపి 50 కిలోలుగా తూకం వేస్తున్నారు. ఒక్కో సంచికి కిలో బియ్యాన్ని ఇక్కడే నొక్కేస్తున్నారు. రేషన్ దుకాణాలకు



వెళ్లాల్సిన సరకు.. నిర్దేశించిన మేర సరఫరా చేయడం లేదనే విమర్శలున్నాయి. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి పెద్దఎత్తున పేదల బియ్యం పక్కదారి పట్టిన విషయం తెలిసిందే.

**దోచుకున్నా.. దర్జాగానే...**

అక్రమంగా తరలించే బియ్యంలో.. అధికారులు పట్టుకునేది పదిశాతం కూడా ఉండదు. విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసినా బాధ్యులపై 6ఏ కేసులతో సరి పెడుతున్నారు. దీంతో అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.

**చర్యలు తీసుకుంటాం**

డీఎస్‌వో లీలారాణి మాట్లాడుతూ.. రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**జిల్లా వివరాలు**

రేషన్ దుకాణాలు: 1,513

కార్డులు: 7,21,524

లబ్ధిదారులు: 20,04,581 మంది

ప్రతినెలా సరఫరా చేస్తున్న బియ్యం: 10,953 మెట్రిక్ టన్నులు

# పల్లె ప్రాణాలతో 'జల'గాటం



కర్నూలు : గ్రామీణ ప్రజలకు తాగునీరు అందించే సమగ్ర రక్షిత మంచినీటి పథకాల (సీపీడబ్ల్యూఎస్) నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకొనేందుకు జడ్పీ ప్రయత్నిస్తోంది. సొంత ఆదాయ వనరులు సమకూర్చుకోలేని జడ్పీ పాలకవర్గం.. తాగునీటి పథకాల నిర్వహణ నిధులన్నీ ప్రభుత్వమే భరించాలని మొండికేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 17 లక్షల మందికిపైగా గ్రామీణ ప్రజలకు తాగునీరు అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఏటా రూ.48 కోట్ల వరకు అవసరం ఉంది. ఏటా ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.25 కోట్లు మాత్రమే వస్తోంది. 2025-26లో 15వ ఆర్థిక సంఘం ద్వారా తొలి విడతలో రూ.8.72 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. రెండో విడతలోనూ అంతే రానుంది. ఏటా రూ.7.56 కోట్ల నిధులకు కోత పడటంతో నిర్వహణ చేయలేమని జడ్పీ నిస్సహాయత వ్యక్తం చేస్తోంది.

**ప్రభుత్వం ఆదుకునేలా..**

జడ్పీ పరిస్థితులు, ఆర్థిక సంఘం నిధుల్లో కోత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం సీపీడబ్ల్యూఎస్ పథకాల విషయంలో ఆదుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిధుల్లో ఎంత శాతం కోత పడుతోంది, ఎంత అవసరమన్న వివరాలను పంచాయతీరాజ్ కమిషనరేట్ కార్యాలయానికి పంపాలని ఆదేశాలు అందాయి. ఈ మేరకు జడ్పీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రూ.25 కోట్లకు బదులు రూ.17.44 కోట్లు మాత్రమే రానుండటంతో ఏటా రూ.7.56 కోట్ల వరకు కోత పడుతుందని, ఏటా పథకాలకు భారీగా నిధులు అవసరమవుతాయని నివేదిక తయారు చేస్తున్నారు. ప్రస్తుతం రూ.25 లక్షల మేర నిర్వహణ వ్యయం దాటిన పథకాలకు ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో 59 పథకాలకుగాను ఒక్కటి మాత్రమే రూ.25 లక్షల లోపు నిర్వహణ వ్యయం ఉంది.

**అధ్వానంగా ఫిల్టర్‌బెడ్లు**

ఉమ్మడి జిల్లాలో 59 సీపీడబ్ల్యూఎస్ పథకాలకు సంబంధించి ఫిల్టర్‌బెడ్ల స్థానంలో కొత్తవి ఏర్పాటుకు రూ.5.89 కోట్లు అవసరమని రెండు నెలల కిందటే ప్రభుత్వానికి జడ్పీ నివేదించింది. 25-30 ఏళ్ల కిందటివి కావడంతో అధ్వాన స్థితికి చేరుకున్నాయని.. ఫిల్టర్లు పనిచేయడం లేదని విన్నవించింది.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీపీడబ్ల్యూఎస్ పరిధిలోని 25 ఎస్‌ఎస్ ట్యాంకుల మరమ్మతులు తదితరాలకు సంబంధించి సుమారు రూ.16.88 కోట్ల నిధులు అవసరమని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు.

సీపీడబ్ల్యూఎస్ పథకాలు : 59

వీటి పరిధిలోని గ్రామాలు : 695

లబ్ధి పొందేవారి సంఖ్య : 17.75 లక్షలు


ఏటా ఎంత అవసరం : రూ.48 కోట్లు

# పలుకుబడే పెట్టుబడి!

కావలి : కావలిలో రెండు దశాబ్దాల క్రితం ఇందిరమ్మ కాలనీ ఏర్పాటైంది. ఓ వరుసగా రజకులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. పక్కనే ధోబీఘాట్ నిర్మించడం ద్వారా వారి కులవృత్తికి అనుకూలంగా ఉంటుందని భావించి వంద అంకణాల జాగా కేటాయించారు. స్థల కేటాయింపు చేశారేగానీ... ధోబీఘాట్ నిర్మాణం జరగలేదు.

**ఆక్రమణదారుల్లో పోటీ**

ప్రస్తుత కూటమి పాలనలో కాలనీలో సీసీ రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. కరెంటోళ్ల జనబాట కార్యక్రమంతో డిస్కం జిల్లా అధికారులు స్థానికంగా పర్యటించి విద్యుత్తు సదుపాయం మెరుగుపరిచే చర్యలు తీసుకుంటున్నారు. కాలనీకి కొద్ది దూరంలోనే బైపాస్? నిర్మాణానికి రూ.183 కోట్లతో డీపీఆర్ కూడా సిద్ధమైంది. దాంతో రిజర్వ్‌స్థలాలు, ఖాళీప్లాట్లను ఆక్రమించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ధోబీఘాట్? సమీపంలో ఒక్కో అంకణం ధర రూ.60వేల వరకు ఉందని స్థానికులు చెబుతున్నారు. తమ అవసరాలకు కేటాయించిన స్థలానికి ఆక్రమణదారుల్లో పోటీ పెరగడంతో రజక సామాజికవర్గ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పదుగురిలో పలుకుబడి ఉ



ంట్టచాలు కావలిలో ఆక్రమణలకు తెరలేపొచ్చు. ప్రస్తుతం పట్టణంలో ఇదే జరుగుతోంది. తాజాగా ఇందిరమ్మ కాలనీలో ధోబీఘాట్?కు కేటాయించిన స్థలంపై కబ్జాదారులు కన్నేశారు. వంద అంకణాలున్న స్థలంలోని ముళ్లపొదలు, పిచ్చి మొక్కల్ని, హద్దులు తెలిపే పునాదులు తొలగిస్తుండటంతో రజకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

ఈ విషయమై ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ సాయిరాం స్పందిస్తూ ఆక్రమణలు జరగకుండా చూస్తామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లి ప్రభుత్వ స్థలాలు కాపాడతామని తెలిపారు.

# చౌకగా కొట్టేసి.. గుట్టుగా దాటించేసి

నంద్యాల : జిల్లాలో రేషన్ బియ్యం 'దందా' భారీగా సాగుతోంది. పేదలకు రాయితీపై ఇస్తున్న బియ్యాన్ని అక్రమార్కులు దారి మళ్లిస్తున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేసి నల్ల బజారులో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో 5,34,293 రేషన్ కార్డులున్నాయి. లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. నంద్యాల డివిజన్ పరిధిలో 659, డోన్ 304, ఆత్మకూరు డివిజన్ పరిధిలో 341 కలిపి మొత్తం 1,304 చౌక దుకాణాల ద్వారా అందజేస్తున్నారు. వాస్తవంగా బియ్యాన్ని కార్డుదారులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం లేదు. దీంతో అక్రమార్కులు ఈ బియ్యంపై కన్నేశారు. లబ్ధిదారుల వద్ద కిలో రూ.6 నుంచి రూ.10 వరకు కొనుగోలు చేసి పలుచోట్ల నిల్వ చేస్తున్నారు. అనంతరం ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. నేతల అండతో పలువురు చెలరేగిపోతున్నారు. వాహనాలు, మనుషులను ఏర్పాటు చేసుకుని దందా కొనసాగిస్తున్నారు.

**నిల్వ చేసుకుని..**

నంద్యాల పట్టణ శివారులో అద్దెకు తీసుకున్న భవనాలు, చిన్నపాటి గోదాముల్లో బియ్యం నిల్వ చేస్తున్నారు. డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లి, నందికొట్కూరు, ఆత్మకూరు ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున నిల్వలు ఉన్నాయి. వీటిలో డంప్ చేసిన తర్వాత బనగానపల్లి, నంద్యాల ప్రాంతాల్లోని మిల్లుల్లో పాలిషింగ్ చేసి మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్కడ సన్న రకం బియ్యంలో కలిపి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మరికొంత బియ్యాన్ని తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని లిక్కర్, రసాయన పరిశ్రమల అవసరాల నిమిత్తం తరలిస్తున్నారు. మొత్తం మీద కొనుగోలు చేసిన ధర కంటే ఎక్కువకు అమ్ముకుంటున్నారు. బియ్యం కార్డులు: 5,05,601

అంత్యోదయ కార్డులు: 28,692



ప్రతి నెలా బియ్యం కేటాయింపు: 8,648 మె.టన్నులు

**స్టాక్ పాయింట్లలో కోత**

జిల్లాలోని వివిధ ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా చేసే చౌక బియ్యంలో కోత ఉంటోంది. నిర్వహణ పేరుతో డీలర్లకు సరఫరా చేసే బియ్యంలో 'తగ్గింపు'లు ఉంటున్నాయి. ఈ తరుగు సైతం రేషన్ మాఫియా చేతుల్లోకి వెళ్తోందన్న ఆరోపణలున్నాయి. నెల కోటాలో భాగంగా రేషన్ దుకాణాలకు సరఫరా చేయాల్సిన బియ్యం స్టాక్ పాయింట్లలో నిల్వ ఉండడాన్ని గమనించి విజిలెన్సు అధికారులు పలుమార్లు కేసులు సైతం నమోదు చేశారు.

**కిట్లతో 'చెక్' పెట్టి..**

జిల్లాలో బియ్యం అక్రమాలను అరికట్టేందుకు ఎఫ్‌ఆర్‌కే ఐరన్ స్పాట్ కిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ కిట్లతో పరీక్షిస్తే అవి రేషన్ బియ్యమా కాదా అని తేలుతుంది. వివిధ ప్రాంతాల నుంచి లారీలు, ట్రాక్టర్లలో తరలుతున్న బియ్యాన్ని పట్టుకుని ఈ కిట్లతో పరీక్షించనున్నారు. రేషన్ బియ్యం అని తేలితే సంబంధిత వ్యక్తులపై 6ఏ కేసు నమోదు చేస్తారు.

# ఎవరడుగుతారు.. ఎందుకడుగుతారు!

భీమవరం :ఇరగవరం మండలం అర్జునుడుపాలెం, పాలకోడేరు మండలం కొండేపూడి, పాలకొల్లులోని కొత్తపేట సచివాలయ ఉద్యోగులు ప్రజలతో మర్యాదగా మెలగడం లేదు. పెంటపాడు మండలం ముదునూరు, పెనుగొండ మండలం దొంగరావిపాలెం, సిద్ధాంతం-1, 2 సచివాలయాల్లోని పలువురు ఉద్యోగులు అనధికార వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. భీమవరంలోని వైఎస్సార్ కాలనీ, యలమంచిలి మండలం దొడ్డిపట్ల సచివాలయాల ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదని అక్కడి ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ స్థాయిలోనే పౌరులకు అన్ని రకాల సేవలందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ పనితీరు నానాటికీ తీసికట్టుగా మారుతోంది. సేవలు అటుంచితే అసలు ఉద్యోగులు విధులకు హాజరుకావడమే గగనంగా మారింది. ఎక్కడా సమయపాలన పాటించడం లేదు. వారి వ్యవహార శైలితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సచివాలయాల ఉద్యోగుల పనితీరుపై ప్రభుత్వం ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టింది. కార్యాలయ పనివేళల్లో ఉద్యోగులు అందుబాటులో ఉంటున్నారా? మర్యాదగా నడుచుకుంటున్నారా? పని చేయడానికి నగదు డిమాండ్ చేస్తున్నారా తదితరాలను వార్డు, గ్రామ సచివాలయ శాఖ ఐవీఆర్‌ఎస్ ద్వారా అభిప్రాయాలు సేకరించింది. 75.2 శాతం సంతృప్తితో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది.నిబంధనలు పాటించక.. పశ్చిమ గోదావరి జిల్లాలో 535 వార్డు, గ్రామ సచివాలయాలున్నాయి. ఉద్యోగులు ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వర్తించాలి. చాలా చోట్ల సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ఎప్పుడొస్తారని ఎవరైనా ఫోన్ చేస్తే.. సర్వే పనిలో ఉన్నామని సమాధానమిస్తున్నారు. ఒకవేళ బయటకెళ్తే మూమెంట్ రిజిస్టర్‌లో సంతకం పెట్టాల్సి ఉండగా..ఎక్కడా పాటించడం లేదు.

చురకలు



## కత్తుల్లాంటి కళ్ళతో కైపెక్కిస్తున్న దంగల్ బ్యూటీ!

దంగల్.. బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ కీలక పాత్రలో 2016లో కుస్తీ క్రీడాకారుడు మహావీర్ సింగ్ ఫోగట్, అతని కుమార్తెల జీవిత ఆధారంగా తెరకెక్కిన చిత్రం ఇది. ఈ చిత్రానికి నితిన్ తివారీ దర్శకత్వం వహించగా.. సిద్ధార్థ్ రాయ్ కపూర్ , అమీర్ ఖాన్ నిర్మాతలుగా వ్యవహరించారు. ఇందులో గీత ఫోగట్ పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయి తన నటనతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకుంది ఫాతిమా సనా షేక్. ఒక్క సినిమా ఆమె అదృష్టాన్ని పూర్తిగా మార్చేసింది అని చెప్పాలి. 2016లో వచ్చిన ఈ సినిమా సుమారుగా 2000 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక కలెక్షన్స్ వసూలు చేసిన తొలి చిత్రంగా రికార్డు సృష్టించింది. ఈ సినిమా వచ్చి దాదాపు 10 ఏళ్ళు అవుతున్నా.. ఇప్పటివరకు ఈ సినిమా రికార్డును ఏ సినిమా కూడా బ్రేక్ చేయలేకపోవడం గమనార్హం. నిజానికి సుకుమార్ , అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప 2 దాదాపు అంచుల వరకు వెళ్లి.. 1800 కోట్లతో సరిపెట్టుకుంది. దీంతో ఆ చిత్రం కూడా ఈ సినిమా రికార్డును చెరపలేకపోయింది. అలా ఒక్క సినిమాతో పాన్ ఇండియా స్థాయి గుర్తింపును సొంతం చేసుకున్న ఫాతిమా సనా సేక్ ఒకవైపు సినిమాలలో నటిస్తూనే మరొకవైపు సోషల్




మీడియాలో పలు అంశాలపై చర్చిస్తూ విమర్శలు కూడా ఎదుర్కొంది. ఇక అలాంటి ఈమె ఇప్పుడు కొన్ని చిత్రాలలో బిజీగా ఉంటూనే మరొకవైపు అభిమానులను ఆకట్టుకోవడానికి సిద్ధం అయ్యింది. అందులో భాగంగానే ఒకసారి చీర కట్టుకొని సాంప్రదాయంగా కనిపించే ఫాతిమా.. మరొకవైపు గ్లామర్ వలకబోస్తూ చిట్టిపొట్టి బట్టల్లో అభిమానులను తన అందాలతో పిచ్చెక్కిస్తూ ఉంటుంది. అలాంటి ఈమె ఇప్పుడు తాజాగా బాక్సింగ్ చేస్తున్నట్టు ఫోటోలకు ఫోజులిచ్చి.. తన అందాలతో మరోసారి మెస్మరైజ్ చేసింది. మినీ డ్రెస్ తో అందాలు ఆరబోస్తూ కుర్రకారు గుండెల్లో గుబులు పుట్టించింది ఈ ముద్దుగుమ్మ. పైగా ఈ ఫోటోలను షేర్ చేస్తూనే.. పైగా ఆ ఫోటోలకు క్యాప్షన్ గా.. ప్రముఖ బాక్సర్ మహమ్మద్ అలీ చెప్పిన ఒక కొటేషన్ ని పం చుకుంది. “సీతాకోక చిలుకలా ఎగరాలి.. తేనెటీగలా కుట్టాలి” అంటూ ఒక క్యాప్షన్ పంచుకుంది. ప్రస్తుతం ఫాతిమా సనా షేక్ షేర్ చేసిన ఈ ఫోటోలు.. ఇచ్చిన కొటేషన్ అందరినీ ఆకట్టుకుంటుంది. ఇకపోతే ఒక్క బాక్సింగ్ లోనే కాదు నిజ జీవితంలో కూడా ఇలా ఉంటేనే మనం మన జీవితంలో సక్సెస్ అవ్వగలము అని నిరూపిస్తూ షేర్ చేసిన ఈ కొటేషన్ అటు అభిమానులను కూడా ఆలోచింపచేస్తోందనే చెప్పాలి. అలాగే తమన్నా బాయ్ ఫ్రెండ్ విజయ్ వర్మతో కలిసి గుస్తాఖ్ ఇష్క్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈమె.. ఆర్ మాధవన్ తో కలిసి వివేక్ సోనీ దర్శకత్వంలో ఆప్ జైసా కోయి నహి చిత్రంలో కూడా నటించింది.. ధర్మా ప్రొడక్షన్లో మరో సినిమా చేస్తున్న ట్లు సమాచారం. ఏది ఏమైనా వరుస సినిమాలతో బిజీగా ఉంటూనే మరొకవైపు ఇలా అభిమానులను తన అందాలతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది.

## మొదటి నుంచే మృణాల్ కు ఆ సమస్య ఉందట!

లైట్స్, కెమెరాలు, చప్పట్లు, ఎంతో మంది అభిమానులు.. సినీ సెలబ్రిటీ అంటే ఎవరికైనా మొదట ఇదే గుర్తొస్తుంది కానీ వాళు ఆ స్థాయికి రావడానికి పడే కష్టాలు, ఇబ్బందులు, ఎదుర్కొన్న సమస్యలు ఇవేవీ కనిపించవు. ఇండస్ట్రీకి రాకముందు, రీల్ లైఫ్ కాకుండా రియల్ లైఫ్ లో ఒక్కొక్కరు ఒక్కో సమస్యను ఎదుర్కొని ఉంటే, కొంతమందికి తమలో తమకే ఒక సమస్య ఉంటుంది. బుల్లితెర నటి నుంచి సినీ నటిగా.. టెలివిజన్ ఇండస్ట్రీ నుంచి సినీ రంగంలోకి వచ్చిన భామ మృణాల్ ఠాకూర్ జర్నీ కూడా అలాంటిదే. ఆమె కెరీర్ జర్నీ చాలా ఇన్స్పిరేషన్ కూడా. అయితే మృణాల్ ఎన్ని సినిమాలు చేసినా ఆమెకు ఎక్కువ క్రేజ్ ను తెచ్చిపెట్టింది మాత్రం సీతారామం సినిమానే. ఆ సినిమాలో సీతగా కనిపించి, తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు మృణాల్. సీతారామంతో నెక్స్ట్ లెవెల్ క్రేజ్ సీతారామం తర్వాత మృణాల్ పలు సినిమాలు చేసి, వాటితోనూ మంచి ఫలితాల్ని అందుకున్నారు. అయితే సక్సెస్‌ఫుల్



హీరోయిన్ గా రాణిస్తున్న మృణాల్ లో మొదటి నుంచి ఓ సమస్య ఉండేదట. అదే ఆత్మవిశ్వాసం. తనకు ముందు నుంచి కూడా ఆత్మవిశ్వాసం తక్కువని, ఇండస్ట్రీలోకి వచ్చిన తర్వాతే తనకు ఆత్మవిశ్వాసం పెరిగిందని ఆమె చెప్పారు. ఫిబ్రవరి 20న దో దివానే సెహర్ మే రిలీజ్ ఈ విషయాన్ని స్వయంగా మృణాల్ ఠాకూరే ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. సిద్ధాంత్ చతుర్వేదితో కలిసి మృణాల్ చేసిన దో దివానే సెహర్ మే అనే సినిమా ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా ఆ చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా పలు ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న మృణాల్ ఈ విషయాన్ని బయటపెట్టారు. ఇండస్ట్రీకి వచ్చిన కొంత కాలం వరకు కూడా తనలో ఆత్మవిశ్వాసం చాలా తక్కువగా ఉండేదని చెప్పారు. నమ్మకముండేది కాదట ఏ పని మొదలుపెట్టి చేస్తున్నా తనకు సెల్ఫ్ కాన్ఫిడెన్స్ కాస్త తక్కువగానే ఉండేదని, ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో కూడా తాను ఏ సినిమా ఒప్పుకున్నా, ఏ పాత్ర చేస్తున్నా దాంతో పాటూ తనను కొన్ని అనుమానాలు వెంటాడేవని, ఈ పాత్రకు నేను సరిపోతానా అనే ప్రశ్న తనకు మనసులో తరచూ మెదిలేదని, రీసెంట్ గా రిలీజైన సన్ ఆఫ్ సర్దార్2 మూవీ వరకు కూడా తాను అలానే ఫీలయ్యే దాన్నని ఆమె తెలిపారు. కానీ ఇప్పుడు తనలో సెల్ఫ్ కాన్ఫిడెన్స్ బాగా పెరిగిందని, కాకపోతే ఆ కాన్ఫిడెన్స్ రావడానికి తనకు చాలా టైమ్ పట్టిందని, అప్పుడప్పుడు నన్ను నేను నమ్మడానికి ఇంత టైమ్ తీసుకున్నానని అనిపిస్తుందని ఆమె చెప్పారు. అయితే ఇప్పుడు ఆత్మవిశ్వాసం పెంచుకున్న మృణాల్, దాని గురించి సరికొత్తగా చెప్తున్నారు. ఆత్మవిశ్వాసమంటే భయం లేకపోవడం కాదని, భయంతో కూడి ముందుకు సాగడం అని అంటున్నారు.




## స్వయంభూ సర్ ప్రైజ్.. ఈసారి లెక్కలు గట్టిగానే ఉండబోతున్నాయి!




టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ తన వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులను ప్రతీసారి థ్రిల్ చేస్తుంటాడు. ‘కార్తికేయ 2’ తో పాన్ ఇండియా రేంజ్ హిట్ అందుకున్న నిఖిల్, ఇప్పుడు ‘స్వయంభూ’ అనే భారీ పీరియడ్ డ్రామాతో మన ముందుకు రాబోతున్నారు. ఈ సినిమా షూటింగ్ మొదలైనప్పటి నుండి ఏదో ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ తో మేకర్స్ సినిమాపై హైప్ క్రియేట్ చేస్తూనే ఉన్నారు. లేటెస్ట్ గా ఈ మూవీకి సంబంధించిన ఒక అదిరిపోయే వీడియో సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఒక వారియర్ గెటప్ లో ఉన్న వ్యక్తి నేరుగా సినిమా సెట్స్ లోకి వెళ్ళిపోవడం చూస్తుంటేనే క్యూరియాసిటీ పెరుగుతోంది. ఆ వారియర్ క్యారెక్టర్ ఎవరికైతే ఒక స్పెషల్ మెసేజ్ ఇస్తాడో, వారి రియాక్షన్ చూస్తుంటే ఈ సినిమాలో ఏదో మ్యాజిక్ ఉండబోతుందని అర్థమవుతోంది. నటి సంయుక్త మీనన్, నభానటేష్ వంటి స్టార్స్ కూడా ఈ వీడియోలో కనిపించి అందరినీ సర్ప్రైజ్ చేశారు. ఈ డిఫరెంట్ ప్రమోషన్ స్టైల్ ఇప్పుడు యూత్ ను ఎట్రాక్ట్ చేసింది. అసలు విషయం ఏంటంటే ఈ ఫిబ్రవరి 11న ‘స్వయంభూ’ ఎపిక్ టీజర్ విడుదల కాబోతోంది. మేకర్స్ ఈ విషయాన్ని ఒక క్రియేటివ్ వీడియో ద్వారా అఫీషియల్ గా కన్ఫర్మ్ చేశారు. కేవలం టీజర్ రిలీజ్ డేట్ మాత్రమే కాకుండా, దీని లాంచ్ కోసం టీమ్ చాలా గ్రాండ్ గా ప్లాన్ చేసింది. ముంబైతో పాటు హైదరాబాద్ లో కూడా భారీ ఈవెంట్స్ నిర్వహించబోతున్నారు. బాక్సాఫీస్ దగ్గర నిఖిల్ మరోసారి తన మార్క్ చూపించడానికి రెడీ అవుతున్నట్లు కనిపిస్తోంది. హైదరాబాద్ లోని ప్రసాద్స్ మల్టీప్లెక్స్ రాజశ స్క్రీన్ లో ఉదయం 9 గంటలకు టీజర్ లాంచ్ ఈవెంట్ జరగనుంది. ముంబైలోని సిటీ మాల్ లో గ్రాండ్ గా ఈ టీజర్ ను రిలీజ్ చేయబోతున్నారు. ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఈ టీజర్ లో విజువల్స్ పక్కా హై రేంజ్ లో ఉంటాయట. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో వస్తున్న ఈ ప్రాజెక్ట్ లో నిఖిల్ ఒక పవర్ ఫుల్ వారియర్ రోల్ లో కనిపిస్తారనే విషయం అందరికీ తెలిసిందే. యాక్షన్ సీక్వెన్స్ లు కూడా ఈ సినిమాలో ఒక రేంజ్ లో ఉండబోతున్నట్లు టాక్. ఇక నిఖిల్ కెరీర్ లోనే ఇది బిగ్గెస్ట్ బడ్జెట్ సినిమాగా రూపొందుతోంది. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇప్పటికే నిఖిల్ ఈ సినిమా కోసం కత్తి యుద్ధం, గుర్రపు స్వారీ వంటి విద్యల్లో శిక్షణ తీసుకున్నారు. అందుకే ఈ టీజర్ లో ఆయన క్యారెక్టర్ ఎలా ఉండబోతుందో అని ఫ్యాన్స్ ఆత్రుతగా వెయిట్ చేస్తున్నారు. ఇక ఫిబ్రవరి 11న రాబోతున్న ఈ టీజర్ తో ‘స్వయంభూ’ అసలు హడావుడి మొదలవ్వబోతోంది. మరి నిఖిల్ ఈ పీరియడ్ డ్రామాతో ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తారో తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే.

## బడ్జెట్ సర్ధలేక డైలమా! ‘క్రిష్ 4’పై ‘వార్ 2’ ఎఫెక్ట్?





సయ్యారా లాంటి చిన్న బడ్జెట్ సినిమా దాదాపు 300కోట్ల నెట్ వసూలు చేసింది. భారతదేశంలో 1000 కోట్ల క్లబ్ అనేది ఇప్పుడు కష్టమేమీ కాదు. ఇటీవల విడుదలైన -దురంధర్- 1000 కోట్ల నెట్ వసూళ్లతో సంచలనం సృష్టించింది. కేవలం హిందీ బెల్ట్ నుంచి ఇంత పెద్ద మొత్తం వసూలు చేసిందని నిర్మాతలు చెబుతున్నారు. ఈ ఫలితం చూశాక, భారతదేశం నుంచి 2000 కోట్ల వసూళ్లను సాధించడం కష్టమేమీ కాదని నిపుణులు అంచనా వేస్తున్నారు. సరైన కంటెంట్, స్టార్ పవర్ తో పాటు భారీ విజువల్ గ్రాఫిక్స్ ఉన్న సినిమాలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడతారని అంచనా వేస్తున్నారు. అయితే ఇలాంటి సమయంలో కూడా యష్ రాజ్ ఫిలింస్ లాంటి అగ్ర నిర్మాణ సంస్థ ఓ క్రేజీ సీక్వెల్ విషయంలో వెనక్కి తగ్గడం చర్చనీయాంశమైంది. తాజా సమాచారం మేరకు క్రిష్ 4 బడ్జెట్ విషయంలో యష్ రాజ్ ఫిలింస్ ఆదిత్యా చోప్రాతో హృతిక్ రోషన్ వాగ్వాదానికి దిగారని గుసగుస వినిపిస్తోంది. హృతిక్ 500 కోట్ల బడ్జెట్ అడుగుతుంటే, ఆదిత్య చోప్రా 250 కోట్ల బడ్జెట్లో సినిమా తీయాలని సూచించారట. ఒక డెబ్యూ దర్శకుడిని నమ్మి 500 కోట్లు పెట్టడం సరైనదేనా? అనే సందేహం ఆదిత్యాకు ఉంది. అదే సమయంలో వార్ 2 ఫలితం కూడా క్రిష్ 4 బడ్జెట్ మ్యాటర్ లో ప్రతికూలంగా పని చేస్తోందని చెబుతున్నారు. కారణం ఏదైనా హృతిక్ రోషన్ డ్రీమ్ ప్రాజెక్ట్ -క్రిష్ 4- ప్రస్తుతానికి వాయిదా పడిందని చెబుతున్నారు. బడ్జెట్ మ్యాటర్ లో ఆదిత్య చోప్రా దిగి రావడం లేదని చెబుతున్నారు. ప్రస్తుతానికి బడ్జెట్ లెక్కలు తేలడం లేదు. కానీ హృతిక్ ఈ చిత్రాన్ని అంతర్జాతీయ స్థాయి హాలీవుడ్ సూపర్ హీరో సినిమాలకు ధీటుగా తెరకెక్కించాలని, క్రిష్ ఫ్రాంచైజీలోని గత చిత్రాలను మించి విజువల్ వండర్ ని తీయాలని పట్టుదలగా ఉన్నారట. ఇందుకోసం సుమారు 500 కోట్లు బడ్జెట్ అవసరమని ఆయన పట్టుబడుతున్నారు. ముఖ్యంగా గ్రాఫిక్స్ , యాక్షన్ సీక్వెన్సుల కోసం భారీ ఖర్చు చేయాల్సి ఉంటుందని ఆదిత్య చోప్రాకు చెప్పారట. మరోవైపు, నిర్మాత ఆదిత్య చోప్రా ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఈ సినిమా బడ్జెట్‌ను 250 కోట్లకు పరిమితం చేయాలని సూచిస్తున్నారు. అయితే బడ్జెట్ మ్యాటర్ లో ఎవరూ తగ్గడం లేదు. వీరిద్దరి మధ్య తీవ్రస్థాయి వాగ్వాదం జరగకపోయినా, అభిప్రాయ భేదాల వల్ల సినిమాను ప్రస్తుతానికి పక్కన పెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.డెబ్యూ దర్శకుడికి 500 కోట్లు ఇవ్వడం సరైనదేనా? అయితే క్రిష్ 4 తో హృతిక్ రోషన్ దర్శకుడిగా ఆరంగేట్రం చేయాలని భావిస్తున్నారు. అయితే ఒక డెబ్యూ దర్శకుడిని నమ్మి అన్ని కోట్లు పెట్టుబడి పెట్టడం ఎలా అనేది సస్పెన్స్ . ఆదిత్య చోప్రా దీనిపై సీరియస్ గానే ఆలోచిస్తున్నట్లు కథనాలొస్తున్నాయి. అయితే హృతిక్ వైపు ఆలోచిస్తే -క్రిష్- అనేది ఒక పెద్ద బ్రాండ్. దాన్ని సరిగ్గా ప్రెజెంట్ చేయకపోతే ప్రేక్షకులు నిరాశ చెందుతారు. కాబట్టి నాణ్యత కోసం ఎక్కువ బడ్జెట్ అడగడంలో తప్పు లేదని విశ్లేషిస్తున్నారు. ఒక నిర్మాతగా ఆదిత్య చోప్రా వైపు చూస్తే.. సినిమా లాభాల్లోకి రావాలంటే బడ్జెట్ కంట్రోల్‌లో ఉండాలి. -వార్ 2- వంటి సినిమాలతో భారీ నష్టాలు వచ్చాయి కదా! అందువల్ల హృతిక్ రోషన్ తో బ్యాక్ టు బ్యాక్ ప్రయోగాలు చేయలేమని కూడా అతడు భావిస్తున్నాడట. ముఖ్యంగా అతడు తన మొదటి చిత్రానికే ఏకంగా 500 కోట్లు అడగడంతో దీనిపై ఆదిత్య చోప్రా వెనకాడేసారు. తాజా సమాచారం మేరకు హృతిక్ ప్రస్తుతానికి క్రిష్ 4 ని పక్కన పెట్టేయలేదు కానీ, స్క్రిప్ట్ ని బడ్జెట్ కి అనుగుణంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆదిత్యా చోప్రా సూచనలను పాటిస్తూ, అనవసరమైన గ్రాండియారిటీ ఖర్చులను కూడా ట్రిమ్ చేస్తున్నారట. ఇంతలోనే అతడు మరో ప్రాజెక్టుకు దర్శకత్వం వహించాలని కూడా భావిస్తున్నట్టు తెలుస్తోంది. రాకేష్ రోషన్ 1000 కోట్ల బడ్జెట్ రూమర్స్ నిజానికి క్రిష్ 4 కోసం ఫ్రాంఛైజీ నిర్మాత రాకేష్ రోషన్ ఏకంగా 1000 కోట్ల బడ్జెట్ కావాలని ఎదురు చూసినట్టు కథనాలొచ్చాయి. హాలీవుడ్ నుంచి భారీ విజువల్ గ్రాఫిక్స్ ఉన్న సినిమాలకు ధీటుగా తెరకెక్కించకపోతే పోటీలో నెగ్గుకు రావడం కష్టమని ఆయన భావించినట్టు బాలీవుడ్ హంగామా పేర్కొంది. అయితే అప్పట్లో ఓ ఇంటర్వ్యూలో ఈ ప్రాజెక్టుతో ముడిపడిన సవాళ్ల గురించి ఆదిత్య చోప్రా ఓపెన్ గా మాట్లాడారు. సినిమా ఆగిపోలేదు. స్క్రిప్ట్ పనులతో పాటు బడ్జెట్ మ్యాటర్స్ పై చర్చిస్తున్నామని తెలిపారు. పెద్ద బడ్జెట్ పెట్టే ప్రముఖుడి కోసం ఎదురు చూస్తున్నామని కూడా తెలిపారు. గతంలో ఈ సినిమా బడ్జెట్ 700కోట్ల నుండి 1000 కోట్ల వరకు ఉంటుందని సోషల్ మీడియాలో పుకార్లు వచ్చాయి.

## మినీ ఫ్రాక్ లో పిచ్చెక్కిస్తున్న సిమ్రాన్ చౌదరి..

ఒకవైపు సినిమాలతో బిజీగా ఉంటూనే.. మరొకవైపు అభిమానులను అలరించడానికి నిత్యం పరితపిస్తున్న హీరోయిన్స్ ఎంతోమంది ఉన్నారు. ముఖానికి మేకప్ వేసుకుని కెమెరా ముందు దర్శనమిచ్చే ఈ అమ్మాయిలు.. తమ అందాలతో యువతను విపరీతంగా అలరిస్తున్నారు అనడంలో సందేహం లేదు. నిత్యం సినిమా షూటింగ్ లతో బిజీగా ఉండే ఈ హీరోయిన్స్ అభిమానులను ఎప్పటికప్పుడు అలరించడానికి భిన్న విభిన్నమైన వస్త్రధారణలతో అలరిస్తున్న విషయం తెలిసిందే. ఇకపోతే ఫోటోషూట్ అంటూ ప్రత్యేకంగా కొన్ని ప్రదేశాలను కూడా ఎంపిక చేసుకొని తమ అందాలతో ఆడియన్స్ హృదయాలను దోచుకుంటున్నారు. అందులో భాగంగానే ప్రముఖ యంగ్ బ్యూటీ సిమ్రాన్ చౌదరి కూడా తన అందాలతో ఆకట్టుకోవడానికి మరోసారి అభిమానుల ముందుకు వచ్చేసింది. అయితే ఈసారి తన ఫోటోషూట్ ను టెన్నిస్ కోర్టు నుంచి షేర్ చేసుకోవడం గమనార్హం. స్కై బ్లూ అండ్ వైట్ మినీ స్కర్ట్ ధరించి తన అందాలతో మెస్మరైజ్ చేసింది. పైగా ఉల్లి పొరలాంటి వైట్ కలర్



షర్ట్ ధరించి పలు రకాల ఫోజులతో యువతను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సిమ్రాన్ చౌదరి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడమే కాకుండా అమ్మడి అందానికి ముగ్ధులవుతున్నారు. విశ్వక్ సేన్ పాగల్, అథర్వ వంటి చిత్రాలతో భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న సిమ్రాన్ చౌదరి ఈ ఏడాది ‘వనవీర’ సినిమాతో కొత్త సంవత్సరాన్ని ప్రారంభించింది. 2026 జనవరి 1న విడుదలైన తెలుగు యాక్షన్ డ్రామా చిత్రంగా వచ్చిన ఈ చిత్రానికి అవినాష్ తిరువీధుల దర్శకత్వం వహించారు. నందు విజయ్ కృష్ణ తో కలిసి నటించారు. పౌరాణిక ప్రేరేపిత యాక్షన్ చిత్రమే కానీ అంచనాలు పెద్దగా లేకపోవడం వల్ల ఈ సినిమా బాక్సాఫీస్ వద్దగా రాణించలేదు. ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతాన్ని అందించారు. మరోవైపు టీవీ సిరీస్ ‘మిషన్ తఫాసీ’ లో కూడా నటిస్తోంది. ప్రస్తుతం ఇది షూటింగ్ దశలో ఉన్న విషయం తెలిసిందే. అలాగే తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ‘ఈ నగరానికి ఏమైంది?’ సీక్వెల్ లో కూడా నటిస్తోంది. ప్రస్తుతం ఈ నగరానికి ఏమైంది రిపీట్ ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటుంది. కాలేజ్ ఫ్రెండ్షిప్, ఫన్, కలలు వంటి అంశాలను మిళితం చేస్తూ చాలా సహజంగా చూపించిన ఈ నగరానికి ఏమైంది అనే సినిమా అప్పట్లో సూపర్ హిట్ గా నిలిచింది . ఇప్పుడు ఆ సినిమాకు కొనసాగింపుగా ఈ నగరానికి ఏమైంది రిపీట్ అంటూ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అక్టోబర్ లేదా నవంబర్ నెలలో ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కూడా శరవేగంగా సాగుతోంది. మొత్తానికైతే సిమ్రాన్ చౌదరి ఇలా ఒకవైపు వరుస సినిమాలలో హీరోయిన్గా నటిస్తూనే.. మరొకవైపు అందాలు ఆరబోస్తూ అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది.

## దీపిక మెడలో వజ్రాల హారం ఖరీదు తెలుసా?

దీపిక పదుకొనే స్టైల్ కంటెంట్- ఫ్యాషన్ సెన్స్ ఎప్పుడూ ఆశ్చర్యపరుస్తుంది. ఈ భామ దుబాయ్‌లో జరిగిన ఒక ఈవెంట్‌లో తన రాయల్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. తల్లి అయిన తర్వాత దీపిక డ్యాషింగ్ ఫోటోషూట్ అభిమానులను మెస్మరైజ్ చేస్తోంది. ఇది ఆల్ బ్లాక్ లుక్.. బ్లాక్ జాకెట్ - లాంగ్ స్కర్ట్ లో దీపిక స్టన్నింగ్ ఎలివేషన్ అందరి దృష్టిని ఆకర్షించింది. దీపిక వ్యక్తిత్వానికి తగ్గట్టే ఈ అవుట్‌ఫిట్ అత్యంత స్టైలిష్ పవర్ -క్వీన్- వైబ్ ని ఇచ్చింది. దీపిక హెయిర్ స్టైల్ , మేకప్ కూడా చాలా సింపుల్‌గా ఆకర్షిస్తోంది. దీపికలోని డ్యాషింగ్ అటైర్‌ని ఈ కొత్త లుక్ హైలైట్ చేస్తోంది. దీపికా ఈ ఈవెంట్ కోసం ప్రముఖ డిజైనర్ గౌరవ్ గుప్తా రూపొందించిన ప్రత్యేకమైన బ్లాక్ జాకెట్ -స్కర్ట్ ధరించారు. ఆ నలుపు రంగు దుస్తుల మీద మెరిసిపోతున్న ఈ వజ్రాల హారం ఒక యువరాణిని తలపిస్తోంది. ముఖ్యంగా ఈ అందమైన ఫోటోషూట్‌లో అందరి దృష్టిని ఆకర్షించిన విషయం వేరొకటి ఉంది. అది తన మెడలోని వజ్రాల హారం. ఇది పాపులర్ లగ్జరీ జ్యువెలరీ బ్రాండ్ -కార్టియర్-కు చెందింది. మెడకు హత్తుకుపోయేలా ఉన్న ఈ చోకర్ స్టైల్ హారం, దీపికా ధరించిన బ్లాక్ డ్రెస్ మీద అద్భుతంగా మెరిసిపోతోంది. దీని విలువ కోట్లాది



రూపాయల్లో ఉంటుందని అంచనా. ఈ డిజైనర్ లుక్ చూడగానే సెలబ్రిటీల నుంచి అద్భుతమైన రియాక్షన్ వచ్చింది. ముఖ్యంగా కంచె బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ స్పందిస్తూ డ్యామ్న్ అంటూ ఫైర్ ఈమోజీలను షేర్ చేసింది. కేవలం 16 గంటల్లోనే ఈ ఫోటోలకు లక్షలాది లైకులు, వేలాది కామెంట్స్ వచ్చాయి. అభిమానులు ది ఓజీ క్వీన్ ఈజ్ బ్యాక్ అంటూ ప్రశంసిస్తున్నారు. అయితే దీపిక మెడలో హారం ఖరీదు గురించి ఆరా తీస్తే షాకిచ్చే విషయాలు తెలిసాయి. కార్టియర్ సంస్థ అధికారికంగా ఈ హారం ధరను వెల్లడించకపోయినా ఒక అంచనా ప్రకారం.. సుమారు 10-15 కోట్ల మధ్య ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీపిక గతంలోను కార్టియర్ బ్రాండ్ కి చెందిన 4.5 కోట్ల ఖరీదైన హారాన్ని ధరించి ఆశ్చర్యపరిచింది. ఇప్పుడు అంతకుమించి ఖరీదైన హారాన్ని ధరించి దుబాయ్ ఈవెంట్లో సందడి చేసింది. ఈ హారంలో ప్రధాన ఆకర్షణ 63.76 క్యారెట్ల భారీ రుబెల్లైట్ పెండెంట్. ఇది ఒక అరుదైన అత్యంత ఖరీదైన రత్నం. ఇలాంటి ఒక్కో హారాన్ని తయారు చేయడానికి కార్టియర్ కళాకారులు సుమారు 1000 నుండి 2000 గంటల సమయం కష్టపడతారు. దీపికా పదుకొనే తదుపరి ప్రాజెక్టులు ప్రస్తుతం దీపికా తన కెరీర్‌లో అత్యంత కీలకమైన దశకు చేరుకుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536